ఎలక్ట్రిక్ వాహనాలకు
సౌండ్ అలర్ట్ సిస్టమ్!
ఈవీలు నడిచేటప్పుడు
కృత్రిమంగా శబ్దం చేసే ఏవీఏఎస్
2026 అక్టోబరు తర్వాత తయారయ్యే
ఈవీలన్నింటికీ ఈ వ్యవస్థ తప్పనిసరి
ప్రస్తుత వాహనాలకు అమర్చేందుకు
2027 అక్టోబరు 1 దాకా గడువు 2

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 30-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 205 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి సా.6.06 తదుపరి నవమి, నక్షత్రం: మూల ఉ.6.18 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ. 6.37-6.20, దుర్ముహూర్తం: ఉ.8.31-9.18, రా.9.59-10.46, అమృతఘడియలు: రా.2.56-4.39, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.01 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న సీఎం చంద్రబాబు దంపతులు, చిత్రంలో మంత్రి కొల్లు, ఎంపీ చిన్ని తదితరులు

దుర్గమ్మ దర్శనానికి ఎలివేటెడ్
క్యూ కాంప్లెక్స్

రూ.14 కోట్లతో 5 నెలల్లో పూర్తి చేస్తాం
ఇంద్రకీలాద్రిపై మరిన్ని సౌకర్యాలు: సీఎం

రూ.26 కోట్లతో అన్నప్రసాద భవనం
27 కోట్లతో కొత్త ప్రసాదం తయారీ కేంద్రం
వైభవంగా గోదావరి, కృష్ణా పుష్కరాలు
కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు

సీఎం అంతరాలయంలో ఉండగానే దర్శనాలు కొనసాగింపు

విజయవాడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదికి 2027లో, కృష్ణా నదికి 2028లో వచ్చే పుష్కరాలను వైభవంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం చేపట్టే మంచి పనులకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని, ప్రజలకు సుఖసంతోషాలు అందించాలని ప్రార్థించానని

మిగతా 12వ పేజీలో...

నేడు ఢిల్లీకి చంద్రబాబు
పెట్టుబడుల సదస్సుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరనున్న సీఎం
అమిత్‌షా, నిర్మలతోనూ భేటీ 13

ప్రతి చెరువూ నిండాలి
రాష్ట్రం కరువు రహితం కావాలి
కలెక్టర్లకు సీఎం ఆదేశం 12

షాక్‌లకు చెక్!

ట్రూఅప్‌ల నుంచి ట్రూడౌన్‌లోకి రాష్ట్రం

యూనిట్‌కు 13 పైసలు ఊరట.. వినియోగదారులకు 923 కోట్లు వాపస్

వ్యవస్థల సమర్థ నిర్వహణ ఫలితమిది
వైసీపీ హయాంలో అడ్డగోలు కొనుగోళ్లు
అవినీతికి అడ్డాగా విద్యుత్ రంగం
ఫలితంగా తొమ్మిది సార్లు చార్జీల పెంపు
ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట వినియోగదారులపై రూ.32 వేల కోట్ల భారం
విద్యుత్తు సంస్థలూ అప్పులఊబిలోనే..
నాడు ట్రూడౌన్‌ను పంచుకున్న డిస్కమ్‌లు
నేడు ప్రజలకు తిరిగిచ్చేయాలని నిర్ణయం

ఈఆర్‌సీ చరిత్రలోనే ఇది తొలిసారి
జీర్ణించుకోలేకపోతున్న వైసీపీ



ఆంధ్రజ్యోతి పరిశీలన

అమరావతి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యుత్తు వినియోగదారులపై మోపిన భారం అక్షరాలా రూ.32,166 కోట్లు. ట్రూఅప్ చార్జీలు.. ఇంధన సర్దుబాటు చార్జీలు(ఎఫ్‌పీపీసీఏ)...పేరు ఏదైనా లక్ష్యం ప్రజల నడ్డి విరవడమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 నెలల కాలంలోనే విద్యుత్తు చార్జీల బాదుడు నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించింది. ఈ లబ్ధి విలువ రూ.923.55 కోట్లు. ఇది ఎలా సాధ్యమైంది..? విద్యుత్తు చార్జీల పెంపు మాట వినడమే తప్ప తగ్గుదల అనే పదాన్ని ఊహించని వినియోగదారులకు ఊరట కలిగించేలా యూనిట్‌కు 13 పైసలు తగ్గుదల ఎలా సాధించగలిగారు..? వ్యవస్థలను

మిగతా 13వ పేజీలో...

ఐదేళ్లూ జనాన్ని బాదిన జగన్... ఇప్పుడు విద్యుత్ 'చార్జీల ట్రూడౌన్'ను జీర్ణించుకోలేకపోతున్నారు. 'అబ్బే... ఇది చంద్రబాబు గొప్పకాదు! విద్యుత్ నియంత్రణ కమిషన్ ఈఆర్‌సీ షాక్ ఇచ్చినందుకే తగ్గించారు' అని జగన్ రోత పత్రిక వింత కథలు చెప్పింది. జగన్ హయాంలో ట్రూడౌన్ లబ్ధి ప్రజలకు ఎందుకు చేరలేదు? ఈ ప్రశ్నకు మాత్రం జగన్ పత్రిక సమాధానం చెప్పలేదు. ఈఆర్సీ ఆదేశాల ప్రకారమే చార్జీల వసూలు ఉంటుంది. జగన్ హయాంలో డిస్కమ్‌లు ఉజ్జాయింపు వ్యయం చూపిస్తూ... ఏటా యూనిట్‌కు 40 పైసల చొప్పున ట్రూఅప్ ప్రతిపాదించడం, ఈఆర్సీ ఆమోదించడం జరుగుతూ వచ్చింది. అసలు విషయం ఏమిటంటే.. జగన్ హయాంలో ఎడాపెడా విద్యుత్ కొనుగోళ్ల ఫలితంగా 40 పైసలకు మించే ఖర్చయిందని చెబుతూ, మరింతగా ట్రూ అప్ బాదుడు బాదేవాళ్లు. 2024-25 ట్రూ అప్ ప్రతిపాదనలను జగన్ హయాంలోనే ఈఆర్సీకి సమర్పించారు. దాని ప్రకారమే వసూళ్లు జరిగాయి. కానీ... కూటమి సర్కారు వచ్చాక విద్యుత్ కొనుగోళ్లలో అనుసరించిన హేతుబద్ధత కారణంగా వ్యయం తగ్గింది. దీని ఫలితమే.. యూనిట్‌కు 13 పైసల చొప్పున 'ట్రూ డౌన్'! ప్రజలపై భారం తగ్గడం నిజం! ఇందులో ప్రభుత్వానికి 'షాక్' కనిపించడం రోత పత్రిక నైజం!

ఇంధన రంగాన్ని గాడిన పెట్టాం
అధిక ధర కొనుగోళ్లకు పవర్ స్వాపింగ్‌తో చెక్ 13
నవంబరు నుంచి యూనిట్‌కు 13 పైసలు తగ్గింపు: సీఎం







అన్నా.. నీకు ప్రత్యేక బహుమతి!
లోకేశ్‌కు తన క్యాప్ బహూకరిస్తున్నట్లు క్రికెటర్ తిలక్ వర్మ వీడియో
తమ్ముడూ.. నీ బహుమతి నాకెంతో ప్రత్యేకమంటూ స్పందించిన మంత్రి లోకేశ్ 10

విదేశీ సినిమాలపై
100% టారిఫ్

ఫర్నిచర్‌పైనా సుంకాల పెంపు.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
భారత చిత్ర పరిశ్రమపై ప్రభావం.. నెట్‌ఫ్లిక్స్ షేరు ధరలో 1.5% తగ్గుదల

వాషింగ్టన్, సెప్టెంబరు 29: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం మరోసారి టారిఫ్‌ల కొరడా ఝళిపించారు. ఈసారి విదేశీ సినిమాలపై సుంకాలను 100% మేర పెంచారు. విదేశీ ఫర్నిచర్‌పై సుంకాలను పెంచనున్నట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలను తరువాత ప్రకటిస్తామని తెలిపారు. వినోద, తయారీ రంగాల ఉద్యోగాలను తిరిగి అమెరికాకు తీసుకొచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టులు పెట్టారు. హాలీవుడ్‌పై దృష్టి సారించిన ఆయన విదేశీ పోటీదార్ల కారణంగా సినిమా పరిశ్రమపై అమెరికా ఆధిపత్యం తగ్గిందని అభిప్రాయపడ్డారు. "మన సినీ నిర్మాణ వ్యాపారాన్ని ఇతర దేశాలు దొంగిలించాయి. చిన్న పిల్లల చేతిలోని చాక్లెట్‌ను లాక్కొన్నట్టు తీసుకెళ్లిపోయాయి. ముఖ్యంగా బలహీన, అసమర్థ గవర్నర్ కారణంగా కాలిఫోర్నియా నష్టపోయింది. చిరకాలంగా, ముగింపంటూ లేకుండా సాగుతున్న ఈ సమస్యను పరిష్కరించడానికి అమెరికా బయట నిర్మించిన అన్ని సినిమాలపై 100% టారిఫ్ విధించాలని ప్రతిపాదిస్తున్నా" అని పేర్కొన్నారు. ఆ తరువాత మరో పోస్టు పెడుతూ ఒకప్పుడు ఫర్నిచర్ తయారీ రంగంలో ఒక వెలుగువెలిగిన నార్త్ కరోలినా రాష్ట్రానికి పూర్వ వైభవం తెచ్చేందుకు విదేశీ ఫర్నిచర్‌పై టారిఫ్‌లు పెంచుతామని తెలిపారు. "చైనా, ఇతర దేశాల కారణంగా నార్త్ కరోలినా ఫర్నిచర్ వ్యాపారాన్ని పూర్తిగా కోల్పోయింది. ఆ రాష్ట్రాన్ని

మిగతా 2వ పేజీలో...




శ్వేత సౌధం.. స్వర్ణమయం! 2
ఓవల్ ఆఫీస్, క్యాబినెట్ రూమ్‌లకు 24 క్యారెట్ల బంగారంతో తాపడం
ప్రపంచ నేతలు విస్తుపోతారన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
ఈ ఆడంబరం ఎందుకు: అమెరికన్లు



'సినిమా' దొంగలు
దొరికారు!

అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఐదుగురి అరెస్ట్
ఐదేళ్లలో 500 చిత్రాల పైరసీ
సినీ పరిశ్రమకు రూ.22,400 కోట్ల నష్టం
2024లోనే టాలీవుడ్‌కు 3700 కోట్ల నష్టం
తెలంగాణ పోలీసుల వెల్లడి 13

మద్యం స్కామ్‌లో
సత్యప్రసాద్‌పై చర్యలు!



సర్కారు పచ్చజెండా.. కోర్టులో సిట్ మెమో
అరెస్టు చేయొచ్చని ప్రచారం
స్కామ్ ప్లాన్ తయారీలో ఈయనే కీలకం
ఏ-1 రాజ్ కసిరెడ్డి ఆదేశాల అమలు,
ముఖ్యులతో తరచూ సమావేశాలు
ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదన

అమరావతి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగన్ జమానాలో జరిగిన రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణంలో అత్యంత కీలక భూమిక పోషించిన ఎక్సైజ్ శాఖ మాజీ అధికారి దొడ్డ వెంకట సత్యప్రసాద్(ఏ-3)పై చట్టపరమైన చర్యలకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమాయత్తమవుతోంది. ఈ వ్యవహారంలో ఆయన అప్రూవర్‌గా మారారు. అయినంత మాత్రాన ముందస్తు బెయిల్ ఇవ్వలేమని ఏసీబీ కోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. దరిమిలా ఆయన పాత్రపై రాష్ట్రప్రభుత్వానికి సిట్ పూర్తి

మిగతా 13వ పేజీలో...

మిథున్‌రెడ్డికి బెయిల్
పలు షరతులతో మంజూరు చేసిన కోర్టు
రాజమండ్రి జైలు నుంచి విడుదల
జైలు వద్ద పోలీసులతో వైసీపీ నేతల వాగ్వాదం 13

నైరుతిలో సాధారణ వర్షపాతం
మొదటి రెండు నెలలు అనావృష్టి.. ఆదుకున్న చివరి రెండు నెలలు
నాలుగు జిల్లాల్లో మిగులు వర్షపాతం.. మరో నాలుగు జిల్లాల్లో లోటు
మిగిలిన జిల్లాల్లో సాధారణం.. నేటితో ముగియనున్న సీజన్ 12



సరూర్‌నగర్‌లో భారీ బతుకమ్మ చుట్టూ చేరి ఆడుతున్న మహిళలు

గిన్నిస్‌బుక్‌లోకి మహా బతుకమ్మ.. మహా ఆట!

హైదరాబాద్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అది భారీ బతుకమ్మ. ఆ బతుకమ్మ ఎత్తు 63.11 అడుగులు. వెడల్పు 36 అడుగులు. ఇంతటి భారీ బతుకమ్మను పేర్చేందుకు 10.7 టన్నుల మేర వివిధ రకాల పూలను ఉపయోగించారు. 300 మంది మూడు రోజుల పాటు శ్రమించి ఈ మెగా బతుకమ్మను రూపొందించారు. 11 స్టేజీలుగా పేర్చిన ఈ మహా బతుకమ్మ కోసం తొమ్మిది రకాల పూలను వాడారు. హైదరాబాద్, సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో సోమవారం 'మన బతుకమ్మ' ఉత్సవాల్లో భాగంగా ఈ బతుకమ్మ స్థానికులను ఔరా అనిపించింది. కార్యక్రమంలో 10వేల మంది మహిళలు పాల్గొన్నారు. ఈ మహా బతుకమ్మ చుట్టూ 1354 మంది మహిళలు కొన్ని వరుసలుగా చేరి బతుకమ్మ ఆడిపాడారు. మరి.. ఇంతటి భారీ బతుకమ్మను పేర్చడం, ఇంతపెద్ద సంఖ్యలో మహిళలు ఆడిపాడటం మామూలు విషయమా? గిన్నిస్ అధికారులే అచ్చెరువొంది.. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో చోటు కల్పించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ సంస్థ ప్రతినిధి స్వప్నిల్ ఈ వేడుకను వీక్షించారు.

శ్వేత సౌధం.. స్వర్ణమయం!

- ఓవల్ ఆఫీస్, క్యాబినెట్ రూంలకు 24 క్యారెట్ల బంగారంతో తాపడం
- ప్రపంచ నేతలు విస్తుబోతారన్న ట్రంప్

వాషింగ్టన్, సెప్టెంబరు 29: అమెరికా అధ్యక్షుడి నివాసం శ్వేత సౌధాన్ని(వైట్ హౌస్) 24 క్యారెట్ల మేలిమి బంగారంతో అలంకరించనున్నట్టు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం ఓవెల్ ఆఫీసు, క్యాబినెట్ రూంలకు బంగారు తాపడం పనులు జరిగినట్టు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలను ఆయన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ పోస్ట్'లో పంచుకున్నారు. ఈ బంగారు అలంకరణలు చూసి ప్రపంచ దేశాల నేతలు విస్తుబోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. "శ్వేత సౌధంలోని ఓవల్ ఆఫీసు, క్యాబినెట్ రూమ్‌లకు అత్యంత నాణ్యమైన 24 క్యారెట్ల బంగారాన్ని వినియోగించాం." అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ వీడియోలో అలంకరణకు సిద్ధంగా ఉన్న బంగారు గోడల ఆకృతులు కనిపించాయి. "మిరిమిట్లు గొలిపే అందాలను చూసి.. ప్రపంచ దేశాల నేతలే కాదు.. ప్రతి ఒక్కరూ సంభ్రమాశ్చర్యాలకు గురవుతారు. విస్తుబోతారు. ఇప్పటి వరకు అత్యుత్తమ అందాన్ని, విజయాన్ని సొంతం చేసుకున్నది ఓవల్ ఆఫీస్ ఒక్కటే!" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అయింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇంత ఆడంబరం ఎందుకని చాలా మంది విమర్శించారు. కాగా, ఈ బంగారు తాపడాలకు అయ్యే ఖర్చును ట్రంప్ సొంత నిధుల నుంచి వెచ్చిస్తున్నట్టు వైట్‌హౌస్ అధికార ప్రతినిధి తెలిపారు.

లోకం తీరు



2 గంటల సలహాకు రూ. 11 కోట్లు తీసుకున్నా

- మూడేళ్లలో రూ.241 కోట్లు గడించా
- వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వెల్లడి

పట్నా, సెప్టెంబరు 29: రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ సోమవారం తన ఆదాయ వివరాలను ఓ బహిరంగ సభలో వెల్లడించారు. ఇతరుల మాదిరిగా తాను దొంగను కానని, ఆదాయ వ్యయాలను స్పష్టంగా అందరికీ చెప్పగలనని అన్నారు. సలహాలు ఇచ్చి కోట్లు గడించానని చెప్పారు. రెండు గంటలపాటు సలహాలు ఇచ్చినందుకు రూ.11 కోట్లు ఫీజుగా తీసుకున్నానని తెలిపారు. రాజకీయాల్లోకి రాకముందు రాజకీయ పార్టీలకు, సంస్థలకు, కంపెనీలకు సలహాలు ఇచ్చినా ఎలాంటి ఫీజులు తీసుకోలేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి వచ్చాక మాత్రం సలహాలు ఇవ్వడం ద్వారా సంపాదన మొదలుపెట్టానని, ఇది సమాజం కోసమేనన్నారు. "వ్యక్తులకు, కంపెనీలకు సలహాలు ఇవ్వడం ద్వారా గత మూడేళ్లలో రూ.241 కోట్లు సంపాదించా. ఇందులో 18 శాతం అంటే రూ.30.98 కోట్లు జీఎస్టీ చెల్లించా. రూ.20 కోట్లు ఆదాయపు పన్నుగా కట్టాను. రూ.98.95 కోట్లు జన్ సురాజ్ పార్టీకి విరాళంగా ఇచ్చా. ఒక కంపెనీకి రెండు గంటల పాటు సలహా ఇచ్చినందుకు రూ.11 కోట్లు తీసుకున్నా. ఇదీ బిహార్ కుర్రాడి శక్తి. మేం దొంగలం కాము" అని వివరించారు. చెల్లింపులు చెక్కుల రూపంలో జరిగాయని తెలిపారు. రాజకీయాల కోసం ప్రశాంత్ కిశోర్ ఎక్కడ నుంచి డబ్బులు తీసుకొస్తున్నారో వెల్లడించాలని బీజేపీ నాయకుడు సంజయ్ జైశ్వాల్ తదితరులు డిమాండ్ చేసిన నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. బీజేపీ నాయకుడు, బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిపైనా ప్రశాంత్ ఆరోపణలు చేశారు. హత్య కేసులో 1995లోనే సామ్రాట్‌కు శిక్ష పడిందని, కానీ మైనర్‌నంటూ నకిలీ సర్టిఫికెట్ చూపించి బయటపడ్డారని ఆరోపించారు. ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఆ 'పాపం' విజయ్‌దే!

జనాన్ని పోగేయడానికే కరూర్‌కు ఆలస్యంగా వచ్చారు

- అనుమతి లేకుండా రోడ్‌షో చేశారు
- విద్యుత్ సరఫరానూ ఆపేయమన్నారు
- కరూర్ ఘోరంపై పోలీసుల ఎఫ్ఐఆర్
- 41కి చేరిన తొక్కిసలాట మృతుల సంఖ్య



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, మురుగన్

చెన్నై/న్యూఢిల్లీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కరూర్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించిన తమిళ వెట్రి కళగం(టీవీకే) ర్యాలీలో జరిగిన తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. టీవీకే అధ్యక్షుడు, ఇళయ దళపతి విజయ్‌ను తప్పుబట్టారు. ఈ ర్యాలీకి విజయ్ ఉద్దేశపూర్వకంగానే ఆలస్యంగా వచ్చారని, అనుమతి లేకుండా రోడ్ షో నిర్వహించారని పేర్కొన్నారు. టీవీకే జిల్లా కార్యదర్శి మధియాళగన్.. 10 వేల మందికి మాత్రమే అనుమతి తీసుకున్నారని.. కానీ, 25వేల మందికి పైగా ర్యాలీకి వచ్చారని పేర్కొన్నారు. జనసమూహాన్ని పోగేయడానికే.. ఉద్దేశపూర్వకంగా విజయ్ ఆలస్యం చేశారని తెలిపారు. "నిర్ణీత సమయం కంటే 4 గంటల పాటు విజయ్ ఆలస్యంగా వచ్చారు. జనాలు భారీగా వచ్చారని రాజకీయంగా ప్రకటించుకునేందుకే ఇలా చేశారు. అప్పటికే వేలాదిగా చేరుకున్న ప్రజలు ఎండలో నిలబడి అలసిపోయారు. ఈ కారణంగానే తొక్కిసలాటలో 11 మంది అక్కడే చనిపోయారు" అని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. "వాస్తవానికి కరూర్ జిల్లా సరిహద్దుకు విజయ్ సాయంత్రం 4.45 గంటలకే చేరుకున్నారు. కానీ, అక్కడి నుంచి ఆయన కదలికలు ఆలస్యం చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా రోడ్ షో నిర్వహించారు. రాత్రి 7 గంటలకు వేలుసామిపురానికి చేరుకున్నారు. కానీ, అప్పటికే నియంత్రించలేని స్థాయిలో జనాన్ని సమీకరించారు. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసు అధికారులు.. పరిస్థితి తీవ్రంగా మారిందని, ప్రజలకు ఊపిరాడే పరిస్థితి కూడా ఉండకపోవచ్చని మధియాళగన్‌ను హెచ్చరించారు. కానీ, ఆయన పట్టించుకోలేదు. చాలా మంది ప్రజలు విజయ్‌ను చూసేందుకు సమీపంలోని చెట్లెక్కారు. మరికొందరు రోడ్డు పక్కన ఉన్న నిర్మాణాల పైకప్పులపైకి ఎక్కారు. దీంతో వారి బరువుతో అవి కుప్పకూలాయి. వాటి కింద ఉన్నవారు ఊపిరి ఆడక ప్రాణాలు కోల్పోయారు. ఒకదశలో టీవీకే నేతలు విద్యుత్ సరఫరాను కూడా ఆపేయమన్నారు." అని ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. దీనిలో టీవీకే జిల్లా కార్యదర్శి మధియాళగన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుషి ఆనంద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీటీఆర్ నిర్మల్ కుమార్ పేర్లను చేర్చారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ సభ్యురాలు జస్టిస్ అరుణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కలుసుకుని వివరాలు సేకరించారు. అదేవిధంగా ఘటన జరిగిన ప్రాంతంలోనూ పర్యటించి స్థానికులతో మాట్లాడారు.

సెలవుల తర్వాతే విచారణ: హైకోర్టు

కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణ చేపట్టాలంటూ టీవీకే దాఖలుచేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టేందుకు హైకోర్టు మదురై ధర్మాసనం నిరాకరించింది. తొక్కిసలాటలో డీఎంకే కుట్ర ఉందని టీవీకే తన పిటిషన్‌లో ఆరోపించింది. ఈ నేపథ్యంలో దీనిపై సీబీఐ దర్యాప్తు చేయించాలని కోరింది. అయితే, ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో ఆ తర్వాతే పిటిషన్‌పై విచారణ చేపడతామని కోర్టు తెలిపింది.

విద్యుత్‌కోత విధించాలని టీవీకే కోరింది!

కరూర్‌లో విజయ్ ప్రసంగిస్తున్న సమయంలో స్టాలిన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా విద్యుత్ సరఫరా నిలిపివేసిందంటూ జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర విద్యుత్ బోర్డు ఖండించింది. విజయ్ ప్రసంగిస్తున్న సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపేయాలని టీవీకే నిర్వాహకులు లేఖ ఇచ్చారని, అయితే ఆ వినతిని తాము తిరస్కరించామని బోర్డు అధికారులు తెలిపారు. ఆ లేఖను మీడియాకు విడుదల చేశారు. కాగా, తొక్కిసలాట ఘటనలో మృతుల సంఖ్య 41కి పెరిగింది. కరూర్ ప్రభుత్వాసుపత్రిలో ఓ మహిళ(61) సోమవారం కన్నుమూశారు. ప్రస్తుతం 11మంది ఐసీయూలో చికిత్స పొందుతుండగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, కరూర్ తొక్కిసలాట ఘటనపై బీజేపీ.. ఎనిమిది మంది ఎన్డీయే ఎంపీలతో కూడిన నిజనిర్ధారణ కమిటీని నియమించింది. ఈ బృందం కరూర్‌కు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించనుంది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను విశ్లేషించి నివేదికను నడ్డాకు సమర్పించనుంది.

ఎవరినీ తప్పుబట్టలేం: నిర్మల

కరూర్ దుర్ఘటనలో ఎవరినీ తప్పుబట్టలేమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సోమవారం కరూర్ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను కలిసి ఓదార్చారు. అనంతరం, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని సూచనల మేరకు తాము కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులుగా బాధితులను పరామర్శించేందుకు వచ్చామని తెలిపారు. నిర్మల వెంట కేంద్ర మంత్రి మురుగన్ తదితరులు ఉన్నారు. కాగా, ఈ ఘటనపై సీఎం స్టాలిన్ సోమవారం మరోమారు స్పందించారు. ఏ పార్టీ నాయకుడైనా తన కార్యకర్తలు, ప్రజలు మరణించాలని కోరుకోరని, ఘటనపై తప్పుడు ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

జీఎస్టీ తగ్గింపుతో పెరిగిన పొదుపు

- ఒక్కో కుటుంబానికి ఏటా రూ.20వేలు ఆదా: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: జీఎస్టీ విషయంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను ప్రధాని మోదీ సమర్థించుకున్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూ 'ప్రగల్భాలు పలికేవారి' (బయాన్ బహదూర్) మాటలకేమిగానీ జీఎస్టీ తగ్గింపు కారణంగా ప్రజలకు సొమ్ము ఆదా అయిందని చెప్పారు. యూపీఏ పాలనతో పోల్చినప్పుడు సంవత్సరానికి రూ.లక్ష వ్యయం చేసే కుటుంబం ప్రస్తుతం రూ.20వేలను మిగుల్చుకోగలుగుతోందని చెప్పారు. సోమవారం ప్రధాని మోదీ ఇక్కడ బీజేపీ ఢిల్లీ శాఖ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ జీఎస్టీ తగ్గింపుతో పాటు ఆదాయపు పన్నులో మినహాయింపులు ఇచ్చిన కారణంగా ప్రతియేటా ఒక్కో కుటుంబానికి రూ.2.5 లక్షల మేర ఆదా అవుతోందని తెలిపారు.

ఇది ఆత్మకథ కాదు.. మీ 'మన్ కీ బాత్'!

- ఇటలీ ప్రధాని మెలోనీ పుస్తకానికి మోదీ ముందు మాట

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆత్మకథకు ప్రధాని మోదీ రాసిన ముందుమాట ఆసక్తికరంగా మారింది. 'అయాం జార్జియా-మై రూట్స్, మై ప్రిన్సిపుల్స్' అనే ఈ పుస్తకం కేవలం ఆత్మకథ కాదని.. అమె 'మన్ కీ బాత్ (మనసులో మాట)' అని పేర్కొన్నారు. 'ప్రధాని మెలోనీ ఆత్మకథ రాస్తుండడం నాకు సంతోషం కలిగిస్తోంది. 11 ఏళ్లుగా పలువురు ప్రపంచ నేతలతో కలిసి నడిచే అవకాశం నాకు కలిగింది. తన పరిపూర్ణ జీవనంలో ప్రధాని మెలోనీకి ఇలాంటి దృష్టాంతాలు ఎన్నో ఎదురై ఉంటాయి' అని మోదీ పేర్కొన్నారు.

తెలంగాణలో స్థానిక ఎన్నికల షెడ్యూలు విడుదల

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది! జడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) షెడ్యూల్‌ను ప్రకటించింది. జడ్పీటీసీ, ఎంపీటీసీలకు రెండు (అక్టోబరు 23, 27 తేదీలు) దశల్లో, సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు మూడు (అక్టోబరు 31, నవంబరు 4, 8వ తేదీల్లో) దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ ప్రక్రియ అక్టోబరు 9న ప్రారంభమై.. నవంబరు 11న ముగియనుంది. సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు పోలింగ్ రోజునే ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటిస్తారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులకు మాత్రం నవంబరు 11న ఓట్లను లెక్కించి, ఫలితాలను ప్రకటించనున్నారు. ఇక, కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) జూలై 15వ తేదీ వరకు సిద్ధం చేసిన ఓటర్ల తుది జాబితా ఆధారంగా పంచాయతీ, వార్డుల వారీగా డీపీవోలు, ఎంపీడీవోల ద్వారా పరిశీలన జరుపుతారు. కాగా, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పార్టీ గుర్తులతోనే ఎన్నికలను నిర్వహిస్తారు. సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికలు మాత్రం పార్టీరహితంగా చేపడతారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇద్దరు కంటే ఎక్కువమంది పిల్లలుంటే అనర్హులనే విధానం ఏళ్ల తరబడి కొనసాగుతోంది.



ఆకాశాన్నంటే ఎత్తు.. ఐఫిల్ టవర్ కన్నా బరువు!

- చైనా ఇంజనీరింగ్ అద్భుతం.. ప్రపంచంలోనే ఎత్తైన బ్రిడ్జి

బీజింగ్, సెప్టెంబరు 29: చైనా మరోసారి తన ఇంజనీరింగ్ అద్భుతంతో ప్రపంచాన్ని అబ్బురపరిచింది. నైరుతి చైనాలోని గిజౌ ప్రావిన్స్‌లోని ఓ భారీ లోయపై 625 మీటర్ల ఎత్తులో నిర్మించిన వంతెనను ఆదివారం అధికారికంగా ప్రారంభించింది. 'హువాజియాంగ్ గ్రాండ్ కెన్యాన్ బ్రిడ్జ్' పేరిట నిర్మించిన ఈ వంతెన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన బ్రిడ్జిగా నిలిచింది. మొన్నటివరకు లోయ చుట్టూ తిరిగి అవతలి వైపుకు చేరుకునేందుకు 2 గంటల సమయం పట్టేది. ఇప్పుడు రెండు నిమిషాల్లోనే వంతెనపై రయ్యిమంటూ దూసుకెళ్లొచ్చు. వంతెన పొడవు 2,890 మీటర్లు కాగా, 22 వేల టన్నుల ఉక్కుతో నిర్మించడం గమనార్హం. అంటే ప్రపంచ ప్రఖ్యాత ఐఫిల్ టవర్ కన్నా మూడు రెట్ల అధిక బరువుతో దీన్ని నిర్మించారు.

ఈవీలకు సౌండ్ అలర్ట్ సిస్టమ్

- 2027 నుంచి కొత్త నిబంధన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. శబ్దం లేకుండా దూసుకెళ్లే ఎలక్ట్రిక్ వాహనాల వల్ల ఇతర వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా.. ఇకపై అన్ని ఎలక్ట్రిక్ కార్లు, బస్సులు, ట్రక్కులకు 'సౌండ్ అలర్ట్ సిస్టమ్' (ఏవీఏఎస్)ను తప్పనిసరి చేయాలని రోడ్డు రవాణా, రహదారుల శాఖ ప్రతిపాదించింది. ఈ కొత్త నిబంధన 2027, అక్టోబరు 1 నుంచి అమలులోకి రానుంది. ఈ మేరకు మంత్రిత్వ శాఖ ఒక ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. 2026 అక్టోబరు తర్వాత తయారయ్యే కొత్త మోడల్ ఎలక్ట్రిక్ వాహనాలు వెంటనే ఈ సౌండ్ సిస్టమ్‌తో రావాలని సూచించింది. అలాగే, ప్రస్తుతం నడుస్తున్న పాత మోడల్ వాహనాలు ఈ సిస్టమ్‌ను అమర్చుకోవడానికి 2027 అక్టోబరు 1 వరకు గడువు ఇచ్చింది.

విదేశీ సినిమాలపై 100% టారిఫ్

(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ 'గ్రేట్'గా మార్చేందుకు అమెరికాలో తయారుచేయని ఫర్నిచర్‌పై టారిఫ్‌లు పెంచుతాం. వివరాలు త్వరలో వెల్లడవుతాయి" అని పేర్కొన్నారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయం భారత సినీ పరిశ్రమపై భారీగా ప్రభావం చూపనుంది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం అమెరికా, కెనడాల్లో ఏ సమయంలో చూసినా 1,000కిపైగా భారత భాషల సినిమాలు ఆడుతుంటాయి. భారత దేశ నిర్మాతలు, అమెరికా డిస్ట్రిబ్యూటర్లు కలిసి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. అందువల్ల విదేశాల్లో నిర్మించిన సినిమాలపై 100% టారిఫ్ విధించే చట్టబద్ధమైన అధికారం అధ్యక్షుడికి ఉందా అన్న దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సినిమాలు మేధోపర హక్కుల కిందికి వస్తాయని, వాటిపై పన్ను విధించలేరని కొందరు నిపుణులు అంటున్నారు. కొన్ని సంస్థలు విదేశీయులతో కలిసి సంయుక్తంగా సినిమాలు తీస్తున్నాయని, వాటి పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి. దీనిపై అధ్యక్షుడి కార్యాలయమైన వైట్‌హౌస్‌ను వార్తా సంస్థలు సంప్రదించగా ఇంకా స్పందించలేదు.

హైఫాకు విముక్తి కల్పించింది భారత జవాన్లే

బ్రిటిషర్లు కాదు.. చరిత్ర పుస్తకాల్లోనూ ఆ మార్పు చేస్తున్నాం.. ఇజ్రాయెల్‌లోని హైఫా నగర మేయర్ వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో హైఫా నగర విముక్తి కోసం తమ ప్రాణాలర్పించిన భారతీయ సైనికులకు.. ఆ నగర మేయర్ డాక్టర్ ఐనత్ కాలిష్-రోటెమ్ నివాళులర్పించారు. భారతదేశానికి-హైఫా నగరానికి మధ్య ఉన్న సుసంపన్నమైన చరిత్రను ప్రేరణాత్మకమైనదిగా ఆయన అభివర్ణించారు. హైఫా నగర భవిష్యత్తుకు సంబంధించి తమ వద్ద భారీ ప్రణాళికలు ఉన్నాయని.. వాటిలో భారత్‌ను ముఖ్యమైన భాగస్వామిగా చేయాలనుకుంటున్నామని పేర్కొన్నారు. ఒట్టోమాన్ సామ్రాజ్యం నుంచి హైఫా నగరానికి విముక్తి కల్పించింది భారతీయ సేనలైతే.. చరిత్ర పుస్తకాల్లో మాత్రం ఆ ఘనత బ్రిటిష్ సేనలకు ఆపాదించారని.. దాన్ని ఇప్పుడు మారుస్తున్నామని ఆయన తెలిపారు. 'నేను హైఫా నగరంలోనే పుట్టి పెరిగాను. ఈ నగరానికి స్వేచ్ఛనిచ్చింది బ్రిటిషర్లంటూ మాకు చెబుతూ వచ్చారు. కానీ, ఒట్టోమాన్స్ నుంచి ఈ నగరానికి విముక్తి కల్పించింది భారతీయులు.. బ్రిటిషర్లు కాదని తెలుసుకున్నట్టు హిస్టారికల్ సొసైటీకి చెందిన వారు నాకు చెప్పేదాకా తెలియదు" అని ఆయన వివరించారు. ఆ కథేంటంటే.. అప్పటికి దాదాపు 400 సంవత్సరాలుగా హైఫా నగరం ఒట్టోమాన్‌ల పాలనలో ఉంది. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో 1918లో సెప్టెంబరు 23న.. బ్రిటిష్ సైన్యంలోని మైసూర్ లాన్సర్స్, హైదరాబాద్ లాన్సర్స్, జోధ్‌పూర్ లాన్సర్స్ రెజిమెంట్లకు చెందిన 400 మంది అశ్విక దళ సైనికులు హైఫా నగర విముక్తికి నడుం బిగించారు. కత్తులు, బల్లాలు ధరించి, అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కార్మెల్ పర్వతాన్ని అధిరోహించి అక్కడున్న 1500 మందికిపైగా ఒట్టోమాన్ టర్క్‌లు, జర్మనీ, ఆస్ట్రియా సేనలపై విరుచుకుపడ్డారు. మెషీన్‌గన్ల తూటాలు దూసుకొస్తున్నా వెనక్కి తగ్గక శత్రుసైనికులను తరిమికొట్టారు. ఆ యుద్ధంలో అసమాన ప్రతిభాసాహసాలు చూపిన కెప్టెన్ అమన్‌సింగ్ బహదూర్, దఫాదార్ జోర్ సింగ్‌కు అప్పట్లో ఇండియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్‌ను ప్రదానం చేశారు. అలాగే.. కెప్టెన్ అనూప్ సింగ్, సెకండ్ లెఫ్టినెంట్ సగత్ సింగ్‌లను మిలటరీ క్రాస్‌తో సన్మానించారు. 'హైఫా వీరుడు'గా పేరొందిన మేజర్ దల్పత్ సింగ్‌ను (జోధ్‌పూర్ లాన్సర్స్ కమాండర్) కూడా మిలటరీ క్రాస్ వరించింది. ఆ యుద్ధంలో ఆయన వీరోచితంగా పోరాడి వెన్నులో తూటాలతో నేలకొరిగాడు. చరిత్రకారులు ఈ యుద్ధాన్ని 'చరిత్రలోనే చివరి, అత్యంత గొప్ప అశ్విక దళ యుద్ధం'గా అభివర్ణిస్తుంటారు. ఇండియన్ ఆర్మీ ఏటా సెప్టెంబరు 23వ తేదీని 'హైఫా దినం'గా పాటిస్తుంది. వీరిలో జోధ్‌పూర్ లాన్సర్స్ రెజిమెంట్ 8 మంది సైనికులను కోల్పోయినప్పటికీ.. 700 మందిని ఖైదీలుగా పట్టుకుంది.

ముగ్గులో 'ఐ లవ్ మహమ్మద్' నినాదం!

- మహారాష్ట్రలో ఉద్రిక్తత.. 30 మంది అరెస్టు

ముంబై, సెప్టెంబరు 29: రోడ్డుపై ముగ్గు వేసి 'ఐ లవ్ మహమ్మద్' అనే నినాదాన్ని రాయడంతో మహారాష్ట్రలోని అహల్యానగర్‌లో మతపరమైన ఉద్రిక్తతలు చెలరేగి ఆందోళనలకు దారి తీసింది. నిరసనకారులను అదుపుచేసేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేసి.. 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. దేవీ నవరాత్రుల నేపథ్యంలో ఆదివారం రాత్రి అహల్యానగర్ (గతంలో అహ్మద్‌నగర్) మిల్లివాడ ప్రాంతంలో రోడ్డుపై ముగ్గుతో పాటు 'ఐ లవ్ మహమ్మద్' అనే నినాదాన్ని ఎవరో రాశారు. దీనికి సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో స్థానికులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. అందుకు కారణమైన వ్యక్తిని అరెస్టు చేశారు. అయితే అతడి సామాజిక వర్గానికి చెందిన యువకులు నిరసన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకొని శాంతింపజేసేందుకు యత్నించగా.. వారిపైకే రాళ్లు రువ్వారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు లాఠీ చార్జ్ చేసి.. 30 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై సీఎం ఫడ్నవీస్ స్పందించారు. 'మత పర ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు కుట్ర జరుగుతోంది. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలి. ఇటువంటి చర్యలను ఉపేక్షించేది లేదు' అని హెచ్చరించారు. కాగా, మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఈనెల 4న యూపీలో ముస్లింలు నిర్వహించిన ర్యాలీలో తొలిసారి 'ఐ లవ్ మహమ్మద్' బ్యానర్లు, ప్లకార్డులను ప్రదర్శించారు. దీంతో పోలీసులు 24 మందిని అరెస్టు చేయడంతో వివాదాస్పదమైంది. దీనిపై పలు రాష్ట్రాల్లో ఆందోళనలు జరిగాయి.

● మహిళ అదృశ్యం..
కేసు దర్యాప్తు 13 ఏళ్లా?

- పోలీసుల తీరుపై హైకోర్టు విస్మయం
- సామాన్యుల కేసుల్లో అలసత్వమని వ్యాఖ్య
- తాజా వివరాలతో అఫిడవిట్ వేయాలని ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ అదృశ్యానికి సంబంధించి 2012లో నమోదైన కేసులో ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేయకపోవడం ఏమిటని పోలీసుల తీరును హైకోర్టు ప్రశ్నించింది. సామాన్య ప్రజలకు సంబంధించిన ప్రతి కేసు దర్యాప్తులోనూ పోలీసులు ఇలాగే అలసత్వం ప్రదర్శిస్తున్నారని అభిప్రాయపడింది. కేసు దర్యాప్తు పురోగతిపై తాజా వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీని ఆదేశించింది. అఫిడవిట్‌ను పరిశీలించాక దర్యాప్తును సీబీఐకి అప్పగించే విషయమై నిర్ణయం ప్రకటిస్తామని తెలిపింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా జీలుగుమిల్లి మండలం కామయ్యపాలేనికి చెందిన బండారు ప్రకాశరావు తన కుమార్తె మంగాదేవిని మోహన్‌బ్రహ్మాజీ అనే వ్యక్తికిచ్చి వివాహం చేశారు. కొన్నాళ్ల తర్వాత 2012 అక్టోబరు 18న.. మంగాదేవి ఇంటి నుంచి వెళ్లిపోయిందంటూ ప్రకాశరావుకు తన అల్లుడి నుంచి ఫోన్ వచ్చింది. దీనిపై అదే రోజు ఆయన తాడేపల్లిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. తన కుమార్తె అదృశ్యంపై సీఐడీ, కలెక్టర్, ఎస్పీ, హెచ్ఆర్సీలకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో.. 2017లో ప్రకాశరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు పలుమార్లు వాయిదా పడింది. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా ఫైలును పరిశీలించిన న్యాయమూర్తి.. పోలీసులు కేసు దర్యాప్తు చేసిన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దర్యాప్తు పురోగతిపై తాజాగా నివేదిక సమర్పించాలని జిల్లా ఎస్పీని ఆదేశించారు. ఆతర్వాత కేసును సీబీఐకి అప్పగించడంపై నిర్ణయానికి వస్తామని చెప్పారు.

ఎందుకమ్మా ఇంత నిర్దయ!

- పసికందును ఇసుకలోంచి కుక్కలు లాగుతుండగా గుర్తించిన కార్మికులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పాప మృతి



ఒంటినిండా ఇసుకతో పురిటి బిడ్డ

వరదయ్యపాళెం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బిడ్డకు జన్మనిచ్చిన తల్లో.. లేదా ఆమె సంబంధీకులో.. ఎవరి నిర్దయ నిర్ణయమో కానీ.. అప్పుడే పుట్టిన ఓ ఆడశిశువు మృత్యుఒడి చేరింది. ఈ హృదయ విదారక ఘటన తిరుపతి జిల్లా వరదయ్యపాళెంలో వెలుగుచూసింది. వరదయ్యపాళెం బస్టాండు సమీపంలోని ఓ దుకాణం వద్ద ఓ యువతి ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఆడశిశువుకు జన్మనిచ్చింది. అక్కడి పరిస్థితిని బట్టి ఆ దుకాణం ముందే ఆమె ప్రసవించినట్లు తెలుస్తోంది. అక్కడికి సమీపంలోనే రోడ్డు పక్కన నిర్మాణానికి సంబంధించిన ఇసుక కుప్ప ఉండగా, ఎవరు చేశారోకానీ.. ఆ పసికందును అందులో పైపైకి కప్పిపెట్టి వెళ్లిపోయారు. సోమవారం ఉదయాన్నే ఓ కుక్క ఆ పసికందు చేతిని ఇసుకలో నుంచి లాగుతుండగా పారిశుధ్య కార్మికులు గమనించి కొన ఊపిరితో ఉన్న పసికందును పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సూళ్లూరుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పాప పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పాప మృతి చెందినట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప తెలిపారు.

ఐదేళ్ల కుమార్తెపై అత్యాచారం
కిరాతకుడికి మరణించే వరకూ జైలు శిక్ష

- బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం
- ప్రభుత్వాన్ని ఆదేశించిన పోక్సో కోర్టు

విశాఖపట్నం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల కుమార్తెపై అత్యాచారానికి పాల్పడిన కసాయికి మరణించేంత వరకూ జైలుశిక్ష విధిస్తూ విశాఖపట్నం పోక్సో కోర్టు న్యాయాధికారి సోమవారం తీర్పు చెప్పారు. నగర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం తిప్పలవలస గ్రామవాసి (27) భార్య, ఐదేళ్ల కుమార్తె, ఏడేళ్ల కుమారుడితో విశాఖ వన్‌టౌన్‌లోని జాలారిపేటలో నివాసం ఉంటున్నాడు. భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తడంతో ఈ ఏడాది ఏప్రిల్ 15న పిల్లలిద్దరినీ తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మద్యం మత్తులో తగరపువలస పాత సినిమాహాలు జంక్షన్ వద్ద ఒక దుకాణం ముందు రేకులషెడ్డులో పిల్లలను నిద్రపుచ్చాడు. అర్ధరాత్రి సమయంలో నిద్రపోతున్న ఐదేళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక ఏడుస్తుండడంతో అక్కడ ఆగి ఉన్న లారీ డ్రైవర్, క్లీనర్ చూసి సమీపంలోని సెక్యూరిటీ గార్డు ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. భీమిలి పోలీసులు అక్కడకు చేరుకుని సీసీ ఫుటేజీ ద్వారా జరిగిన అఘాయిత్యాన్ని నిర్ధారించుకుని, బాలికను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు బాధ్యతను మహిళా పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. అప్పటి ఏసీపీ సీహెచ్.పెంటారావు ఈ కేసుకు సంబంధించిన ఆధారాలను పకడ్బందీగా సేకరించి పోక్సో కోర్టుకు సమర్పించారు. కేసు విచారించిన న్యాయాధికారి.. సీసీ ఫుటేజీలను పరిశీలించడంతోపాటు పోలీసులు, వైద్యులు అందజేసిన ఇతర ఆధారాలను పరిగణలోకి తీసుకుని ముద్దాయికి మరణించేంత వరకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మరణించేంత వరకు జైలుశిక్ష విధించడం చాలా అరుదు అని కేసు దర్యాప్తు అధికారి పెంటారావు చెప్పారు. ఈ కేసులో బాధితురాలికి రూ.ఐదు లక్షల పరిహారాన్ని ప్రభుత్వం అందజేయాలని కోర్టు ఆదేశించింది.

సమ్మిళిత విద్య అమలులో ఏపీ ముందుండాలి

▸ రాష్ట్ర సలహా కమిటీ దిశానిర్దేశం

అమరావతి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమ్మిళిత విద్య (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్) అమలులో రాష్ట్రం ముందుండాలని సమ్మిళిత విద్య రాష్ట్ర సలహా కమిటీ అభిప్రాయపడింది. సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు నేతృత్వంలో సలహా కమిటీ సమావేశం విజయవాడలో జరిగింది. కమిటీ సభ్యులైన ఎమ్మెల్యేలు సుందరపు విజయ్‌కుమార్, పీవీ పార్థసారథి, కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, సమగ్రశిక్ష అదనపు ఎస్పీడీ-2 రవీంద్రనాథ్ రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీడీ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో 747 మంది సమ్మిళిత విద్య రిసోర్స్ పర్సన్స్ పనిచేస్తున్నారని, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వీరు బోధిస్తున్నారని, అలాగే ప్రతి శనివారం 3 వేల మంది విద్యార్థులకు ఇంటి వద్దే విద్య అందిస్తున్నారని వివరించారు. గృహాధారిత విద్యార్థులకు డ్రైరేషన్ (బియ్యం, గుడ్లు, చిక్కీలు వంటివి) ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో 89,435 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులున్నారని, కొత్తగా 16,238 మందిని నమోదు చేశామని తెలిపారు. 679 భవిత కేంద్రాల ద్వారా 13,580 మంది పిల్లలకు ఫిజియోథెరపీ, రెమిడియల్ విద్య కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నామన్నారు. భవిష్యత్తు కార్యాచరణపై ఎమ్మెల్యేలు పలు సలహాలు ఇచ్చారు. సమ్మిళిత విద్యలో రాష్ట్రం ముందుండేలా ప్రణాళిక అమలు చేయాలన్నారు.



ఇంద్రకీలాద్రి దిగువన కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో భక్తుల రద్దీ



దుర్గమ్మ దర్శనం కోసం వివిధ ప్రదేశాల నుంచి వచ్చి కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు



దుర్గా ఘాట్ నుంచి కుమ్మర పాలెం సెంటర్ రోడ్డులో విస్తరించిన భక్తుల క్యూ లైన్

• కావుమా కనకదుర్గమ్మా...

భక్తజనకీలాద్రి

2 లక్షల మందికి దుర్గమ్మ దర్శనం

'అమ్మ జన్మనక్షత్రం రోజున ఎలాగైనా దర్శించుకోవాలి...ఆశీస్సులు పొందాలి'-అనే భక్తి భావనతో రాష్ట్రాలు దాటి భక్తులు తరలి వచ్చారు. నిద్రాహారాలు లేకపోతేనేమి ఆ తల్లి కరుణ ఉంటే చాలు అంటూ ముందురోజు నుంచే పడిగాపులు కాశారు. దర్శనానికి వేళవగానే క్యూలైన్లలో నిలబడి జై కనకదుర్గా అంటూ జయజయధ్వానాలు చేస్తూ వెళ్లి కళ్లారా దుర్గమ్మను దర్శించి పులకించిపోయారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు పరిస్థితి ఇదీ.

▸ సరస్వతీ దేవి అలంకారంలో అమ్మను చూడాలని.. రాష్ట్రాలు దాటి తరలివచ్చిన భక్తగణం

▸ ఉత్తరాంధ్ర నుంచి భారీగా రాక

▸ ఆదివారం అర్ధరాత్రి కే నిండిన కంపార్ట్‌మెంట్లు

▸ మూలానక్షత్రం రోజున మొత్తంగా భక్తుల సంఖ్య 2.5 లక్షలకు చేరుకోవచ్చని అంచనా

విజయవాడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి భక్తజనకీలాద్రిగా మారిపోయింది. దసరా ఉత్సవాలలో సోమవారం కనకదుర్గమ్మ జన్మనక్షత్రమైన మూలానక్షత్రం రోజున సరస్వతీదేవి అలంకారాన్ని దర్శించుకోవటానికి అశేష భక్తజన వాహిని తరలి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా నలు చెరగుల నుంచే కాకుండా , పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. ఏపీ నుంచి కనకదుర్గమ్మను అమితంగా పూజించే ఉత్తరాంధ్ర నుంచి అశేషంగా తరలి వచ్చారు. రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాలు అన్నీ కిటకిటలాడుతూ బెజవాడ చేరుకున్నాయి. రాత్రి 10 గంటల సమయానికి కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి వచ్చిన భక్తుల సంఖ్య రెండు లక్షలు దాటిపోయింది. ఆ సమయానికి ఇంద్రకీలాద్రి నుంచి దిగువ కెనాల్ రోడ్డు మీదుగా వినాయకుడి గుడి వరకు దాదాపుగా 5 కిలోమీటర్ల మేర అమ్మను దర్శించుకోవటానికి క్యూలలో ఉన్నారు. సరస్వతి అలంకారంలో ఉన్న అమ్మవారిని ఎలాగైనా దర్శించుకోవాలన్న భావనతో ఎన్ని గంటలు పడుతుందన్న అంశాన్ని కూడా లెక్కచేయకుండా ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచే వచ్చి క్యూలో నిలబడ్డారు. అర్ధరాత్రి ఒంటి గంటకు సరస్వతి అలంకారం మొదలవగా దర్శనానికి అనుమతించారు. అప్పటి నుంచి సోమవారం రాత్రి 11 గంటల వరకు క్యూలు భక్తులతో పోటెత్తాయి. దర్శనానికి వదిలినప్పటికీ రద్దీతో క్యూలన్నీ నెమ్మదిగా సాగాయి. దీంతో అమ్మవారి దర్శనానికి సుమారు 7 నుంచి 9 గంటల సమయం పట్టింది. రాత్రి నుంచే క్యూలు ఉండడంతో సోమవారం తెల్లవారు జామున వినాయకస్వామి గుడివద్ద నుంచి సీతమ్మవారి పాదాల వరకు రద్దీ నెలకొంది. సుమారు 30 తాత్కాలిక కంపార్ట్‌మెంట్లలో భక్తులు నిండిపోయారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ లెక్కచేయలేదు...నిద్రాహారాలు లేకపోయినప్పటికీ అలుపులేదు...అమ్మదర్శనం చేసుకోవాలి అనేదే లక్ష్యంగా చిన్నపిల్లల నుంచి పండుముసలి వరకు జైకనకదుర్గా అంటూ, భజనలు, పాటలతో ముందుకు సాగారు.

రద్దీ ఇలా....

సోమవారం ఉదయం 4 గంటలకే 26 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి 9 గంటల సమయానికి లక్షా యాభైవేల మంది భక్తులు దర్శించుకున్నారు. పది గంటలకు ఈ సంఖ్య 2 లక్షలు దాటింది. దర్శనం పూర్తయ్యే సమయానికి భక్తుల సంఖ్య 2.5 లక్షలకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు.



కనులపండువగా శ్రీవారి స్వర్ణరథోత్సవం

తిరుమల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన సోమవారం సాయంత్రం స్వర్ణరథోత్సవం కన్నులపండువగా జరిగింది. ఉత్సవర్లు 4 గంటలకు ఆలయం నుంచి ఊరేగింపుగా స్వర్ణకాంతులతో మెరిసిపోతూ బంగారురథంలో ఆశీనులయ్యారు. 5.10 గంటల వరకు స్వర్ణరథంపై విహరించిన దేవదేవులను భక్తులు దర్శించి ఆనందపరవశులయ్యారు. ఈ స్వర్ణరథాన్ని స్త్రీలు మాత్రమే లాగడం విశేషం. అప్పుడప్పుడు భద్రతా సిబ్బంది కూడా సహకరించగా...ప్రశాంతంగా ముగిసింది. ఇక, ఉదయం స్వామివారు కోదండరాముడిగా హనుమంత వాహనంపై, పట్టాభిషేకానికి వెళ్లే రారాజులా రాత్రి గజవాహనంపై ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు.


ఎర్రచందనం సంరక్షణకు రూ.82 లక్షలు

▸ జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ మంజూరు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే పెరిగే ఎర్రచందనం మొక్క జాతిని కాపాడే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ (ఎన్‌బీఏ) ఏపీలో ఎర్రచందనం మొక్కల సంరక్షణ నిమిత్తం రాష్ట్ర జీవవైవిధ్య మండలికి రూ.82 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో ఒక లక్ష ఎర్రచందనం మొక్కలు పెంచి, వాటిని రైతులకు సరఫరా చేయనున్నారు. దీంతో అడవుల వెలుపల చెట్లు (ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్ట్స్) పెంచే కార్యక్రమానికి తోడ్పాటు అందించడమే కాకుండా ఏపీలో మాత్రమే పెరిగే ఈ ఏకైక మొక్క జాతిని కాపాడేందుకు చర్యలు తీసుకున్నట్లయింది. ఎర్రచందనం సంరక్షణ నిమిత్తం ఎన్‌బీఏ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ అటవీ విభాగానికి రూ.31.55 కోట్లకుపైగా అందజేసింది. ఎర్రచందనం మొక్కలు ముఖ్యంగా ఆగ్నేయ కనుమల ప్రాంతాల్లో పెరుగుతున్నాయి. ప్రత్యేకించి అనంతపురం, చిత్తూరు, కడపతో పాటు కర్నూలు జిల్లాల్లో ఏపుగా పెరిగే ఈ చెట్లు వాణిజ్య పరంగా చాలా ఖరీదైనవి. ఈ కారణంగానే వీటికి భారీ ముప్పు పొంచి ఉంది. దీన్ని పెద్ద ఎత్తున స్మగ్లింగ్ చేస్తున్నారు.

ఆక్వా అథారిటీకి 9మంది సభ్యుల నియామకం

అమరావతి, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ(అప్సడా) ఛైర్మన్‌గా ఆనం వెంకట రమణారెడ్డి(నెల్లూరు)ని ఇప్పటికే నియమించిన ప్రభుత్వం.. తాజాగా తొమ్మిదిమంది సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దేశంశెట్టి వెంకట లక్ష్మీనారాయణ(అమలాపురం-ప్రాసెసింగ్), గుత్తికొండ శ్రీరాజబాబు(గుడివాడ-ఫీడ్ మాన్యుఫ్యాక్చరర్), లంకే నారాయణప్రసాద్(మచిలీపట్నం-ఫిష్‌ఫార్మర్), మహ్మద్‌నూరుద్దీన్(ఉంగుటూరు-ఫిష్‌ఫార్మర్), ఏత్తనాల నాగ శ్రీనివాస్(ముమ్మిడివరం-హేచరీస్), రాచమళ్ల మీరయ్య(పాలకొల్లు-ష్రింప్‌ఫార్మర్), వంకా కొండబాబు(పిఠాపురం-ష్రింప్‌ఫార్మర్), వేగేశ్న సాయి మనోహర్‌రాజు (ఆచంట-ష్రింప్‌ఫార్మర్), వేగేశ్న సత్యనారాయణరాజు(ఉండి-ఆక్వాకల్చర్ హెల్త్‌కేర్ ప్రొడక్ట్స్ డీలర్) నియమితులయ్యారు.



మహాగౌరి అలంకరణలో భ్రమరాంబికా దేవి

శ్రీశైలం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఎనిమిదో రోజు సోమవారం భ్రమరాంబికాదేవి భక్తులకు మహాగౌరి అలంకరణలో దర్శనమిచ్చారు. రాత్రి మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి నంది వాహనంపై విహరించారు. వర్షం కారణంగా గ్రామోత్సవం రద్దు చేశారు. తొమ్మిదో రోజు మంగళవారం అమ్మవారు సిద్ధిదాయిని అలంకరణలో దర్శనమిస్తారు. రాత్రికి ఆది దంపతులు కైలాస వాహనంపై విహరిస్తారు.

దసరా విధులకు వచ్చిన ఎస్ఐ ఆకస్మిక మృతి

▸ మృతుడు పూసపాటిరేగ ఎస్ఐ



శ్రీనివాసరావు

విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడలో బందోబస్తు విధుల నిమిత్తం వచ్చిన విజయనగరం జిల్లా పూసపాటిరేగ ఎస్ఐ వడ్డాది శ్రీనివాసరావు (52) ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనతో పాటుమరో నలుగురు కలసి హనుమాన్‌పేటలోని ఒక లాడ్జిలో బస చేశారు. సోమవారం ఉదయం విధులకు హాజరయేందుకు సిద్ధం కావడానికి బాత్‌రూమ్‌కు వెళ్లారు. బాత్‌రూమ్‌లో ప్రమాదవశాత్తు కాలుజారిపడి పోయాడు. వెంటనే స్పృహ కోల్పోయాడు. సహచరులు గమనించి 108కు ఫోన్‌చేశారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి శ్రీనివాసరావును పరిశీలించి అప్పటికే ప్రాణం పోయినట్లు నిర్ధారించారు. తర్వాత బంధువులకు సమాచారం అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

భక్తుల బ్యాగ్‌లోని బంగారు ఆభరణం చోరీ

దర్శనానికి వచ్చిన నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం పంట పాలెం గ్రామానికి చెందిన మరువాడ శివశంకర్, లలిత దంపతులకు చెందిన బంగారు నగలు చోరీకి గురయ్యాయి. సుమారు 9 లక్షల విలువ చేసే నగలు అపహరణకు గురయినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అద్భుత విజయం

అదే దృశ్యం మళ్లీ సాక్షాత్కారమైంది. సంబరం అంబరాన్నంటింది. పండుగ రెండ్రోజుల ముందే వచ్చేసింది. దేశంలోని ప్రతి క్రీడాభిమాని సగర్వంతో సంబరం చేసుకునేలా అద్భుతాన్ని ఆవిష్కృతం చేసింది భారత క్రికెట్ జట్టు. ప్రతిష్ఠాత్మక ఆసియా కప్ టోర్నమెంట్‌లో తొమ్మిదోసారి చాంపియన్‌గా నిలిచింది. మెగా టోర్నీల్లో విజయాలు సాధించడం మన జట్టుకు సాధారణమే అయినప్పటికీ, ఇటీవలి పరిణామాల నేపథ్యంలో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తుచేసి విజేతగా నిలవడమే కోట్లాదిమంది భారతీయులకు ఆనందాన్ని పంచే విషయం.

భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య ఏ స్థాయి క్రికెట్ పోటీ అయినా సరే అసంఖ్యాక క్రీడాభిమానుల్ని ఆకట్టుకుంటుంది. అందునా, ఉద్వేగం, ఉత్కంఠకు మారుపేరైన ధనాధన్ పొట్టి క్రికెట్ సమరమైతే, చెప్పేదేముంది? కానీ, ఈసారి ఆసియా కప్ ఆరంభ సమయంలో చిరకాల ప్రత్యర్థుల పోరు పట్ల ఎప్పటిలా హడావిడి లేదు. ఉత్కంఠ, భావోద్వేగాలు లేవు. పహల్గాంలో పాక్ ముష్కరుల పైశాచిక కాండను మరిచిపోయారా? పాక్‌తో భారత్ మ్యాచ్‌ను బహిష్కరించాల్సిందే అంటూ బాధిత కుటుంబాల విమర్శలు, వివిధ వర్గాల నుంచి ఎదురైన ఒత్తిడి మధ్య ఇరు జట్ల పోరు మొదలైంది. గ్రూప్ దశలో ఓసారి, సూపర్–4లో మరోసారి పాకిస్థాన్‌ను భారత్ చిత్తుచేసింది. ఈ పరిస్థితుల్లో ఈ జట్ల మధ్య పోరుపై అంతగా ఆసక్తి లేకుండా పోయింది. భారత జట్టు టోర్నీ ఆరంభం నుంచే అద్భుత ఫామ్ కనబరుస్తూ, యూఏఈ, బంగ్లాదేశ్, శ్రీలంక, పాక్, ఇలా ఎదుర్కొన్న ప్రతి జట్టునూ మట్టి కరిపించి అజేయంగా ఫైనల్ చేరితే... పడుతూ, లేస్తూ పాక్ తుది పోరుకు అర్హత సాధించింది. దాయాది జట్లు తలపడిన ఫైనల్ మాత్రం భారత్, పాక్ మధ్య పోరు ఎలా ఉండాలని సగటు క్రికెట్ అభిమాని కోరుకుంటాడో అలాగే సాగింది. మ్యాచ్ అనూహ్య మలుపులు తిరుగుతూ, ఆధిపత్యం చేతులు మారుతూ, ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తించింది. మొదట బ్యాటింగ్ చేసిన ప్రత్యర్థిని బౌలర్ కుల్దీప్ యాదవ్ మాయాజాలంతో స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన సూర్యకుమార్ సేన.. ఛేదనలో మాత్రం ఓ దశలో తడబాటుకు గురైంది. ఫైనల్‌కు ముందు దాదాపు ప్రతి మ్యాచ్‌లోనూ బ్యాటుతో పరుగుల వరద పారించిన ఓపెనర్ అభిషేక్ శర్మ అసలైన పోరులో నిరాశపరిచాడు. ఓ దశలో టాప్ బ్యాటర్లంతా పెవిలియన్ చేరి విజయంపై ఆశలు అడుగంటుతున్న తరుణంలో మైదానంలో కొచ్చిన తెలుగు క్రికెటర్ తిలక్ వర్మ సందర్భానికి తగినట్టుగా ఆడాడు. అంత ఒత్తిడిలోనూ ప్రత్యర్థి బౌలర్ల భరతం పడుతూ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. అతను చివరిదాకా క్రీజులో నిలిచి చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడడంతో భారత్ మరోమారు ఆసియా విజేతగా ఆవిర్భవించింది. ఐసీసీ టోర్నమెంట్లలో ఎదురైన ప్రతిసారి పాకిస్థాన్‌ను చిత్తుచేస్తున్న భారత్, ఈసారీ అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. వేదిక ఏదైనా, పిచ్ ఎలాంటిదైనా, ఆటగాళ్లు మారినా, తమను ఎవరూ ఆపలేరని టీమిండియా రుజువు చేసింది. పహల్గాం ఉన్మాదంలో ప్రాణాలొదిలిన పర్యాటకులకు ఆపరేషన్ సిందూర్‌తో భారత ప్రభుత్వం, సాయుధ బలగాలు ఘనంగా నివాళి అర్పిస్తే.. యుద్ధ భూమిలోనే కాదు, క్రీడాక్షేత్రంలోనూ తమదే పైచేయి అని మన క్రికెటర్లు ఆపరేషన్ ఆసియా కప్ రూపంలో చాటి చెప్పారు. 2023 ఆసియా కప్ ఫైనల్లో శ్రీలంకపై హైదరాబాద్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్ ఆరు వికెట్లతో విజృంభించి భారత్‌కు ట్రోఫీ అందిస్తే.. తాజా టోర్నమెంట్ ఫైనల్లో తిలక్ వర్మ రూపంలో మరో తెలుగు ఆటగాడే ప్రధాన భూమిక పోషించడం విశేషం.

ఆసియా కప్ సందర్భంగా పాకిస్థాన్ క్రికెటర్లలో కొందరు క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించి తమ వెకిలి బుద్ధిని చాటుకున్నారు. భారత్‌తో సూపర్–4 మ్యాచ్‌లో అర్ధ సెంచరీ చేసిన అనంతరం పాక్ ఓపెనర్ ఫర్హాన్ బ్యాట్‌ను తుపాకి తరహాలో పైకెత్తి బుల్లెట్లు పేల్చుతున్నట్టుగా పహల్గామ్ దాడిని గుర్తుచేస్తూ సంబరాలు చేసుకుంటే.. ఆపరేషన్ సిందూర్‌లో భారత్‌కు చెందిన ఆరు విమానాలను కూల్చేశామనేలా బౌలర్ హారిస్ రౌఫ్ తన ఆరు వేళ్లను ప్రేక్షకులకు చూపించాడు. పాక్ ఆటగాళ్లు ఎంత రెచ్చగొట్టేలా వ్యవహరించినా, భారత క్రికెటర్లు మాత్రం ఎక్కడా సంయమనం కోల్పోలేదు. చివరకు విజయంతోనే ప్రత్యర్థికి బుద్ధి చెప్పారు. విజేతగా ఆవిర్భవించిన భారత జట్టు ట్రోఫీని పాక్ మంత్రి, ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ మొహిసిన్ నక్వీ చేతులమీదుగా అందుకునేందుకు నిరాకరించింది. టోర్నీలో ప్రత్యర్థి ఆటగాళ్లతో కరచాలనం చేసేందుకు కూడా మన క్రీడాకారులు అంగీకరించలేదు.

సమ్మిళిత సమతా సమాజ స్వాప్నికులు

'ఈ సమావేశానికి ఒక యువకుడు అధ్యక్షత వహిస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది' అని సునీతాతాయి అన్నారు. పూణేలో సమాజ్‌వాది ఏక్‌జుతాత సమ్మేళన్‌లో ఒక సమావేశానికి అధ్యక్షత వహించేందుకు అవినాష్ పాటిల్‌ను ఆహ్వానిస్తూ ఆమె అన్న మాటలవి. 'నాకు ఇప్పుడు 55 సంవత్సరాలు. నేను ఎలా యువకుడిని అవుతాను?' అంటూ అవినాష్ విస్మయ పడ్డారు. 'సోషలిస్టులు ఎవరైనాసరే అరవై సంవత్సరాల వయసు లోపు వారు యువకులే, అదే గాంధేయవాదులు అయితే 75 ఏళ్ల వరకు వారు యువకులే సుమా' అని నేను చమత్కరించాను. ఇదలా ఉంచితే భారతదేశంలో సోషలిస్టు ఉద్యమానికి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పూణేలో జరిగిన సమ్మేళన్‌లో దేశం నలుమూలల నుంచి వందలాది కార్యకర్తలు పాల్గొన్నారు.


■ యోగేంద్ర యాదవ్

నా చమత్కారపూరిత వ్యాఖ్య ఒక బాధాకరమైన సత్యాన్ని కప్పిపుచ్చింది. భారతీయ సోషలిస్టు ఉద్యమ వారసత్వం క్షీణించి పోతోంది. వర్తమాన భారతదేశంలో మనకు ఆ స్ఫూర్తిదాయక భావజాలం అవసరం అమితంగా ఉన్నది. హిందీ భాషా రాష్ట్రాలలో విద్వేష రాజకీయాలను సమర్థంగా సవాల్ చేసిన ఆ రాజకీయ భావజాల చైతన్యం తగ్గిపోయింది. నకిలీ జాతీయవాదాన్ని చీల్చి చెండాడేందుకు అవసరమైన మేధా అస్త్రాలు నేటి యువ ప్రతిఘటనకారులకు అందుబాటులో లేకుండా పోయాయి. పాతకాలంలో తమ స్ఫూర్తిదాయక పోరాటాలను జ్ఞాపకం చేసుకుంటూ కాలం అంచున ఉన్న సోషలిస్టులకే కాదు, జాతికే ఇదొక పెద్ద విషాదం. పూరించుకోలేని మహానష్టమది.

మన జాతీయ జీవితంలో సోషలిస్టు ఉద్యమ చరిత్ర విస్మృతి అగాథాల్లోకి జారిపోయింది. భారతీయ సోషలిస్టుల గురించి ఎవరైనా ఒక యువకుడిని అడగండి. సమాధానం ఇవ్వలేక తెల్లమొహం వేస్తాడు. ఒక సోషలిస్టు, ఒక కమ్యూనిస్టు, అజ్ఞాత జీవితంలో ఉన్న ఒక మావోయిస్టు మధ్య ఉన్న తేడాలు ఏమిటో నేటి యువతలో ఎంత మందికి తెలుసు? నవయువ భారతీయుల దృష్టిలో వారందరూ 'వామపక్షీయులే'. గడిచిన కాలం, సాగిపోయిన చరిత్ర అవశేషాలు మాత్రమే సుమా! మీరు ములాయం సింగ్ యాదవ్ గురించి వినే ఉంటారు. ఆయనేమీ ఆదర్శ సోషలిస్టు రాజకీయవేత్త కాకపోయినా జనప్రియ సోషలిస్టు నేతలలో ఒకరు. పాతకాలం ప్రాత్రికేయులు కాంగ్రెస్ పాలకులపై నిత్యం నిప్పులు చెరిగే జార్జి ఫెర్నాండెజ్, విద్యుద్దంగా ప్రవర్తించే రాజ్ నారాయణ్‌ను గుర్తు చేసుకుంటారు గానీ కర్పూరీ ఠాకూర్, మధు లిమాయే, ఎస్ఎమ్ జోషీ, రబీ రే, మృణాల్ గోరే, కిషన్ పట్నాయక్‌ల గురించిన జ్ఞాపకాల ముద్ర వారి మనసుల నుంచి తొలగి పోయిందనే చెప్పాలి. సోషలిస్టు ఉద్యమ తొలి తరంలో బొంబాయి మేయర్‌గా విశేష పేరు ప్రఖ్యాతులు ఆర్జించిన యూసఫ్ మెహరాలీ, ఆధ్యాత్మిక సోషలిస్టు అచ్యుత్ పట్వర్ధన్‌లు బహుశా ఎవరి స్మృతిపథంలోనూ లేరేమో?!

లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌ను సోషలిస్టు ఉద్యమ నాయకుడుగా కాకుండా గాంధేయ సర్వోదయ నాయకుడుగానే నేటి తరం వారు జ్ఞాపకం చేసుకుంటున్నారు. హస్తకళల పునరుద్ధరణకు విశేష కృషి చేసిన ఉదాత్తురాలిగా కమలాదేవి ఛటోపాధ్యాయను, సోషలిస్టు మేధావి, బౌద్ధ పండితుడుగా ఆచార్య నరేంద్ర దేవ్‌ను గుర్తు చేసుకుంటున్నారు. సువిఖ్యాత మరాఠీ సాహిత్యవేత్తగా సానే గురూజీ, సాంఘిక సంస్కర్తగా బలేశ్వర్ దయాళ్‌ను జ్ఞాపకం చేసుకుంటున్నారు. ఓటీటీ సినిమా 'ఏ వతన్ మేరే వతన్' పుణ్యమా అంటూ సాహసోపేత స్వాతంత్ర్య యోధురాలుగా ఉషా మెహతా ఇప్పుడు అందరి స్మృతిపథంలో ఉన్నారు. గమనార్హమైన విషయమేమిటంటే వీరిలో ఏ ఒక్కరినీ సోషలిస్టు ఉద్యమ నేతగా జ్ఞాపకం చేసుకోవడం లేదు. రామ్ మనోహర్ లోహియాను ఒక సోషలిస్టుగా ప్రస్తావిస్తున్నారు. అయితే మండల్ పూర్వీకుడుగా మాత్రమే ఆ ప్రస్తావనలు ఉంటున్నాయి. మౌలిక సోషలిస్టు ఆలోచనాశీలిగా, నాయకుడుగా గుర్తు చేసుకోవడమనేది సకృత్తుగా జరుగుతోంది.



విశిష్ట సోషలిస్టు ఉద్యమానికి మూలమైన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ 1934లో భారత జాతీయ కాంగ్రెస్‌లో అంతర్భాగంగా ఏర్పాటయింది. రాజకీయ స్వాతంత్ర్యాన్ని సామాజిక, ఆర్థిక సమానత్వ భావనలతో అనుసంధానించడం ద్వారా వలసపాలన వ్యతిరేకోద్యమాన్ని విప్లవీకరించేందుకు సోషలిస్టు పార్టీ కృషి చేసింది. జేపీతో సహా పలువురు నాయకులు తొలుత మార్క్సిస్టు సిద్ధాంత అనుయాయులే అయినప్పటికీ కమ్యూనిస్టుల వలే కాకుండా కాంగ్రెస్ పార్టీలో అంతర్భాగంగా ఉంటూ జాతీయోద్యమంలో పాల్గొనాలని నిర్ణయించుకున్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో జయప్రకాశ్ నారాయణ్, లోహియా, ఉషా మెహతా లాంటివారు చరిత్రాత్మక పాత్ర వహించారు. స్వాతంత్ర్యానంతరం సోషలిస్టులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి స్వతంత్ర ప్రస్థానాన్ని ప్రారంభించారు. కమ్యూనిస్టు పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ వామపక్ష ప్రజాస్వామ్య పార్టీగా ప్రభవించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో చట్టసభలకు చెప్పుకోదగిన సంఖ్యలో ఎన్నికైన సోషలిస్టులు హిందీ భాషా రాష్ట్రాలలో వెనుకబడిన కులాలవారిని, పేద ప్రజలను సంఘటిత పరిచారు. భారత గణతంత్ర రాజ్య తొలి నాళ్లలో భారత ప్రజాస్వామ్యాన్ని పటిష్ట పరిచేందుకు కమ్యూనిస్టులతో పాటు సోషలిస్టులు అవిస్మరణీయమైన కృషి చేశారు.

ఇందిరాగాంధీ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితి కాలంలో పలువురు సోషలిస్టులు నిర్వహించిన పాత్ర భారత సోషలిస్టు ఉద్యమ చరిత్రలో మరొక ప్రతిష్ఠాత్మక అధ్యాయం. చాలా మంది ఆ 19 నెలలూ జైలు జీవితం గడిపారు. విద్యార్థి నాయకుడుగా పేరు పొంది, ఆ తరువాత ప్రొఫెసర్ అయిన రాజ్‌కుమార్ జైన్, సామాజిక క్రియాశీలి విజయ్ ప్రతాప్, ట్రేడ్ యూనియన్ నాయకుడు దలీప్ సింగ్ మొదలైన వారెందరినో ఈ సందర్భంలో తప్పక ప్రస్తావించుకోవాలి.

> భారతీయ సోషలిజం చాలామంది భావిస్తున్నట్టు యూరోప్ లోని సోషల్ డెమొక్రాటిక్ సంప్రదాయానికి భారతీయ రూపం కాదు. మన సోషలిస్టు భావజాలంలో వర్తమాన ప్రాసంగికత ఉన్న నాలుగు అంశాలు: అవి– సమానత్వ భావనను ఆర్థిక దృక్కోణానికి పరిమితం చేయకుండా... కులం, జెండర్, జాతి, జాతీయత మొదలైన అంశాలకూ వర్తింప చేయడం; సుస్థిర శ్రేయస్సుకు ప్రాధాన్యమిస్తూ పారిశ్రామిక అభివృద్ధి నమూనాపై పునరాలోచన; గాంధీ సత్యాగ్రహ తాత్వికత, పద్ధతుల స్ఫూర్తి స్వీకరణ; భారతీయత ప్రాతిపదికపై కొత్త సాంస్కృతిక రాజకీయాలు.

ఇంతకూ భారతీయ సోషలిజం ఏమిటి? చాలా మంది భావిస్తున్నట్టు యూరోప్ లోని సోషల్ డెమొక్రాటిక్ సంప్రదాయానికి భారతీయ రూపం కానే కాదు. యూరోపియన్ సంప్రదాయం ఎన్నికల ప్రజాస్వామ్యం ద్వారా అసమానతలను పరిమితంగా తగ్గించడమే లక్ష్యంగా ఉన్న రాజకీయ భావజాలం మాత్రమే. భారతీయ సోషలిజంను ప్రశస్తంగా ప్రవచించిన చింతకుడు లోహియా. ఆయన సిద్ధాంతం విభిన్నమైనది. అదొక భావసాహసం. సోషలిస్టు భావ జాల యూరోప్ కేంద్రిత మూలాలను త్యజించి, సమస్త సమాజాలకు ఉపయుక్తమయ్యేలా సోషలిజం భావనకు ఆయన ఒక విలక్షణ రూపునిచ్చారు.

లోహియా సోషలిస్టు భావజాలంలోని నాలుగు అంశాలకు వర్తమాన భారతదేశంలో విశేష ప్రాసంగికత ఉన్నది. అవి: సమానత్వ భావనను ఆర్థిక దృక్కోణానికి పరిమితం చేయకుండా, కులం, జెండర్, జాతి, జాతీయత మొదలైన అంశాలకు కూడా వర్తింపచేశారు. మహిళా రిజర్వేషన్లు, కుల గణన, ఓబీసీ, ఎస్సీ కోటాలలో ఉపకోటాలకు సంబంధించిన చర్చలలో బహుళ, క్రమబద్ధమైన పొరలతో కూడిన సామాజిక సోపాన క్రమాలను అర్థం చేసుకునేందుకు లోహియా భావన దోహదం చేస్తుంది; సుస్థిర శ్రేయస్సుకు ప్రాధాన్యమిస్తూ పట్టణ, పారిశ్రామిక టెక్నోక్రాటిక్ అభివృద్ధి నమూనాపై పునరాలోచనకు భారతీయ సోషలిస్టులు పునాదులు వేశారు. వాతావరణ మార్పు పర్యవసానాలు తీవ్రమవుతున్న ప్రస్తుత సందర్భంలో ఈ కొత్త ఆలోచనాపద్ధతికి ప్రాధాన్యమున్నది; సామాజిక పరివర్తన సాధనకు ఎన్నికల ప్రజాస్వామ్యం లేదా రాజకీయ హింసకు ప్రత్యామ్నాయంగా గాంధీ సత్యాగ్రహ తాత్వికత, పద్ధతుల స్ఫూర్తిని స్వీకరించడం; మన భాషలు, సంస్కృతి, జాతీయవాదం ప్రగాఢ ఆధారాలుగా ఉన్న సాంస్కృతిక రాజకీయాలకు కొత్త వ్యాకరణాన్ని భారతీయ సోషలిస్టులు రూపొందించారు. సాంస్కృతిక జాతీయవాదం, జనప్రియ వాదాల ప్రాబల్యం, జాతికి ప్రాధాన్యమిచ్చే జాతీయవాద ధోరణుల ఉధృతిని ఎదుర్కొనేందుకు సోషలిస్టుల సాంస్కృతిక రాజకీయాల అవసరం ఎంతైనా ఉన్నది.

కొన్ని దశాబ్దాల క్రితం సోషలిస్టు భావాలతో ప్రమేయం లేకుండా భవిష్యత్తు గురించి ఆలోచించడం అసాధ్యంగా ఉండేది. కాల కెరటం నేడు సోషలిస్టు తీరాన్ని వీడి అవతలి గట్టుకు వెళ్లిపోయింది. సోషలిజం ఒక తిట్టు పదమైపోయింది. అయితే అమానుష అసమానతలు లేని, ప్రతి ఒక్కరికీ శ్రేయో జీవితాన్ని సమకూర్చే ఒక మానవీయ సమాజ నిర్మాణ ఆకాంక్ష స్వతస్సిద్ధమైన స్ఫూర్తినిస్తోంది. అటువంటి సమాజాన్ని నిర్మించేందుకు ఆరాటపడేవారు తమను తాము సోషలిస్టులమని కాకుండా వేరే విధంగా పిలుచుకోవచ్చు. అయితే 20వ శతాబ్దిలో సోషలిస్టు శ్రేణులలో చీలికలు తెచ్చిన సైద్ధాంతిక, రాజకీయ విభేదాలను వారు తప్పక ఉపేక్షిస్తారు. మానవీయ సమాజానికై ఈ సరికొత్త అన్వేషణ బహుశా కొత్త రాజకీయ కార్యాచరణలకు దారితీసే అవకాశమున్నది. సోషలిజం స్ఫూర్తిని ఆవాహన చేసుకుని, దానిని పునరుజ్జీవింప చేసినప్పుడు జాతి భవితవ్యాన్ని సముజ్వలంగా నిర్మించేందుకు అదొక కార్యసాధకమైన భావజాల ప్రాతిపదిక అవుతుంది. వంద సంవత్సరాల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రభావ ప్రాబల్యాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు 90 సంవత్సరాల సోషలిస్టు ఉద్యమ వారసత్వం శక్తిమంతమైన రాజకీయ, మేధో వనరులను మనకు సమకూర్చగలదనే పరిపూర్ణ ఆశాభావంతో పూణే నుంచి నా స్వస్థలానికి వెళ్లాను.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ప్రసారమాధ్యమాల అగస్త్యుడు

నివాళి



> పీవీ ప్రధానమంత్రి కాగానే శర్మని దూరదర్శన్ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. పబ్లిక్ బ్రాడ్ కాస్టింగ్ సిస్టమ్‌లో ఆయన అనేక విప్లవాత్మక మార్పులు చేశారు. అందులో ప్రముఖంగా పేర్కొనదగినది డీటీహెచ్– డైరెక్ట్ టు హోమ్ సర్వీస్. ఈ సేవలు కేవలం మనదేశానికే పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా డీటీహెచ్ అందుబాటులోకి వచ్చింది.

దృశ్య శ్రవణ ప్రసారమాధ్యమాలను ఔపోసనం పట్టిన అగస్త్యుడు 'కె.ఎస్. శర్మ'గా లబ్ధప్రతిష్ఠులైన కంభంపాటి శ్రీనివాసశర్మ సెప్టెంబర్ 20న దిగంతాలకు తరలివెళ్లారు. ఎంతటి మహామనీషి! ఎంతటి సౌజన్యమూర్తి! ఎలా మాయమయ్యారు!? అవునులెండి, మహాకవి జాషువా చెప్పలేదూ.. కాలుడికి దయాదాక్షిణ్యమా! శర్మగారినీ తీసుకుపోయాడు.

గడచిన రెండు దశాబ్దాలకు పైగా కె.ఎస్. శర్మ ఆత్మీయతను, సౌజన్యాన్ని అప్పనంగా అనుభవిస్తూ వచ్చాను. ఆయన మూర్తిమత్వం బహు విశిష్టమైనది. విధి నిర్వహణలో భాగంగా అనేక అధికార హోదాలలో వారు ప్రదర్శించిన వ్యక్తిత్వం, అర్థవంతమైన జీవితం కోసం ఆయన పాటించిన విలువలు, సామాజిక వికాసం కోసం ఆయన చేసిన అవిశ్రాంత కృషి పదేపదే స్మరణీయాలు. మరీ ముఖ్యంగా విద్యారంగానికి వారు చేసిన సేవలు, ప్రసారమాధ్యమాలు సమాజశ్రేయానికి ధర్మకర్తృత్వం వహించాలని విశ్వసిస్తూ సుదీర్ఘకాలం రేడియో టీవీలను వారు నడిపిన తీరు, తీర్చిదిద్దిన వైనం– ఇవి చాలవా శర్మకి చేతులెత్తి నమస్కరించటానికీ కళ్లనూ గుండెనూ తడిచేసుకోటానికీ!

1965లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడుగా మొదలైన వారి ప్రస్థానం 1967లో ఐఎఎస్‌కు ఎంపిక కావటంతో ఒక మేలిమలుపు తిరిగింది. అప్పటి నుంచి సుమారు నలభై ఐదేళ్ల పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ స్థాయిలలో అనేక పదవులు నిర్వహించారు. విశాఖపట్టణం జిల్లా నర్సీపట్నం సబ్ కలెక్టర్ మొదలు ఆకాశవాణి, దూరదర్శన్, ప్రసారభారతి సంస్థలకు అధిపత్యం వహించేవరకూ వారి ఉద్యోగ విజయాలు జాగీయమానంగా సాగాయి. ఆకాశవాణి, దూరదర్శన్‌లకు డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరించిన మొట్టమొదటి ఐఎఎస్ అధికారి కె.ఎస్. శర్మ. అంతే కాదు, పదేళ్లకు పైగా కేంద్ర మానవవనరుల శాఖలోనూ, సమాచార ప్రసార మంత్రిత్వశాఖలోనూ ప్రతిభావంతంగా పనిచేసిన సివిల్ సర్వీస్ అధికారి కూడా ఆయనే.

ఇవన్నీ ఎలా తెలుసంటారా?... వారు తమ జీవన ప్రస్థానాన్నీ అనుభవాలనూ అక్షరబద్ధం చేయాలని సంకల్పించినప్పుడు కొన్ని జ్ఞాపకాలనూ ఎదురైన సవాళ్లనూ నాతో పంచుకున్నారు. వారు ఇంగ్లీష్‌లో ఎపిసోడ్‌ల వారీగా రాసుకున్న స్క్రిప్ట్‌ని నేను తెలుగులో రాయాలి. అదీ వారు నాకు అప్పగించిన పని. మూడు ఎపిసోడ్‌లు రాసి వినిపించాను. ఇంతలోనే సగంలో ముగింపు!

నక్సలైట్ల కార్యకలాపాలతో అట్టుడికిపోతున్న కరీంనగర్ జిల్లాను కల్లోలిత ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించిన సమయంలో శర్మ అక్కడ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. మరుక్షణం నుంచి నిరుపేదలకు భూముల పంపిణీ, పట్టణంలోని ప్రభుత్వ స్థలాల దురాక్రమణలను తొలగించటం, కలెక్టరేట్‌తో సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలూ ఒకే గొడుగు కిందకు వచ్చేలా నూతన భవన సముదాయాన్ని నిర్మింపచేయటం వంటి అనేక ప్రజాభ్యుదయ కార్యక్రమాలు జయప్రదంగా చేశారు. పాఠశాలలన్నిటికీ భవనాలు నిర్మించారు. ఇందుకోసం ప్రత్యేకంగా కరీంనగర్ ఎడ్యుకేషన్ సొసైటీని నెలకొల్పి నిధులు సమీకరించారు. సాంస్కృతిక క్రీడా కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు కరీంనగర్ లలితకళా పరిషత్తును నెలకొల్పారు. భారతరత్న డా. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి సంగీతసభను నిర్వహించి రసజ్ఞుల మెప్పుపొందారు. కె.ఎస్.శర్మ అంటే 'కరీంనగర్ శ్రేయోభిలాషి శర్మ'గా డా. సి. నారాయణరెడ్డి అభివర్ణించారు. అప్పటి ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డి, శర్మ పనితీరుకు ముచ్చటపడి సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్‌గా నియమిస్తే, సిపిఐకు చెందిన సి.హెచ్. రాజేశ్వరరావు మరికొంతకాలం కరీంనగర్ కలెక్టర్‌గా ఆయననే కొనసాగించమని ముఖ్యమంత్రిని అభ్యర్థించారు. చిత్రమేమిటంటే నక్సలైట్లు కూడా శర్మే కలెక్టర్‌గా ఉండాలని పట్టుపట్టారు. దాంతో ఆయన బదిలీ నిలిచిపోయింది. ఆర్తులు, అన్నార్తులు, దాహార్తులు, నిర్భాగ్యులు, నిరాశ్రయులను అక్కున చేర్చుకున్న ఆపన్నుడిగా ఇప్పటికీ ఆ జిల్లాలో కె.ఎస్.శర్మ పేరు చెప్పుకుంటారు.

చాలాకాలంగా శర్మ పనితీరునూ నిబద్ధతనూ గమనిస్తూ వచ్చిన పీవీ నరసింహారావు తాను కేంద్రంలో మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖను చేపట్టాక, దేశవ్యాప్తంగా గ్రామప్రాంతాలలోని పిల్లల కోసం ప్రారంభించదలచిన నవోదయ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆయనకి అప్పగించారు. ఆ పదవిలో ఉన్న ఐదేళ్లూ ఆ పాఠశాలలకు జీవం, సారం అన్నీ శర్మే అయ్యారు. ఆ పాఠశాలల్లో 33 శాతం సీట్లను ఆడపిల్లలకు కేటాయించారు. ఆ నిర్ణయానికి పీవీ సంతోషించారు. పీవీ ప్రధానమంత్రి కాగానే శర్మని దూరదర్శన్ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. పబ్లిక్ బ్రాడ్ కాస్టింగ్ సిస్టమ్‌లో ఆయన అనేక విప్లవాత్మక మార్పులు చేశారు. అందులో ప్రముఖంగా పేర్కొనదగినది డీటీహెచ్– డైరెక్ట్ టు హోమ్ సర్వీస్. ఈ సేవలు కేవలం మనదేశానికే పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా డీటీహెచ్ అందుబాటులోకి వచ్చింది.

అలాగే ఆకాశవాణి, దూరదర్శన్ ఆర్కైవ్‌లను పటిష్టం చేసి, ప్రముఖ కళాకారుల రికార్డింగ్‌లను సీడీలుగా, క్యాసెట్లుగా మార్పించి మార్కెటింగ్ డివిజన్ల ద్వారా విక్రయించే ఏర్పాటు చేశారు. అది సంస్థకు ఆదాయవనరుగా మారింది. అటు కళాకారులకూ లబ్ధి కల్పించారు. ఎవరెవరి రికార్డింగ్‌లను విక్రయిస్తున్నామో వారందరికీ వారి గ్రేడింగ్ ప్రకారం ఏకమొత్తంగా పారితోషికం చెల్లించమని ఆదేశించారు.

నా అదృష్టం – దక్షిణ ప్రాంత ఆర్కైవ్స్‌కు ప్రత్యేక అధికారిగా నన్ను నియమించి ఆయన పర్యవేక్షణలో పనిచేసే అవకాశం కల్పించారు. శర్మ సాధించిన మరొక ఘన విజయం ఏమిటంటే– స్పోర్ట్స్ రైట్స్ ఉన్న వారందరూ వారు నిర్వహించే కార్యక్రమాల సిగ్నల్స్‌ను విధిగా దూరదర్శన్‌కు ఇచ్చి తీరాలి. ఇందుకోసం పెద్ద పోరాటమే చేశారు. సుప్రీం కోర్ట్ వరకూ వెళ్లి విజయం సాధించారు. దీనితో దేశంలోని కేబుల్ పరిశ్రమ బలపడింది. క్రీడామంత్రిత్వ శాఖ ప్రతిష్ఠ ఇనుమడించింది. అదనపు కార్యదర్శి బాధ్యతలలో ఉన్నప్పుడే ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎమెరిటస్‌గా నియమితులయ్యారు. ఇలా ఎన్నని చెప్పను! "ఎవరు జీవించి ఉన్నట్లు?" అని యక్షుడి ప్రశ్న! "చనిపోయిన తరువాత కూడా ఎవరి పేరు ఎన్నాళ్లు ఈ లోకంలో వినబడుతుందో అన్నాళ్లూ వారు జీవించి ఉన్నట్లు!" అని ధర్మరాజు సమాధానం!!

• ప్రయాగ రామకృష్ణ

విప్లవ కమ్యూనిస్టులు గుర్తించని భారత వాస్తవం

'అరణ్యావాసంలోనే విప్లవ ప్రభాతం' (జూలై 25, ఆంధ్రజ్యోతి) అన్న నా వ్యాసంపై విమర్శలు, వ్యాఖ్యలకు నా ప్రతిస్పందన ఇది: భారత కమ్యూనిస్టులు తమ జీవితాలను త్యాగం చేసి శక్తిమంతమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించారు. జనసామాన్యంపై కమ్యూనిస్టుల ప్రభావం పెరిగిపోవడాన్ని, అట్టడుగు వర్గాలవారు ప్రజా ఉద్యమాలలో మరింతగా భాగస్వాములు కావడాన్ని గమనించిన మహాత్మా గాంధీ జవహర్ లాల్ నెహ్రూను తన వారసుడుగా ప్రకటించారు. సోషలిస్టు భావజాలాన్ని ప్రజలలోకి తీసుకు వెళ్లి, దానికి విశేష ప్రజా మద్దతును సాధించిన నెహ్రూయే దేశ పరిపాలకుడు కాగలడని గాంధీజీ సుదృఢంగా విశ్వసించారు. బ్రిటిష్ వారు ఎట్టి పరిస్థితులలోను సెప్టెంబర్ 1948 లోగా అధికారాన్ని భారతీయులకు అప్పగించి వెళ్లిపోవలసి ఉన్నది. అయితే కమ్యూనిస్టుల నాయకత్వంలో బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలు బాగా పుంజుకోవడంతో ఆ లోగానే నిష్క్రమించడానికి వలసపాలకులు నిర్ణయించుకున్నారు. 1947కు ముందుగానీ, ఆ తరువాత గానీ కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రభవించలేకపోయారు. ఎందుకని? వ్యక్తిగత త్యాగాలు ఉద్యమ లక్ష్య సాధనలో ఎవరినీ సఫల మనోరథులను చేయలేవు. పర్యవసానాలను కచ్చితంగా అంచనావేసి, యుక్తమైన వ్యూహాన్ని అభివృద్ధిపరచుకోవాలి. ఇటువంటి ప్రతిభావంతమైన వ్యూహకర్త గాంధీజీ. రైతులు, ముస్లింలు, యువజనులు, హరిజనులు, పట్టణ విద్యావంతులు తన రాజకీయ ఉద్యమాలు, ఆందోళనలలో పరిపూర్ణంగా పాల్గొనేలా చేసి జాతీయోద్యమాన్ని స్వాతంత్ర్య తీరానికి చేరవేసిన వ్యూహకర్త మహాత్ముడు. అయితే తాను నిర్మించిన ఉద్యమం కమ్యూనిస్టుల ప్రాబల్యంలోకి వెళ్లడాన్ని గమనించిన గాంధీజీ– నెహ్రూను తనకు వారసుడుగా దేశానికి యోగ్యమైన నాయకుడుగా అభిషేకించారు.

1947లో బ్రిటిష్ వారి నుంచి భారతీయులకు జరిగిన అధికార బదిలీ ఒక విధంగా పరాయి పాలకులతో కాంగ్రెస్ నాయకులు రాజీపడడమేనని, భారత్‌పై సామ్రాజ్యవాదుల నియంత్రణ కొత్త రూపంలో కొనసాగుతుందని కమ్యూనిస్టులు విశ్వసించారు. భారతీయ కమ్యూనిస్టు పార్టీ రెండవ ప్రధాన కార్యదర్శి బీ.టి. రణదివె.. గాంధీ, నెహ్రూలను సామ్రాజ్యవాదుల తొత్తులని నిందించాడు. దేశానికి నిజమైన స్వాతంత్ర్యం రాలేదని ఘోషించాడు. 1938 నుంచి 1948 పార్టీ ప్రథమ కార్యదర్శిగా ఉన్న పీసీ జోషీ పార్టీని, పార్టీ అనుబంధ సంస్థలు, రచయితల, కళాకారుల సంఘాలను ప్రతిభావంతంగా నిర్మించి అభివృద్ధిపరిచాడు. కాంగ్రెస్‌ను సవాల్ చేయకుండానే సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని ముమ్మరం చేశాడు. రష్యాలో విప్లవానికి ముందు కెరెన్‌స్కీ నిర్వర్తించిన పాత్రనే భారత్‌లో నెహ్రూ పోషిస్తున్నాడని భావిస్తూ తనను తాను లెనిన్‌గా రణదివె ఊహించుకున్నాడు. జోషి నిర్మించిన పార్టీ ఆలంబనతో నెహ్రూ నుంచి అధికారాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆశించాడు. ఆయన అభీష్టం నెరవేరకపోగా పార్టీకి తీవ్ర నష్టాలు వాటిల్లాయి. అయినా ఆ తరువాత ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు తనను తాను మావోగా భావించుకుని రైతాంగ విప్లవాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నించాడు.

> సాయుధ పోరాటమే విప్లవం కాదు. అది సామాజిక, రాజకీయ మార్పులను సాధించలేదు. ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థను భారత్ చాలా విజయవంతంగా నిర్మించింది. సాధారణ ఓటర్లు 'ఓట్ల పండుగ'లో మహోత్సాహంగా పాల్గొనటమే అందుకు నిదర్శనం.



రెండవ ప్రపంచ యుద్ధకాలంలోను, ఆ తరువాత తేభాగ, తెల్లిచెరి, తెలంగాణ, బాంబేలో చరిత్రాత్మక ప్రజా ఉద్యమాలు నిర్మించిన కమ్యూనిస్టులు భారత ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను సరిగా అర్థం చేసుకోలేక పోయారు. రాజ్యాంగ నిర్మాతలు అయిన జాతీయవాదులు దేశ ప్రజలకు సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పించారు. అణగారిన వర్గాల వారికి విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లు సమకూర్చారు. భారత్‌ను ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగా రూపొందించారు. సంస్థానాలను దేశంలో విలీనం చేసి జమీందారీలు, ఇతర భూస్వామ్య వ్యవస్థలను రద్దు చేశారు. భూసంస్కరణలను ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ ప్రైవేట్ రంగాలతో మిశ్రమ ఆర్థిక విధానాన్ని నెహ్రూ అనుసరించారు. చట్టసభలు, స్వతంత్ర న్యాయవ్యవస్థ, పార్లమెంటుకు జవాబుదారీగా ఉండే కార్యనిర్వాహక వర్గం మొదలైన ప్రజాస్వామిక సంస్థలను నెలకొల్పిన తొలి స్వతంత్ర దేశం భారత్. నెహ్రూ, అంబేడ్కర్‌లు అభివృద్ధిపరిచిన పార్లమెంటరీ ప్రజాస్వామిక ప్రక్రియల ప్రభావశీలతను భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ప్రభవించి లెనినిజం, మావో భావజాల చట్రంలో కమ్యూనిస్టులు అర్థం చేసుకోలేకపోయారు.


భారతదేశ వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు పంజాబ్, పశ్చిమ భారత రాష్ట్రాలు, ఆంధ్రలో చోటుచేసుకున్నాయి. నవీన వ్యవసాయంతో రైతు కులాల వారి ఆర్థిక స్థితిగతులు గణనీయంగా మెరుగుపడ్డాయి. వ్యవసాయరంగ విప్లవం ఆ సామాజిక వర్గాలను సంఘటితం చేసింది. బొంబాయి, అహ్మదాబాద్, పూనా నగరాలలో పారిశ్రామికాభివృద్ధి ప్రభావంతో వారిలో ఒక పెట్టుబడిదారీ వర్గం ప్రభవించింది. సంపద్వంతులు అయిన ఈ సామాజిక వర్గాల వారు కాంగ్రెస్‌కు మద్దతునిచ్చారు. నవ భారత రాజకీయాలు మార్క్సిస్టు భావజాల, లెనిన్ రాజకీయ సైద్ధాంతిక చట్రాలకు వెలుపల ఉండడంతో వాటిని కమ్యూనిస్టులు అర్థం చేసుకోలేక పోయారు. సరైన అవగాహన కొరవడిన కారణంగానే కమ్యూనిస్టులు తొలుత రెండు పార్టీలుగా విడిపోయారు. విడిపోయిన ఒక పార్టీ నుంచి మరొక విప్లవ పార్టీ ప్రభవించి, పిదప అనేక విప్లవ గ్రూపులుగా చీలిపోయింది. చిత్రంగా అందరూ భారత్‌ను అర్ధ భూస్వామ్య, అర్ధ వలస దేశంగా భావిస్తున్నారు.

ధనిక రైతులు రాజకీయ వర్గంగా ప్రభవించి ప్రాంతీయ పార్టీలు కూడా నెలకొల్పారు. కింది కులాలకు చెందిన సన్నకారు, చిన్నకారు రైతులు ఈ ధనిక రైతాంగంతో పోటీపడలేక పోయారు. క్రమంగా వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. వీరి శ్రమ ప్రాతిపదికనే వ్యవసాయ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందింది. వ్యవసాయరంగంలో పరివర్తన కులాల ప్రాతిపదికన జరిగిందని గ్రహించడం ముఖ్యం.

సామాజిక కులం, ఆర్థిక పెట్టుబడి కలగలసిపోవడమనేది భారతదేశం సాధించిన ఒక నవ కల్పన. అయితే భారత్ తన సామాజిక కులంతో పాటు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగమయింది. భారతీయ పెట్టుబడిదారులు వివిధ దేశాలకు పెట్టుబడిని ఎగుమతి చేస్తూనే కుల సంఘాలను ఏర్పాటు చేశారు.

ఈ మేధో సంక్షోభం నుంచి నక్సలిజం ప్రభవించింది. జనతా ప్రజాస్వామిక విప్లవంతో అర్ధ భూస్వామ్య అర్ధ వలస భారతీయ సమాజాన్ని నిర్మూలించేందుకు నక్సలైట్లు కంకణం కట్టుకున్నారు. 1970ల్లో విద్యార్థులుగా ఉన్న మేము వ్యవసాయ రంగంలో మార్పుల గతిశీలతను అర్థం చేసుకోలేకపోయాం. అయితే అర్ధ భూస్వామ్య, అర్ధ వలస భారతీయ సమాజాన్ని నిర్మూలించాలని ప్రగాఢంగా కోరుకునేవాళ్లం. లెనిన్ తుపాకీ పట్టాడా? తుపాకులే జార్‌ను కూలదోశాయా? 1917 అక్టోబర్‌లో రష్యన్ కార్మికులు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో తిరుగుబాటు చేసి వింటర్ ప్యాలెస్‌ను ఆక్రమించుకున్నారు. బోల్షివిక్కుల ప్రభుత్వం ఏర్పడి సోవియట్ రష్యన్ రిపబ్లిక్ నేర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. తిరుగుబాటు చేసిన కార్మికులలోనే లెనిన్ ఉన్నాడు. లెనిన్ తమ మధ్య ఉన్నట్టు ఆ కార్మికులకూ తెలుసు. నక్సలైట్ల వసంతకాల మేఘ గర్జన యాభై సంవత్సరాల అనంతరం కూడా మావోయిస్టు పార్టీ అగ్రనేత ఎవరైనా హతమైపోతే కనీసం ఒక రోజు బంద్‌ను కూడా పూర్తిగా విజయవంతం చేయలేని పరిస్థితి ఉన్నది. వర్తమాన రాజ్య వ్యవస్థ విప్లవ కమ్యూనిస్టు నాయకులను అంతమొందించేందుకు ఎంతకైనా తెగిస్తుంది. ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థ మహాశక్తిమంతమైన రాజ్య వ్యవస్థను నెలకొల్పింది. దానితో ఘర్షించడం అసాధ్యమనేదే నేను చెప్పదలుచుకున్నది. ఈ కారణంగానే నక్సలైట్లు గ్రామాల నుంచి అడవులలోకి వెళ్లవలసివచ్చింది. ఇప్పుడు సాయుధ బలగాల దాడులను తప్పించుకునేందుకు మధ్య భారతదేశ అడవులలో ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి నిరంతరం వెళ్లవలసి వస్తోంది. సాయుధ పోరాటమే విప్లవం కాదు. అది సామాజిక, రాజకీయ మార్పులను సాధించలేదు. ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థను భారత్ చాలా విజయవంతంగా నిర్మించింది. సాధారణ ఓటర్లు 'ఓట్ల పండుగ'లో మహోత్సాహంగా పాల్గొనటమే అందుకు నిదర్శనం.

◆ ఇనుకొండ తిరుమలి





● అరవింద వారధిని తాకుతూ వరద ప్రవాహం

కమీషన్‌కు.. లోనుకావాల్సిందే!

- డ్వాక్రా మహిళలపై ఆర్పీ, యానిమేటర్ల దోపిడీ!
- రుణం పొందాలంటే మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే
- ఒక్కో గ్రూపు నుంచి రూ. 10వేల నుంచి 15వేలు వసూలు
- పొదుపు రుణాల్లోనూ వాటాకు డిమాండ్



రుణాలు మంజూరు కావాలంటే.. ముందుగానే కమీషన్‌కు లోను కావాల్సిందేనని పొదుపు సంఘాల మహిళలపై ఆర్పీలు, యాని మేటర్లు బెదిరింపులకు పాల్పడుతున్నారు. డ్వాక్రా గ్రూపులకు బ్యాం కులు.. రుణ చెల్లింపులు బాగా ఉండి, రుణం ఇచ్చేందుకు ముందుకు వచ్చినా సరే వాటికి మోకా లడ్డు తున్నారు. ముందుగా కమీషన్ చెల్లిస్తేనే రుణానికి దరఖాస్తు పెడతా మని తెగేసి చెబుతున్నారు. ఇలా డ్వాక్రా మహి ళలపై యానిమేటర్లు, రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)ల దోపిడీ నిత్యకృత్యంగా మారి పోయింది. కానీ, వారిపై ఫిర్యాదు చేసేం దుకు పొదుపు మహిళలు ముందుకు రావడం లేదు. ఒక వేళ వచ్చినా తగిన చర్యలుంటాయన్న ఆశా వారికి లేదు.

“ ప్రత్తిపాడు మండలంలో డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరు కావాలంటే.. తమకు కమీషన్లు ఇవ్వాల్సిందేనంటూ యానిమేటర్లు పట్టుబట్టిన విషయం తాజాగా వెలుగు చూసింది. యానిమేటర్ మొదలు ఏపీఎం వరకూ చేతులు తడిపితేనే రుణాలు వస్తాయంటూ బెదిరింపులు శృతిమించడంతో వివాదం రచ్చకెక్కింది.



గుంటూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపుల మహిళలను మామూళ్ల గద్దలు వేధించుకు తింటున్నాయి. డ్వాక్రా సంఘాల్లో ఏ చిన్న పని జరగాలన్నా చేయి తడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వావలంబన కోసం ఇచ్చే రుణాలు మొదలు అత్యవసర పరిస్థితుల్లో తాము దాచుకున్న పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా గ్రూపు సభ్యులైన మహిళలు భారీ మొత్తంలో కమీషన్ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరి స్థితిపై మహిళలు గగ్గోలు పెడుతున్నా.. ఏమాత్రం వెరవకుండా పట్టణాల్లోని మెప్మా రిసోర్స్ పర్సన్లు, గ్రామాల్లోని సెర్ప్ యాని మేటర్లు అందినకాడికి మహిళలను దోచేస్తున్నారు.

● రాబందుల్లా ఆర్పీ, యానిమేటర్లు

ఉమ్మడి జిల్లాలో గ్రామీణాభివృద్ధి (మిగతా 6వ పేజీలో)



● పెనుమూడిపల్లెపాలెం వాసులను పడవల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలింపు

జల దిగ్బంధంలో లంకలు



పోతార్లంక నుంచి ట్రాక్టర్‌పై ఒడ్డుకు వస్తున్న యువకులు



దోనేపూడి వద్ద వరద నీటిలో పసుపు

- రోడ్లపైకి నీరు చేరటంతో దారులు మూత
- ఇళ్లలోకి వరద నీరు... లోతట్టు గ్రామాల నుంచి సురక్షిత ప్రాంతాలకు
- పెనుమూడిలో నదివైపు ఇళ్లలోకి నీరు
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ కృష్ణా పరివాహక ప్రాంత లంక గ్రామాలను చుట్టుముడుతోంది. రోడ్లపై ప్రవహిస్తుండటంతో రాకపోకలకు వీలులేకుండా దారులు మూసుకుపోతున్నాయి. మరోపక్క లోతట్టు గ్రామాల్లోని ఇళ్లలోకి క్రమంగా నీరు చొచ్చుకొస్తోంది. దీంతో ఆయా గ్రామాల నుంచి జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నాల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఇటు గుంటూరు జిల్లా, అటు బాపట్ల జిల్లాల పరిధిలో అరటి, కంద, పసుపు, తమలపాకు, బొప్పాయి వంటి వాణిజ్య పంటలు నీట మునిగాయి. పిలకతోటలు పూర్తిగా నీటిలో మునిగిపోతే, గెలలు వేసిన చెట్లు కూడా కనిపించకుండా ఆకులు చివర్ల మాత్రమే వరద నీటిలో తేలియాడుతూ కనిపిస్తున్నాయి.

- వివరాలు 8లో..

ముంచెత్తుతున్న కృష్ణమ్మ



రేపల్లె: మోర్తోట ఆలయం చుట్టూ చేరిన వరదనీరు



దుగ్గిరాల: పెదకొండూరులో వరదనీటిలో మినుము



తిప్పలకట్ట వద్ద వరద ప్రవాహంతో పొలాలకు కోత



కౌంటర్‌ల వద్ద చేసిన మార్పులను పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టర్ మేడం.. పీజీఆర్ఎస్ పద్ధతినే మార్చేశారు!

- డీటీ స్థాయి అధికారులతో అర్జీల స్వీకారం
- ఆ తర్వాతే విభాగాల వారీగా పరిశీలన
- చివరగా కలెక్టర్, జేసీ దృష్టికి..

గుంటూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవియన్స్ రీడ్రెసెల్ సిస్టమ్(పీజీఆర్ఎస్)ని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా వినూత్నంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు ఒక మూస పద్ధతిలో ప్రతి సోమవారం జరుగుతున్న ఈ కార్యక్రమానికి అధికారుల నుంచి జవాబుదారీతనం తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అర్జీదారుడు కలెక్టరేట్‌లోకి ప్రవేశించి ఫిర్యాదుల స్వీకరించే కౌంటర్ వద్దకు వెళ్లినప్పటి నుంచి ఆ అర్జీ కలెక్టర్‌కు చేరేంత వరకు సిస్టమ్‌ని సమూలంగా మార్పు చేశారు. సాధారణంగా అర్జీదారులు కలెక్టరేట్‌లోని కౌంటర్లలో ఫిర్యాదు నమోదు చేయించి.. ముందుగా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చి.. సమస్యను వివరించే వారు. అక్కడి నుంచి జేసీ, డీఆర్వో, డిప్యూటీ కలెక్టర్లు /ఆర్డీఓకు నివేదించేవాళ్లు. ఆ తర్వాత సంబంధిత శాఖ జిల్లా అధికారిని కలెక్టర్ పిలిచి సమస్య పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసేవారు. జిల్లా అధికారి అర్జీలను తిరిగి మండలాధికారులకు పంపించేవారు.

ఆదిలోనే జవాబుదారీతనం..

ప్రస్తుతం అర్జీలు తీసుకుంటున్న విధానంలో కలెక్టర్ అన్సారియా మార్పులకు ఉపక్రమించారు. అర్జీల స్వీకరణ కౌంటర్లను రెవెన్యూ, నాన్ రెవెన్యూగా విభజించారు. గుంటూరు డివిజన్, తెనాలి డివిజన్‌కు సంబంధించి ఐదుగురు చొప్పున డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులకు విధులు కేటాయించారు. వీరు అర్జీదారులు తీసుకొచ్చిన పత్రాలన్నింటినీ ఒక చెక్ లిస్టులో మార్కింగ్ చేసి, రెవెన్యూ అధికారుల వద్దకు పంపిస్తారు. ఎక్కువగా ఫిర్యాదులు అందే టాప్-10 ప్రభుత్వ శాఖలకు శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆయా శాఖల జిల్లా అధికారులుంటారు. వారు అర్జీలను పరిశీలించి గతంలో ఏమైనా ఎండార్స్‌మెంట్‌లు ఇచ్చారా, కోర్టు కేసులు ఉన్నాయా, అర్జీదారుడు మండల స్థాయి నుంచి ఇక్కడికి రావడానికి కారణం ఏమిటి? పరిష్కారంలో నిర్లక్ష్యం ఎవరిది.. వంటివన్నీ సమగ్రంగా పరిశీలించి ఒక ప్రొ ఫార్మాలో నమోదు చేసి.. కలెక్టర్ వద్దకు తీసుకెళ్తారు. అర్జీ రీఓపెన్ కాకుండా చేయడమే లక్ష్యంగా పీజీఆర్ఎస్‌లో సమూల మార్పులను కలెక్టర్ అన్సారియా చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. ఐవీఆర్ఎస్‌లో.. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో జిల్లా సంతృప్తి శాతం కేవలం 55 నుంచి 57 మధ్యనే ఉంది.

రూ.పది కోట్ల పొలం కొట్టేస్తే.. పింఛనుతో బతుకుతున్నాం !

● ఎస్పీ కార్యాలయంలో వృద్ధ దంపతుల ఆవేదన

గుంటూరు, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): దాదాపు రూ. పది కోట్లు విలువ చేసే తమ పొలాన్ని లీజు పేరుతో కొందరు కబ్జా చేస్తే.. ఏ ఆధారం లేక పింఛను డబ్బులతో బతుకుతున్నామని వృద్ధ దంపతులు ఎస్పీ కార్యాలయంలో ఆవేదన వెల్లబోసుకున్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో తమ సమస్యను అర్జీ రూపంలో విన్నవించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలేనికి చెందిన వణుకూరి అమ్మిరెడ్డి, అన్నపూర్ణ దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. అమ్మిరెడ్డికి మిర్చి యార్డు పక్కన ఒకటిన్నర ఎకరం పొలం ఉంది. గత ప్రభుత్వంలో కరోనా వల్ల తాను ఇంటికి పరిమితమైతే.. కొందరు తన కొడుకు కోటిరెడ్డికి ఆశ చూపి.. అతని సంతకంతో తన పొలాన్ని లీజుకు తీసుకున్నారన్నారు. అందులో పెట్రోల్ బంకు పెట్టి.. మిగిలిన పొలాన్ని లీజుదారులు తమ ఆధీనంలో ఉంచుకున్నారని తెలిపారు. లీజు పరంగా వారు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో.. మోసపోయాయని



గ్రహించి తన కొడుకు ప్రశ్నిస్తే.. బెదిరింపులకు దిగారని వాపోయారు. కబ్జా చేశారని తెలుసుకుని పొలం వద్దకు తన భార్యతో కలిసి తను వెళ్తే దాడి చేసి కొట్టారని అమ్మిరెడ్డి ఆవేదన చెందారు. అప్పట్లో నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. అప్పటి సీఐ శ్రీనివాసరావు తమపైనే తప్పుడు కేసు పెట్టి లోపల వేశాడని వృద్ధ దంపతులు కన్నీరు మున్నీరయ్యారు. 23 సార్లు ఎస్పీ కార్యాలయంలో అలాగే ఐజీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. పొలానికి చెందిన అన్ని డాక్యుమెంట్లు తన పేరు మీదే ఉన్నాయని, తన కొడుక్కి ఎలాంటి హక్కులు లేవని, లీజు చెల్లదని అమ్మిరెడ్డి తెలిపారు. కబ్జా చేసిన వారికి వైసీపీ నేతల మద్దతు ఉందని చెప్పారు. ఇందులో ఇద్దరు మీడియా ప్రతినిధుల పాత్ర కూడా ఉందన్నారు. అందరూ కుమ్మక్కై తన పొలాన్ని కబ్జా చేయడంతో.. తన భార్యకు వచ్చే రూ.4 వేల పింఛనుతోనే బతుకుతున్నామని దీనంగా నిట్టూర్చారు.

సందిగ్ధ వాతావరణంలో పత్తి



ఉమ్మడి గుంటూరు జిల్లాలో పత్తి తీతలు ఆరంభం కానున్నాయి. సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాలపై ఇంకా స్పష్టత రాలేదు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం సీసీఐ రెండో విడత నోటిఫికేషన్‌ను కూడా జిన్నర్లు (పత్తి మిల్లుల యజమానులు) బహిష్కరించారు. సీసీఐ, జిన్నర్ల మధ్య ప్రతిష్టంభనను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నా.. సఫలీకృతం కావడం లేదు.

- అక్టోబర్‌లో ఆరంభం కానున్న తీతలు
- ఇంత వరకు ఖరారు కాని కొనుగోలు కేంద్రాలు
- నిబంధనల సడలింపులపై జిన్నర్లు పట్టు
- సీసీఐ రెండోవ టెండర్ నోటిఫికేషన్‌కు స్పందన నిల్

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ప్రతి ఏటా అక్టోబర్ 21 నుంచి అధికారికంగా సీసీఐ కొనుగోళ్లు ఆరంభించేది. కేంద్రాలపై ముందు గానే స్పష్టత వచ్చేది. ఈ సారి ఆ పరిస్థితి లేదు. నిబంధనల సడలింపు కోసం జిన్నర్లు పట్టు బడుతుండగా.. సీసీఐ మెత్తబడే అవకాశాలు పెద్దగా కనిపించడం లేదు. ఇంతటి సందిగ్ధ వాతావరణంలో పత్తి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా కనిపిస్తోంది.

పక్క రాష్ట్రంలో లేని నిబంధనలు ఇక్కడేలా..

సీసీఐ ఈసారి ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రాల (మిగతా 6వ పేజీలో)

గతేడాది పరిస్థితి ఇదీ..

గతేడాది పత్తితీత సీజన్ ఆరంభమైనా.. సీసీఐ వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. దానివల్ల రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించక.. క్వింటా పత్తి రూ.5 వేల నుంచి రూ. 6 వేలకు మాత్రమే అమ్ముకున్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జోక్యం చేసుకొని సీసీఐ జనరల్ మేనేజర్‌ను బదిలీ చేయించిన తర్వాత ఉమ్మడి జిల్లాలోని రైతులకు మేలు జరిగింది.

డీఎస్సీ అభ్యర్థులకు 3 నుంచి శిక్షణ తరగతులు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు వచ్చే నెల 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో.. గుంటూరు, పల్నాడు, బాపట్ల ప్రాంతాల్లోని కళాశాలల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఇందు కోసం విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. జోన్- 3 పరిధిలో దాదాపు 1,600 మంది వరకు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇటీవల వీరికి నియామక పత్రాలను ప్రభుత్వం జారీ చేసింది.

నూతన ఉపకులపతి నియామకం ఎప్పుడు..?

● ముందుకు సాగని వర్సిటీ అభివృద్ధి

ఏఎన్‌యూ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూకు శాశ్వత ఉపకులపతి నియామకం లేకపోవడంతో వర్సిటీ అభివృద్ధి కుంటుపడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి వీసీ రాజశేఖర్ అధికార దుర్వినియోగం, అవినీతి, అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తి వీసీ పదవికి రాజీనామా చేయాలంటూ ఆందోళనలు ఉధృతం కావడంతో గత్యంతరం లేక రాజశేఖర్ గతేడాది జూలై ఒకటిన రాజీనామా చేశారు. రాష్ట్రప్రభుత్వం ఆచార్య గంగాధరరావును తాత్కాలిక ఉపకులపతిగా నియమించింది. శాశ్వత ఉపకులపతి నియామకం కోసం రెండుసార్లు సెర్చ్ కమిటీలను ప్రభుత్వం నియమించినప్పటికీ, నియామకం జరగలేదు. శాశ్వత ఉపకులపతి ఉంటే అన్ని అంశాలపై వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. విశ్వవిద్యాలయ అభివృద్ధి పరుగులు తీసే అవకాశం ఉంటుంది. తాత్కాలిక ఉపకులపతి పాలనలో కొన్ని కీలక నిర్ణయాలు నిబంధ నలు అడ్డురావడంతో అభివృద్ధి కార్యక్రమాలపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోలేక పోతున్నట్లు తెలుస్తోంది.

ఎన్‌జీ రంగా వ్యవసాయ వర్సిటీ అక్రమాలపై విచారణ..!

● యూనివర్సిటీ ప్రొఫెసర్ ఫిర్యాదుతో కదలనున్న డొంక

గుంటూరు సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లాం ఫాం సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమాలపై విచారణ జరగనుంది. ఈ మేరకు వ్యవసాయశాఖకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. యూనివర్సిటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఫిర్యాదు ఆధారంగా ఈ విచారణ జరగనున్నట్లు సమాచారం. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అక్రమాలపై ఆగస్టు చివరి వారంలో యూనివర్సిటీ ప్రొఫెసర్ ఫిర్యాదు చేశారు. కోరం లేకుండానే ఇంచార్జి వీసీ పాలకవర్గ సమావేశాలు ఏర్పాటు చేశారన్నది ఆయన ప్రధాన ఆరోపణగా కనిపిస్తోంది. ఆరుగురు సభ్యులు ఉంటేనే పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నా కేవలం ఐదుగు రితో మాత్రమే నడిపించి కీలక నిర్ణయాలు తీసుకున్నారని గవర్నర్ దృష్టికి తీసుకువెళ్ళారు. బదిలీలు, నిధుల కేటాయింపు, పదోన్నతుల వ్యవహారంలో కూడా భారీ అవినీతి జరిగిందని ఫిర్యాదులో పేర్కొనటంతో విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

విజిలెన్స్‌కు ఫిర్యాదులు

ఎన్‌జీ రంగా యూనివర్సిటీ అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఏవయితే ఆరోపణలు చేశారో వాటినే ఉటంకిస్తూ విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించి ఏసీబీ కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

25,839 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 26,167 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 25,839 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 4,715 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14200
నెంబరు. 5	10000	14300
273	10000	13600
341	10000	14700
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14600
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	15000
దేవనూరు డీలక్స్	10000	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9800	12000
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14400
నెంబరు. 5	10000	14000
273	----	----
341	10000	14800
4884	10000	13500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14700
బ్యాడిగి	10000	15000
దేవనూరు డీలక్స్	10500	14200
తాలుకాయలు	5000	7000

ప్రభుత్వ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ● దసరా, దీపావళి కానుకగా సుగాలీ మహిళలకు చీరల పంపిణీ

వినుకొండటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించడంతో పాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కిందని ఆయన అన్నారు. విఠంరాజుపల్లి సమీపంలోని జీవీ గెస్ట్ హౌస్‌లో జీఎస్టీ తగ్గింపుపై మహిళలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గింపు ద్వారా ఎన్డీయే ప్రభుత్వం నిత్యావసర ధరలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకొచ్చిందని అన్నారు. చంద్రబాబు హయాంలోని కూటమి ప్రభుత్వం పేదలకు సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇవ్వడంతో పాటు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళలకు ఆర్థిక వెసులుబాటును కల్పిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ఎస్సీ, ఎస్టీ చదువుకునే ఎస్టీ మహిళలకు రూ. 50వేల స్కాలర్ షిప్ అందజేస్తామని చెప్పారు. ఎస్టీ బిడ్డలు బాగా చదువుకొని వాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి స్కాలర్‌షిప్ అందజే స్తామని హామీ ఇచ్చారని అన్నారు. సేవాలాల్ దేవాలయ నిర్మాణానికి రూ.5లక్షలు విరాళంగా ఇచ్చి కమిటీ హాల్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. శివశక్తి లీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దసరా, దీపావళిని పురస్కరించుకొని 5 వేల మంది సుగాలీ మహిళ లకు చీరలతో పాటు గాజుల కొనుగోలుకు నగదును అందజేస్తామని జీవీ ఆంజనేయులు ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వ రరావు, మాజీ ఎంపీపీ ఆరికట్ల వాసుదేవరెడ్డి, మేరాజోత్ హనుమా నాయక్, పెనల వెంకటనారాయణ, గుండెనాయక్, గోవిందునాయక్, కౌన్సెలర్ షకీలాతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జీఎస్టీ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

శబరి ఎక్స్‌ప్రెస్.. ఇకపై సూపర్ ఫాస్ట్.!

● నేటి నుంచి మారనున్న రైలు నంబర్లు ● 2 గంటల ప్రయాణ సమయం ఆదా ● ప్రయాణికులపై సూపర్ ఫాస్ట్ చార్జీల భారం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-త్రివేండ్రం మధ్య నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ ఇకపై సూపర్ ఫాస్ట్ రైలుగా మారనుంది. ప్రస్తుతం 17229/30 నంబర్లతో నడుస్తున్న రైలు ఇప్పటి నుంచి 20629/30 నంబర్లతో పరుగులు పెట్టనుంది. గతంతో పోల్చుకుంటే రైలు వేగం పెరగడంతో ఆ రైలులో ప్రయాణించే వారికి సుమారు 2 గంటల ప్రయాణ సమయం ఆదా కానుంది. ఇప్పటివరకు సికింద్రాబాద్ నుంచి రోజూ మధ్యాహ్నం 12.20 గంటలకు బయల్దేరి మరుసటి సాయంత్రం 6.05 గంటలకు త్రివేండ్రంకు చేరుకునేది. తాజాగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారాక ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 6.25 గంటలకు చేరనుంది. అలాగే మనుపు త్రివేండ్రంలో ఉదయం 6.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు సికింద్రాబాద్‌కు వచ్చే ఈ రైలు, ఇప్పుడు త్రివేండ్రంలో ఉదయం 6.45 గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 11 గంటలకు చేరనుంది. శబరి ఎక్స్‌ప్రెస్ సూపర్ ఫాస్ట్ కావడంతో ప్రయాణికులపై చార్జీల భారం పడనుంది. ప్రయాణికులు జనరల్ సెకండ్ క్లాస్ టికెట్‌కు అదనంగా రూ.15, స్లీపర్ ఏసీ తరగతులకు రూ.30 నుంచి 40 వరకు చెల్లించాల్సి ఉం టుంది. కాగా, ఇప్పటి వరకు దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ఉండే ఈ రైలు నిర్వహణ బాధ్యతలను ఇప్పటి నుంచి సదరన్ రైల్వే చేపట్టనుందని రైల్వే ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఏకపక్షంగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

● యేల్చూరి ప్యానల్ ఘన విజయం

గుంటూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తొలి నుంచి ఉత్కంఠ కలిగించిన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఏకపక్షంగా సాగాయి. ఈ ఎన్నికల్లో యేల్చూరి ప్యానల్ సభ్యులు ఘన విజయం సాధించారు. ప్రత్యర్థిగా నిలిచిన రంగా బాలకృష్ణ ఇతర సభ్యులు ఓటమి పాలయ్యారు. చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం గడువు ఏడాది పాటు ఉంటుంది. కార్యవర్గం పదవీ కాలం ముగిసే లోపు సర్వసభ్య సమావేశం నిర్వహించి బరిలో ఎవరూ నిలవకపోతే ఎన్నిక ఏకగ్రీ వం అయ్యేది. ప్రస్తుత అధ్యక్షుడు యేల్చూరి ప్యానెల్‌పై సుదీర్ఘకాలం చాంబర్ కార్యదర్శిగా వ్యవహరించిన రంగా బాలకృష్ణ వర్గం పోటీకి దిగింది. చాంబర్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఎన్నికలు జరిగాయి. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ సాగింది. జిల్లా కేంద్రం గుంటూరుతో పాటు బాపట్ల, తెనాలి, పల్నాడు ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలతో జిన్నా టవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయానికి సభ్యులు తరలివచ్చారు. దాంతో చాంబర్ భవనం వద్ద కోలాహలం నెలకొంది. చాంబర్‌లో మొత్తం 3 వేల మంది ఉండగా 700 మంది సభ్యులు ఎన్నికలకు హాజరై ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కౌంటింగ్ నిర్వహించి యేల్చూరి ప్యానల్ ఘన విజయం సాధించినట్లు ఆతుకూరి వెల్లడించారు.



ఓటరు స్లిప్పులు అందజేస్తున్న యేల్చూరి, ఆతుకూరి తదితరులు

కమీషన్‌కు లోనుకావాల్సిందే..!

(5వ పేజీ తరువాయి)

శాఖ పరిధిలో 74,640 స్వయం సహాయక బృందాలు (డ్వాక్రా గ్రూపులు) ఉన్నాయి. వాటిలో ఏడున్నర లక్షల మందికి పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు. గ్రూపు నిర్వహణ, సభ్యుల సమావేశం, కార్యకలాపాల్లో సహాయ సహకారాలు అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో రిసోర్స్ పర్సన్లను మెప్మా నియమించగా, గ్రామీణ ప్రాంతాల్లో యానిమేటర్లను గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ నియమించింది. ఇలా గ్రూపు మహిళలకు సహాయ, సహకారాలు అందించడం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పుడు రాబందుల వ్యవస్థగా మారిపోయింది. గ్రూపు మహిళలను పీడించుకుతింటున్నారు. డ్వాక్రా మహిళలు తమకు కమీషన్ చెల్లించడం అనేది హక్కుగా చెబుతూ వారిపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. ఒక్కో పనికి రేటు కట్టి మామూళ్లు వసూళ్లు చేస్తున్నారు.

● రుణం పొందాలంటే రూ. 10వేలు ఇవ్వాల్సిందే!

డ్వాక్రా గ్రూపుల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణ సహాయం చేస్తుంది. ఏదో ఒక స్వయం ఉపాధి పొందుతూ.. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఆ రుణాలు తోడ్పడుతాయి. రుణం తీరిన వెంటనే మరోమారు రుణాలు అంది స్తుంది. నిరంతరం జరిగే ఈ ప్రక్రియను యానిమేటర్లు, ఆర్పీలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. డ్వాక్రా సంఘాలకు ఇచ్చే రుణాలు బ్యాంకుల నుంచి సభ్యుల ఖాతాల్లో జమ కావాలం టే యానిమేటర్ లేదా ఆర్పీ తీర్మానం రాసి, సీసీ, ఏపీఎం సంత కాలు చేయించి అప్రూవల్ చేయించాలి. ఇదే వారికి వరంగా మా రింది. దీనిని అడ్డం పెట్టుకుని ప్రతిసారి ఇలా రుణం పొందే సమయంలో ఒక్కో మహిళ నుంచి రూ.వెయ్యి, రూ.1,500 వరకూ, లేదంటే గ్రూపు మొత్తంగా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ ఆర్పీలు, యానిమేటర్లు వసూలు చేస్తున్నారు. పొందుపు మహిళలు ఇవ్వడానికి ఇష్టపడకపో తే తీర్మానాలు రాయకుండా అపుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా వెరవని స్థితికి వారు చేరారు. మహిళలు ఫిర్యాదులు చేయకుండా బెదిరింపులకు దిగుతున్నారు. వీటితో పాటు అత్యవసర సమయంలో పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా వీరి మామూళ్ల బాదుడు తప్పడం లేదు. గ్రూపునకు రూ.2 వేల నుంచి రూ.4వేలు ఇవ్వకుండా పనిమాత్రం జరగడం లేదు. వీటితో పాటు ప్రతినెలా నిర్వహించే గ్రూపు సమావేశంలో సమావేశంలోని అంశాలు, తీర్మానాలు రాసినందుకు రూ.500 నుంచి వెయ్యి రూపాయ లు వసూలు చేస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు లబోదిబో మం టున్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

సందిగ్ధ వాతావరణంలో పత్తి

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు కోసం తెచ్చిన నిబంధనలు చాలా సంక్లిష్టమైనవని జిన్న ర్లు అంటున్నారు. పక్క రాష్ట్రంలో పెట్టని నిబంధనలు ఇక్కడ అమ లు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దూది శాతం (ఓటీ) గతం కంటే ఈ ఏడాది ఎక్కువ రావాలన్న డిమాండ్‌ను జిన్న ర్లు స్వాగతించడం లేదు. రాష్ట్రంలోని భూమి స్వభావం, వాతావ రణం, విత్తనాల స్వభావం సీసీఐ చెబుతున్న శాతాన్ని చేరుకోలేవని అంటున్నారు. దానితో పాటు దేశంలోని టెక్స్‌టైల్ కమిటీ ఇచ్చిన రేటింగ్ ఆధారంగా ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3, ఎల్ 4, ఎల్ 5 సెంటర్లు ఎంపిక చేయాలన్న ది జిన్నర్ల ప్రధాన సూచన. ఎందుకంటే టెక్స్‌టైల్ కమిటీ అన్ని మిల్లులను పరిశీలించి.. అక్కడ ఉన్న మౌలిక వసతులు, భద్రతా నిర్వహణ, మిల్లులోనే వేబ్రిడ్జి ఏర్పాటు ఆధారం గా స్టార్ రేటింగ్ నిర్ణయిస్తుంది. దేశంలోని అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఈ రేటింగ్ ఇవ్వడం జరుగుతుంది. సీసీఐ మాత్రం బయ్యర్లు మిల్లులు తనిఖీ చేసి ఇచ్చే నివేదిక ఆధారంగా కేంద్రాలు ఎంపిక చేస్తామని చెబుతుండటం వివాదం రేపుతోంది. ఈ విషయాలు తేల్చకుండా టెండర్లు వేయమంటే తాము వేసేది లేదని జిన్నర్లు అంటున్నారు. ఈ వ్యవహారం తేలితే తప్ప పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగదు.

ఆలస్యం అయితే ఇబ్బందే

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పల్నాడు ప్రాంతంలో సుమారు 1.45 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తున్నారు. అక్టోబర్ మొదటి వారంలోనే ముదురు పత్తి తీతకు సిద్ధమవుతుంది. గుల్లలు పగిలిన వెంటనే పత్తి తీయకపోతే అక్టోబర్‌లో వచ్చే తుపాన్‌లు, వాన ముసు రుకు పూర్తిగా పత్తి పాడవుతుంది. తీసిన పత్తిని వెంటనే అమ్ముకునే సంప్రదాయం ఆ ప్రాంతంలో ఉంది. సీసీఐ కేంద్రాలు ఉంటే పత్తికి మద్దతు ధర లభిస్తుంది. లేకపోతే దళారులు తెల్ల బంగారాన్ని అతి తక్కువ ధరకే కొనుగోలు చేయడం ప్రారంభిస్తారు. ఈ ఏడాది కూడా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 12 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ ఏడాది క్వింటా పత్తి ధర రూ.8,110 (మొదటి శ్రేణి నాణ్యత), దిగువ శ్రేణి నాణ్యత పత్తి కి రూ.7,710 మద్దతు ధరగా నిర్ణయించారు. సీసీఐ ప్రకటించిన ధరపై రైతులు చాలా వరకు సంతృప్తిగా ఉన్నప్పటికీ కేంద్రాలు ఏర్పాటుపై స్పష్టత రాకపోవటం ఆందోళన కలిగిస్తోంది.

ఏ యాప్ ఉంటుంది

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో.. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా రైతు ప్రయోజనాలకు పెద్ద పీట వేసింది. ఆ నేపథ్యంలోనే జిన్నర్లు సడలించాలని కోరుతున్న నిబంధనలను.. పరిశీలించాలని ప్రభుత్వం సీసీఐకి సూచిస్తోంది. గతంలో సీసీఐ పత్తి కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో తెచ్చిన సీఎం యాప్‌ను వినియో గించేవారు. ఈ యాప్ అందుబాటులోకి రావడం వల్ల కొనుగోళ్లలో అక్రమాలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం తర్వాత సీసీఐ కిసాన్ యాప్‌ను తెరపైకి తెచ్చింది. దానిని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ఏఎన్‌యూ ఫార్మసీ పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది నిర్వహించిన ఫార్మసీ రీవాల్యుయేషన్ 1 నుంచి 7వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం విడుదలయ్యాయి. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగిందని తెలిపారు. అలాగే బీటెక్ రెగ్యులర్ రెండో ఏడాది 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కూడా విడుదల చేసినట్లు చెప్పారు. పరీక్ష ఫలితాలు ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రైలు కిందపడి ప్రేమ జంట ఆత్మహత్య

● మృతులు బీటెక్ విద్యార్థులు

మేడికొండూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం పేరేచర్ల -ఫిరంగిపురం స్టేషన్ల మధ్య ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన కోడె శ్రీనివాసరావు (20), కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన బి.లక్ష్మీ ప్రియాంక పేరేచర్ల సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. కొంతకాలంగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం ఇంట్లో చెప్పి పెళ్లి చేసుకుందామని ప్రయత్నించారు. ఇందుకు శ్రీనివాసరావు తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో వీరిద్దరూ గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 5న ఫిర్యాదు చేశారు. తామిద్దరం ప్రేమిం చుకుని పెళ్లి చేసుకున్నామని పెద్దలు అంగీకరించడం లేదని చెప్పారు. దీంతో పట్టాభిపురం పోలీసులు ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అనంతరం వీరిద్దరూ పేరేచర్లకు చేరుకొని కళాశాలకు వెళ్లడం ప్రారంభించారు. లక్ష్మీ ప్రియాంక హాస్టల్‌లో ఉంటుండగా, శ్రీనివాసరావు తన స్నేహితులతో కలిసి గదిలో ఉంటున్నాడు. అయితే శ్రీనివాసరావు తల్లిదం డ్రులు పెళ్లికి అంగీకరించేది లేదని తేల్చిచెబుతూ మాట్లాడటం మానేశారు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు ఈ నెల 27న రాత్రి పేరేచర్ల-ఫిరంగిపురం రైల్వేస్టేషన్ల మధ్య ట్రైన్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న లక్ష్మీ ప్రియాంక 28వ తేదీన ఉదయం అదే ప్రాంతానికి చేరుకొని రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వీరిద్దరి మృతదేహాలను నరసరావుపేట రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వీరి మరణంతో కళాశాలతో పాటు వారి వారి గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. వారి తలిదండ్రులు బోరున విలపించారు.



శ్రీనివాసరావు, లక్ష్మీ ప్రియాంక(ఫైల్)

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరి మృతి

తాడికొండ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిడుముక్కలలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన కుంభ శ్రీనివాసరావు (26) తన వ్యక్తి గత పనుల నిమిత్తం గుంటూరుకు వెళ్లి తిరిగి తన స్వగ్రామానికి బైక్ పై బయలుదేరాడు. తాడేపల్లికి చెందిన మరో వ్యక్తి నిడుముక్కలలో ఉన్న తన సోదరితో కలిసి గుంటూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో నిడుముక్కలలోని కళాజ్యోతి సమీపంలోకి రాగానే ఎదురెదురుగా వస్తున్న వీరి బైకులు బలంగా ఢీకొన్నాయి. ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా మార్గమధ్యలో శ్రీనివాసరావు మృతి చెందాడు. తాడేపల్లికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియరాలేదు. తాడికొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి

● జిల్లా అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆమె జేసీ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్, తాగునీరు సరఫరా, పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, గ్రామ, వార్డు సచివాలయ సేవలు, హౌసింగ్ తదితర కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సూపర్‌సేవింగ్స్ కార్యక్రమాల ధరలు తగ్గడంపై ప్రజలకు అవగాహన కలిగేలా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా సురక్షిత తాగునీరు సరఫరాతోపాటు, పారిశుధ్యంపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 అవగాహన సమావేశాలు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం గ్రామ, జిల్లాస్థాయిలో నిర్వహించాలన్నారు. ఆటోమిత్రలో ఆమోదం పొందిన దరఖాస్తుల ఈకేవైసీ 100 శాతం తక్షణమే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలి, జడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీఏవో నాగేశ్వర రావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, డీపీవో సాయి కుమార్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అనుమతులు లేని అన్నపూర్ణ కాంప్లెక్స్ కూల్చివేయాలి

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా జాతీయరహదారి వెంబడి నిర్మించిన అన్నపూర్ణ కాంప్లెక్స్‌ను తక్షణమే కూల్చివేయాలని కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నూతన లీజుదారులు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. జీపీఆర్ఎస్‌లో ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.లక్షలు వెచ్చించి పాడుకున్న కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నూతన లీజ్‌దారులను వ్యాపారం చేసుకోనీయకుండా అడ్డుకుంటున్నారన్నారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కమిషనర్‌కు ఫిర్యాదు అందజేశారు

వేద స్వస్తి ఆశీర్వాదం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ ధార్మిక ప్రాంగణంలోని యాగశాలలో సోమవారం వేద స్వస్తి నిర్వహించారు. భారతి ధార్మిక విజ్ఞాన్ పరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల నిర్వహణలో 235మంది వేదపండితులు భక్తిశ్రద్ధలతో వేద స్వస్తిని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీహరి, సత్యనారాయణ, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణతోనే రాష్ట్రాభివృద్ధి


ఎస్పీ వకుల్ జిందాల్ సత్కరిస్తున్న శంకరరావు

గుంటూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసువ్యవస్థ శాంతి భద్రతలను సక్రమంగా పరిరక్షించడం వల్లనే రాష్ట్ర అభివృద్ధి సవ్యంగా సాగుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. ఎస్పీగా నూతనంగా నియమితులైన వకుల్ జిందాల్‌ను ఆయన బీసీ సంఘం నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ అథ్లెట్‌లుగా రోషన్, రమేష్


క్రీడాకారులను అభినందిస్తున్న కృష్ణమోహన్ తదితరులు

గుంటూరు(క్రీడలు), సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రెండురోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో గుంటూరుకు చెందిన షేక్ రోషన్, బి.ఘనరమేష్ ఉత్తమ క్రీడాకారులుగా ఎంపికయ్యారు. రోషన్ అండర్-20 బాలుర విభాగంలో 110 మీటర్ల హర్డిల్స్‌లో బంగారుపతకాన్ని సాధించగా, రమేష్ అండర్-14 బాలుర విభాగంలో ట్రయత్లాన్‌లో బంగారు పతకాన్ని సాధించి ఈ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏఎన్‌యూలో రోషన్, రమేష్‌లకు శిక్షణ ఇస్తున్న శిక్షకులు కృష్ణమోహన్, రవి, జిల్లా అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, సంఘ చైర్మన్ జి.శేషయ్య, ఏపీసీసీ కార్యదర్శి జి.ఉషారాణి, ఎం.శివకుమార్, అరుణ్‌కుమార్ క్రీడాకారులను అభినందించారు.

బీజేపీ ఎస్టీ మోర్చాను బలోపేతం చేయాలి

● రాష్ట్ర అధ్యక్షుడు పాంగి రాజావు

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ ఎస్టీ మోర్చాను బలోపేతం చేయాలని ఆ వి భాగం రాష్ట్ర అధ్యక్షుడు పాంగి రాజారావు అన్నారు. సోమవారం ఆయన జిల్లా బీజేపీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ, ఎస్టీలలో ఉన్న సమస్యలను గుర్తించి అండగా ఉండాలన్నారు. ఎస్టీ మోర్చా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి తపనచౌదరి మాట్లాడుతూ, జిల్లాలో ఎస్టీలకు బీజేపీ అం డగా ఉంటుందని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, గిరిజన మోర్చా జోనల్ ఇన్చార్జి దేవసోత్ వెంకటేశ్వర్లు నాయక్, శ్రీనునాయక్, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

జీఎస్టీ ప్రయోజనాలు ఇంటింటికీ తెలియజేయాలి

గుంటూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ తెలిసేలా జీఎస్టీ ప్రయోజనాలను ప్రచారం చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. 'సూపర్ జీఎస్టీ సూపర్‌సేవింగ్స్'పై సోమవారం సంబంధిత అధికారులతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని ప్రతి కుటుంబానికి జీఎస్టీ ప్రయోజనాలు తెలియాలన్నారు. ఇందుకోసం ప్రజా ప్రతినిధులు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు విస్తృతంగా పాల్గొనాలని చెప్పారు. నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ ఓబులేసు, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వర రావు, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● మేయర్ కోవెలమూడి రవీంద్ర


అర్జీలు స్వీకరిస్తున్న నగర మేయర్ రవీంద్ర, ఏసీ ఓబులేసు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం నగర పాలకసంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్ వంటి వేదికలకు వచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర అధికారులకు తెలిపారు. నగర కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్‌హాల్లో పీజీఆర్ఎస్‌ను అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 27 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయిపరిశీలనకు వెళ్లాలన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో మేయర్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ, పీజీఆర్ఎస్‌లో అర్జీల నమోదుకి ప్రతి విభాగంలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సిబ్బందిని కేటాయించి, రిజిస్టర్ ఏర్పాటుచేయాలన్నారు. పీజీఆర్ఎస్‌లో 31 అర్జీలు అందాయన్నారు.

పేదల సంక్షేమం కోసమే జీఎస్టీ 2.0

పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసమే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0ను ప్రవేశపెట్టిందని మేయర్ రవీంద్ర తెలిపారు. సోమవారం నగరపాలకసంస్థ కౌన్సిల్ హాల్లో జీఎస్టీ 2.0పై అధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ, జీఎస్టీ 2.0 తగ్గింపుపై అన్ని డివిజన్లల్లో ప్రజలకు వివరించాలన్నారు.కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఓబులేసు మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమాలలో జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ అనసూయ, సిటీప్లానర్ రాంబాబు, ఇన్‌ఛార్జ్ ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాజా జీఎస్టీతో రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం

● ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం తెచ్చిన నూతన జీఎస్టీతో రాష్ట్ర ప్రజలకు రూ.8వేల కోట్ల మేర ప్రయోజనం చేకూరుతుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సంస్కరణలు రైతులు, మహిళలు, చిన్న వ్యాపారవర్గాలకు గేమ్‌చేంజర్ అవుతాయన్నారు. ధరలు తగ్గడం వలన ఎంఎస్ఎంఈ రంగం బలోపేతం అవుతుందని, వ్యాపారులు, ఉద్యోగులు, నిపుణులందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. ఎరువులు, వ్యవసాయయంత్రాలపై జీఎస్టీ 18శాతం నుంచి 5శాతానికి తగ్గించడంతో రైతుల ఉత్పాదక వ్యయం గణనీయంగా తగ్గుతుందన్నారు.

గుండెపోటు రోగుల ప్రాణరక్షణకు ప్రైమరీ పీసీఐ


డాక్టర్ నాగార్జున, డాక్టర్ హేమసుందర్ తదితరులు

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురైన రోగుల ప్రాణాలను రక్షించేందుకు ప్రైమరీ పర్క్యుటేనియస్ కరోనరీ ఇంటర్వెన్షన్ (పీసీఐ, స్టెంట్ విధానం) అత్యంత ముఖ్యమని శ్రేష్ఠ హాస్పిటల్స్ కార్డియాలజిస్టులు డాక్టర్ నాగార్జున గొట్టిపాటి, డాక్టర్ హేమ సుందర్ కొర్రపాటి తెలిపారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా శ్రేష్ఠ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రోగిని ఆసుపత్రికి తీసుకొచ్చిన వెంటనే 24 గంటల కార్డియాక్ ఎమర్జెన్సీ టీమ్ ఆధ్వర్యంలో ఆధునిక పరికరాలతో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. గుండెపోటుగా నిర్ధారణయితే వెంటనే ప్రైమరీ పీసీఐ చికిత్స అందిస్తామని చెప్పారు. ఇది ప్రాణాలను కాపాడటంతో పాటు భవిష్యత్తులో వచ్చే సమస్యలను కూడా తగ్గిస్తుందన్నారు. శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో అత్యాధునిక సదుపాయాలు, 24గంటల నిపుణుల బృందం అందుబాటులో ఉందని చెప్పారు. గుండెపోటు వచ్చిన తర్వాత రోగులను ఎంత త్వరగా చికిత్సకు తీసుకువస్తే, అంత త్వరగా వారి ప్రాణాలు కాపాడగలమని, రోగికి ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందజేయగలమని డాక్టర్ నాగార్జున వెల్లడించారు.

పనిచేయని కాంట్రాక్టర్లను తొలగించండి


జీఎస్టీ 2.0 అమలుపై షాపుల్లో ఆరా తీస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మంచినీటి సరఫరా బలోపేతం దిశగా చర్యలు చేపడుతున్నామని, ఇందులో అలసత్వం వహించే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆదేశించారు. నియోజకవర్గంలోని శివనాగరాజుకాలనీ, సంపత్‌నగర్లలో సోమవారం ఆయన రూ.1.23కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టిన కాంట్రాక్టర్లు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గోళ్ళ ప్రభాకర్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

● జీఎస్టీ 2.0 గేమ్ చేంజర్

జీఎస్టీ 2.0 దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక శక్తి అని, అదొక గేమ్ ఛేంజర్ అని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ గీతామాధురి సోమవారం నగరంలో నిర్వహించిన జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొ లుత పట్నంబజార్‌లోని వ్యాపారులు, ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడారు.

మిర్చియార్డు డీసీఎంఎస్ కేంద్రంలో చైర్మన్ పరిశీలన


రైతులకు ఎరువులను అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబునాయుడు తదితరులు

గుంటూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డులోనున్న డీసీఎంఎస్ గోడౌన్‌ను ఆ సంస్థ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులను మార్క్‌ఫెడ్, ఇఫ్కో, కోరమండల్ సంస్థల ద్వారా ఎన్డీఏ ప్రభుత్వం విస్తృతంగా కొనుగోలు చేసి, డీసీఎంఎస్ కేంద్రాలకు పంపిణీ చేసిందన్నారు. సబ్సిడీ ధరలకే ఎరువులు రైతులకు అందుతున్నాయన్నారు. అలాగే నానో డీఏపీ, నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరిగోపాల్, టీడీపీ నాయకులు బొబ్బిలి రామారావు పాల్గొన్నారు.

భూయజమాని సంతకం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులందరికి భూ యజమాని సంతకం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి పంటరుణాలు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుమిత్ర, జాయింట్ లైబిలిటీ గ్రూప్‌లకు రిజర్వ్ బ్యాంక్ నియమాల మేరకు ప్రతి రైతుకు రూ.2లక్షల వరకు హామీలేని వ్యక్తిగత రుణాలు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబరు 13, 14 తేదీలలో మండల కేంద్రాలలో ఆందోళనలు చేపడుతున్నట్టు చెప్పారు. సంఘ జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ అధికారులు కౌలు రైతులకు రుణాలిస్తామని వాగ్దానాలు చేయడం తప్ప ఆచరణ శూన్యమన్నారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు, సాంబిరెడ్డి, కృష్ణ, అమ్మిరెడ్డి, నీలాంబరం పాల్గొన్నారు.


ఎస్వీఎన్ కాలనీలో శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో సరస్వతీ దేవిగా..


విద్యానగర్, సాయి సన్నిధానంలో సరస్వతీ దేవిగా..


బ్రాడీపేట శంకరమందిరంలో సరస్వతి దేవిగా..



చుట్టుగుంట పోలేరమ్మతల్లి ఆలయంలో శ్రీ సరస్వతిదేవిగా


సరస్వతీ...నమస్తుభ్యం

● ఘనంగా జరుగుతున్న దేవి నవరాత్రులు

● సరస్వతీ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. సోమవారం మూల నక్షత్రం పురస్కరించుకుని అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. పలు దేవాలయాల్లో అమ్మవారిని శ్రీసరస్వతిదేవిగా అలంకరించారు. విద్యార్థులు పాల్గొని సామూహిక సరస్వతి పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యసం చేశారు.


మారుతినగర్‌లో మారుతి దేవాలయంలో సరస్వతీ దేవి అలంకరణలో...


పొన్నూరు రోడ్డులోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో..

జీజీహెచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతదేహాన్ని జీజీహెచ్ అవుట్ పోస్ట్ సిబ్బంది మార్చురీలో భద్రపరిచి కొత్తపేట పోలీసులకు సమాచారమిచ్చారు. మృతునికి సుమారు 60 సంవత్సరాల వయసుందని, ఇతని ఆచూకీ తెలిసినవారు కొత్తపేట పోలీస్‌స్టేషన్ నంబరు 8688831320కు సంప్రదించాలని పోలీసులు కోరారు.

నకిలీ బంగారం అంటగట్టి రూ.12 లక్షల టోకరా

తక్కువ ధరకే బంగారం ఇస్తామని నమ్మించి ఓ మహిళకు మోసగాళ్లు టోకరా వేశారు. ఎల్‌ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్న పఠాన్ గాలి షాహిద్ భార్యకు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి గతంలో ఆమెతో పరిచయం ఉన్నట్లు నమ్మించాడు. తమ తాత ఇల్లు వర్షాలకు పడిపోయిందనీ, పునాది కోసం గోయి తవ్వినప్పుడు తమకు బంగారం దొరికిందని చెప్పారు. తమ వద్ద 4 కేజీల వరకు బంగారం ఉందని, రూ.12లక్షలిస్తే అందులో అర కిలో బంగారం ఇస్తానని నమ్మించారు. కావాల్సి వస్తే కర్నాటక రాష్ట్రం హోస్‌పేట్‌కు రావాలని చెప్పారు. నమ్మిన బాధితురాలు ఈ నెల 7న అక్కడకు వెళ్లి రూ. 12 లక్షలు చెల్లించి బంగారం తీసుకొచ్చింది. అయితే గుంటూరుకు వచ్చిన తర్వాత దాన్ని పరిశీలించగా అది నకిలీదని తేలడంతో కంగుతింది. తనకు వచ్చిన నంబర్లకు తిరిగి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

తెలుగు మహిళా నాయకురాలిపై మరో చీటింగ్ కేసు

తెలుగు మహిళా నాయకురాలు వాసిరెడ్డి ప్రసన్న రాధికపై మరో చీటింగ్ కేసు నమోదయింది. తాను శుభకార్యానికి వెళుతున్నానని మాయమాటలు చెప్పి తన వద్ద 20 సవర్ల బంగారు ఆభరణాలను ప్రసన్న రాధిక తీసుకుందని పట్టాభిపురానికి చెందిన మెట్ల ఉమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే అత్యవసరంఅంటూ రూ.11.50లక్షల నగదు కూడా తీసుకుందని ఆరోపించింది. తీసుకున్న నగలు, నగదు ఇవ్వకుండా రాధిక కాలయాపన చేస్తోందని, గట్టిగా అడిగితే తనపై ప్రసన్న రాధిక మరికొందరు దాడి చేసి కొట్టారని ఫిర్యాదులో పేర్కొంది. ఉమాదేవి ఫిర్యాదుమేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిస్ పీ అండ్ ఐ ఇండియా అంబాసిడర్‌గా అమూల్య ప్రియదర్శిని

● నగరానికి చెందిన యువతికి దక్కిన అరుదైన ఘనత


మిస్ పీ అండ్ ఐ ఇండియా అంబాసిడర్‌గా బిరుదు సాధించిన అమూల్య ప్రియదర్శిని


గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన అమూల్య ప్రియదర్శిని గోవాలో ఈ నెల 21న జరిగిన పోటీలలో పీ అండ్ ఐ ఇండియా అంబాసిడర్ బిరుదును గెలుచుకున్నారు. నగరంలోని శారదాకాలనీకి చెందిన అమూల్య ప్రియదర్శిని హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆమె తెలంగాణ నుంచి పోటీలలో పాల్గొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులతో పోటీ పడి అమూల్య ఈ బిరుదును గెలుచుకున్నారు. త్వరలోనే అంతర్జాతీయ వేదికపై ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహించబోతున్నట్లు ఆమె తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి రక్షణ ఏది...?

● సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆరోగ్య రక్షణ లేదని, డయేరియా, కలరా వ్యాధులను నియంత్రించాలని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. సోమవారం గుంటూరు నగరపాలక సంస్థ ఎదుట నగరంలో విజృంభిస్తున్న డయేరియా, కలరా వ్యాధులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీపీఐ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సీపీఐ నగర కార్యదర్శి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ తక్షణమే నీటి ట్యాంకులను, రిజర్వాయర్లను శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నూతలపాటి చిన్న, నగర కమిటీ సభ్యులు రావుల అంజిబాబు, మంగ శ్రీనివాసరావు, గుండెబోయిన లక్ష్మి, దేవానాయక్, సురేష్‌బాబు, వి.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వరరెడ్డి, జంగాల చైతన్య, ధూపాటి వెంకటరత్నం, నగర సమితిసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాహసాలతో అవరోధాలను అధిగమించే నైపుణ్యం


మాట్లాడుతున్న కర్నాల్ సుదాన్స్ దుబే

గుంటూరు(విద్య), సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): సాహసాలు జీవితంలోని అవరోధాలను అధిగమించే ఉత్తేజాన్ని అందించేందుకు దోహదపడతాయని, మేధస్సుతోపాటు నూతన ఆలోచనలు ఉత్పన్నమవుతాయని ఏపీ ట్రెక్ మేనేజర్ కల్నల్ సుదాన్స్‌దుబే అన్నారు. సోమవారం చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు ఏపీ ట్రెక్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్ ప్రారంభోత్సవంలో సుదాన్స్ దుబే ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్‌లోని 9 గ్రూపులకు చెందిన 510మంది ఎన్‌సీసీ విద్యార్థినులు ఈ క్యాంపులో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఉదయ్‌కుమార్, ఎన్‌సీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పద్ధతిని.. మార్చారు..

● పీజీఆర్ఎస్ అర్జీలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

● వినతులు ఎక్కువగా ఉన్న శాఖలతో ప్రత్యేక కౌంటర్లు

● మండలాల వారీగా రెవెన్యూ అర్జీల నమోదు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ మార్పుతో అధికారులు కాస్త ఇబ్బందిపడ్డారు. కలెక్టర్ వచ్చే కౌంటర్లు ఏర్పాటుచేయడంతో ఆయా శాఖల ఉన్నతాధికారులు ఆసాంతం కూర్చోవాల్సి వచ్చింది. రెవెన్యూ, గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికంగా అర్జీలు పెండింగ్‌లో ఉండటంతో మండలస్థాయి సిబ్బంది కూడా హాజరయ్యారు. వారి ఆదేశాలతో 18 మండలాల డీటీలు, సచివాలయాల నోడల్ అధికారులు హాజరయ్యారు. నేరేశాల అర్జీలు అధికంగా పెండింగ్‌లో ఉండటంతో ఆ సిబ్బంది కూడా హాజరయ్యారు. దీంతో సమావేశ మందిరం పూర్తిగా నిండిపోయింది. గతంలో ఉన్న పెండింగ్ అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని అర్జీదారులకు సిబ్బంది నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ విషయాలు కలెక్టర్‌కు చెప్పవద్దని వారు అర్జీదారులకు విన్నవించారు.

పీజీఆర్ఎస్‌లో మొత్తం 222 అర్జీలు అందాయి. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, పీజీఆర్ఎస్ గంగారాజు, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారితో కలసి కలెక్టర్ అన్సారియా అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సోమవారం అందిన అర్జీలు శుక్రవారం నాటికి పూర్తిచేసి డేటాను అప్‌లోడ్ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకున్న తరువాతే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

రైల్వేలో ఘనంగా ముగిసిన రాజభాషా పక్షోత్సవం

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో రాజభాషా పక్షోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. సోమవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో డీఆర్ఎం సుదేష్ణ సేన్ పక్షోత్సవంలో భాగంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ, హిందీని అధికారిక భాషగా ప్రచారం చేయడం ప్రతి ఒక్క కేంద్రప్రభుత్వ ఉద్యోగి బాధ్యతని అన్నారు. ఉత్తర, ప్రత్యుత్తరాలు హిందీలోనే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం.రమేశ్‌కుమార్, దక్షిణ మధ్య రైల్వే అధికారిక భాషా డీజీఎం శ్యాంసుందర్‌సాహా పాల్గొన్నారు.

చట్ట పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం

● జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్


బాధితుల ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చట్ట పరిధిలో త్వరితగతిన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ చెప్పారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల ఫిర్యాదుల గురించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడి, త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సరైన విచారణ చేపట్టిన తర్వాతే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్థితిని నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత సమయంలోగా ఫిర్యాదులకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీలు రమణ మూర్తి, సుప్రజ, డీఎస్పీలు శ్రీనివాస రెడ్డి, అరవింద్, సీఐ బిలాలుద్దిన్ పాల్గొన్నారు.

● ఉద్యోగోన్నతి పొందిన ప్రొబేషనరి ఎస్సైలు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో ఎస్పీ మాట్లాడుతూ, శిక్షణా కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, ప్రజలతో, సహోద్యోగులతో, కిందిస్థాయి సిబ్బందితో గౌరవప్రదంగా మెలగాలని సూచించారు.

● ఇటీవల మృతిచెందిన ఏఆర్ ఏఎస్సై చిలకా రత్నం కుటుంబానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చెక్కు అందజేశారు. రత్నం కుటుంబానికి ఆర్థిక చేయూత అందించేందుకు గాను "అడిషనల్ కార్పస్ ఫండ్" నుంచి రూ. లక్ష చెక్కును ఏఎస్సై సతీమణి చిలకా కరుణకు అందజేశారు.

ఇల్లు అద్దెకిస్తే ఆక్రమించేశారు..

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) తన ఇంటిని అద్దెకిస్తే ఏకంగా ఇల్లు తనదేనని బెదిరిస్తున్నారని పట్టాభిపురం పరిధిలోని జార్జిపేటకు చెందిన షేక్ ఆషిరున్నీసా బేగం సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఇల్లు ఖాళీ చేయమంటే ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతానని బెదిరిస్తోందన్నారు. తనకు ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నదండలు ఉన్నాయని బెదిరిస్తోందన్నారు. ఇల్లు కూడా ఖాళీ చేయడం లేదని బాధితురాలు వాపోయింది. తనకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆమె వేడుకున్నారు.

బీటెక్ చదివిస్తే ఉద్యోగం రాగానే వెళ్ళిపోయాడు..

తన కుమారుడి చదువు కోసం రూ.6లక్షల అప్పుచేసి బీటెక్ చదివిస్తే ఉద్యోగం రాగానే తన తల్లిని తీసుకొని వెళ్ళిపోయాడని నగరంలోని శ్రీనివాసరావుతోటకు చెందిన పొట్లూరి నాగరాజు వాపోయాడు. ఆయన ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తాను హోటళ్ళలో పనిచేసుకొని జీవనం సాగిస్తున్నానని, తనకు భార్య, కుమారుడు ఉన్నారన్నారు. కొంతకాలం క్రితం తనకు, భార్యకు మనస్పర్థలు వచ్చి దూరంగా ఉంటున్నానని తెలిపారు. ఇటీవల తన కుమారుడికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో తన తల్లిని తీసుకొని హైదరాబాద్ వెళ్ళిపోయాడన్నారు. తన కుమారుడు చదువుల కోసం చేసిన అప్పులు తీర్చేలా చర్యలుచేపట్టాలని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

పత్రికా ప్రకటన

ఇది ద్వారా సాధారణ ప్రజలకు, సంబంధిత వ్యక్తులకు, ప్రభుత్వ, పబ్లిక్, మరియు ఆర్థిక సంస్థలకు తెలియజేయబడుతుంది ఏమనగా, కింద పేర్కొన్న ఎగ్జిక్యూటెంట్లు (మా క్లయింట్లు) వారు, జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, నల్లపాడు, గుంటూరు జిల్లా, వద్ద డాక్యుమెంట్ నెం.127/2021, తేదీ: 12.01.2021 నందు నమోదైన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (GPA) పత్రాన్ని రద్దు చేయడానికి సంబంధించి చట్టపరమైన ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

ఈ ప్రకటన, పబ్లిక్, సంబంధిత వ్యక్తులు, మరియు ఆర్థిక/ప్రాపర్టీ వ్యవహారాల్లో నిమగ్నమయ్యే వ్యక్తులకు స్పష్టమైన అవగాహన, భవిష్యత్తులో ఏవైనా హక్కుల లేదా లావాదేవీలపై ప్రభావం ఉండకపోవడం కోసం, ప్రాథమిక నోటీసుగా విడుదల చేయబడుతోంది.

ఎగ్జిక్యూటెంట్లు (మా క్లయింట్లు)
1. చల్లా అచ్చమ్మ, చల్లా చలమారెడ్డి గారి భార్య, వయస్సు: 74 సంవత్సరాలు, డోర్ నెం. 2-68, తక్కెళ్లపాడు గ్రామం, ఫిరంగిపురం మండలం, గుంటూరు జిల్లా.
2. ముత్యాల వెంగళరెడ్డి, ముత్యాల హనుమిరెడ్డి గారి కుమారుడు, వయస్సు: 46 సంవత్సరాలు, డోర్ నెం. 2-68, తక్కెళ్లపాడు గ్రామం, ఫిరంగిపురం మండలం, గుంటూరు జిల్లా.
3. ఇందూరి అనసూర్యమ్మ, ఇందూరి వేమారెడ్డి గారి భార్య, వయస్సు: 37 సంవత్సరాలు, డోర్ నెం. 3-1, తక్కెళ్లపాడు గ్రామం, ఫిరంగిపురం మండలం, గుంటూరు జిల్లా.

క్లెయిమెంట్లు (వారితో సంబంధం ఉన్న వ్యక్తులు / హక్కుదారులు)
1. మేడా వెంకట రామ్ రెడ్డి, మేడా వెంకట మల్లికార్జునరెడ్డి గారి కుమారుడు, వయస్సు: 26 సంవత్సరాలు, 1/3వ లైన్, చెన్నయగారిపల్లి, టంగుటూరు, కడప జిల్లా.
2. తంబెల వేణుగోపాల్ రెడ్డి, తంబెల రామిరెడ్డి గారి కుమారుడు, వయస్సు: 39 సంవత్సరాలు, డోర్ నెం.13/56, కొత్తఇండ్లుమందారం, రాజంపేట, కడప జిల్లా.
3. గెడ్డెం జనార్ధనరెడ్డి, గెడ్డెం వెంకటరెడ్డి గారి కుమారుడు, వయస్సు: 42 సంవత్సరాలు, మారయ్యగారిపల్లి, ఒంటిమిట్ట, కడప జిల్లా.

ముఖ్య గమనిక: పై పేర్కొన్న GPA రద్దు ప్రక్రియ, ఇప్పటి వరకు పూర్తి కాలేదని, కానీ ఇది చట్టపరంగా కొనసాగుతోందని స్పష్టంగా తెలియజేయబడింది.

GPA ఆధారంగా ఏవైనా లావాదేవీలు, ఒప్పందాలు, హక్కుల వినియోగం చెల్లుబాటు కావు. భవిష్యత్తులో కూడా ఈ GPA రద్దు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎలాంటి చట్టపరమైన హక్కులు ఏర్పడవు. ఏవైనా వాదనలు, అభ్యంతరాలు, లేదా సంబంధిత ఆధారాలు ఉన్న వ్యక్తులు, ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 15 రోజుల్లోపు క్రింద పేర్కొన్న న్యాయవాది చిరునామాకు లిఖితపూర్వకంగా తెలియజేయాలి.

షెడ్యూలు: గుంటూరు జిల్లా, నల్లపాడు గ్రామం, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెం.563/5లోని మొత్తం Ac.8-74 సెంట్లలో భాగమైన 6-12 సెంట్లు (హెక్టేరు 2.4780) భూమి. ఇందుకు హద్దులు: తూర్పు: ఇంతూరి అయ్యలరెడ్డి గారి భూమి దక్షిణం: దుగ్గెంపూడి రామిరెడ్డి వగైరాల భూమి పడమర: ఎగ్జిక్యూటెంట్లకు మిగిలిన భూమి ఉత్తరం: రైల్వే ట్రాక్

ఈ భూమికి సంబంధించిన అన్ని హక్కులు, వసరులు, రాకపోక మార్గాలు, నీటి పారుదల హక్కులు, ఈజ్‌మెంట్ హక్కులు, మరియు ఇతర అనుబంధ ప్రయోజనాలు కూడా ఈ GPA రద్దు ప్రక్రియలో భాగంగా రద్దు చేయబడ్డాయి.

హెచ్చరికలు: 1. ఈ GPA ఆధారంగా ఏవైనా లావాదేవీలు, ఒప్పందాలు, లేదా హక్కుల వినియోగం చట్టపరంగా చెల్లుబాటు కానివి.
2. ఏవైనా వ్యక్తులు GPA రద్దు ప్రక్రియకు ఎటువంటి విఘాతం కలిగించవద్దు; లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.
3. సంబంధిత వ్యక్తులు, క్లెయిమెంట్లు, ఎగ్జిక్యూటెంట్లను తప్పుగా లేదా మోసపూర్వకంగా కలపడం లేదా వాడించడం చేయవద్దు.

తేదీ: 29.09.2025
స్థలం: గుంటూరు

దుగ్గిరాల సుభాష్, న్యాయవాది,
డోర్ నెం.2-188, పుణ్యక్షేత్రం, రాజానగరం మండలం,
తూర్పు గోదావరి జిల్లా. Cell: 8919443400



మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయ మండపంలో చేరిన వరద నీరు



పెనుమూడిలో పునరావాస కేంద్రాల్లో ఉన్న పల్లెపాలెం వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

జల దిగ్బంధంలో లంకలు

● ముంచెత్తుతున్న కృష్ణమ్మ ● రోడ్లపైకి నీరు చేరటంతో దారులు మూత ● ఇళ్లలోకి వరద నీరు... లోతట్టు గ్రామాల నుంచి సురక్షిత ప్రాంతాలకు

ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక


రేపల్లె, తెనాలి, కొల్లూరు, కొల్లిపర, దుగ్గిరాల, సెప్టెంబరు 29, (ఆంధ్రజ్యోతి): వరద ముంపు లంక గ్రామాల వాసులను భయభ్రాంతులకు గురిచేసింది. ప్రకాశం బ్యారేజికి ఇన్‌ఫ్లో 6,61,960 క్యూసెక్కుల వరద నీరు ఎగువ నుంచి వచ్చి చేరుతుంటే, వాటిలో కృష్ణా డెల్టా కాల్వలకు వదలగా మిగిలిన 6,46,821 క్యూసెక్కుల వరద నీటిని మాత్రం సముద్రంలోకి వదిలేస్తున్నారు. అయితే ఎగువ జలాశయాల నుంచి వస్తున్న వరదకు తోడు, బ్యారేజి క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి వస్తున్న వరద కూడా ఎక్కువగా ఉండటంతో ముంపు సమస్య తీవ్రమవుతోంది. దీనికితోడు సముద్రంలో పోటు కూడా సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉండటంతో నదిలో వరద నీరు ఎదురు తన్నటంతో అటు పెనుమూడి ప్రాంతంలో లో తట్టు ప్రాంతాలు నీట మునిగాయి. సాయంత్రం నుం చి ఆటు ఏర్పడటంతో కొంత తగ్గుముఖం పట్టినట్టయింది. అయితే మరో మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, ప్రవాహంలో హెచ్చుతగ్గులు ఉంటాయని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

లంక గ్రామాలకు రాకపోకలు బంద్!

ప్రకాశం బ్యారేజి దిగువున గుంటూరు జిల్లాలో తీర గ్రామాలకు పెద్దగా ఇబ్బంది లేకున్నా, నది మధ్యలో ఉన్న కొల్లిపర మండలం కొత్తూరులంక, అన్నవరపు లంక గ్రామాలకు బాపట్ల జిల్లా కొ ల్లూరు మండలంలోని అరవింద వారధి నుంచి వెళ్లాల్సి ఉండటం తో సుగ్గునలంక దగ్గర చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. వీటికి అనుకుని ఉన్న కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలానికి చెందిన కనిగిరిలంక గ్రామానికీ రాకపోకలు లేకుండా పోయాయి. అటు బాటప్ల జిల్లాలోని కొల్లూరు మండలంలో నది మధ్యనున్న 11 లంక గ్రామాలకు రవాణా పూర్తిగా నిలిచిపోయింది. మరోపక్క కరకట్ట నుంచి లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపైకి కూడా నీరు పొంగిపొర్లే పరిస్థితి ఉండటంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. గాజుల్లంకకు వెళ్లే రోడ్డుపైనా వరద నీరు ప్రవహిస్తోంది. గాజుల్లంక-పోతార్లంక మధ్య రోడ్డుపై కూడా వరద ఉధృతి పెరగటంతో ఆ మార్గంలోనూ రాకపోకలు నిలిచిపోయాయి. దోనేపూడి-పోతార్లంక మధ్య చిన్నరేవు చప్టాపైకి వరద నీరు చేరటంతో పడవలపై వెళ్లాల్సిన పరిస్తితి. భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం దగ్గర చిన్నరేవు ఉధృతంగా ఉండటం, గ్రామంలోని లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇళ్లలోకి వరద నీరు క్రమంగా చేరుతుండటంతో ముంపు సమస్య ఉన్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

'ముదినేపల్లి' నుంచే భారీ వరద

కృష్ణా నది ఎగువ జలాశయాల నుంచి వస్తున్న వరద కంటే బ్యారేజి క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి వస్తున్నదే ఎక్కువగా ఉంది. ప్రకాశం బ్యారేజికి సోమవారం ముదినేపల్లి వాగు నుంచి 5,57,816 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంటే, పాలేరు నుంచి 26,804 క్యూసెక్కులు, కీసర నుంచి 21,284 క్యూసెక్కుల వరద దిగువకు వస్తోంది. సోమవారం ఉద యం 6 గంటలకు 6,86,074 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజికి చేరితే, అది మధ్యాహ్నానికి 6,81,383 క్యూ సెక్కులకు తగ్గింది. సాయంత్రానికి 6,61,960 క్యూసెక్కులు తగ్గింది. వీటిలో కృష్ణా డెల్టా కాల్వలకు 15,139 క్యూసెక్కులు వదులుతున్నారు. కేఈ మెయిన్ కెనాల్‌కు 8,617 క్యూసెక్కులు, కె.డబ్ల్యు మె యిన్ కెనాల్‌లకు 6,522 క్యూసెక్కులు వదులుతున్నారు. నదిలోకి మాత్రం 6,46,821 క్యూసెక్కుల వరద నీటిని వదిలేస్తున్నారు. బ్యారేజి నీటి మట్టం అత్యధిక స్థాయిలో ఉంది. 13 అ డుగుల సామర్థ్యం ఉన్న బ్యారేజి దగ్గర సోమవారం ఉదయం 16.4 అడుగుల మేర నీటి మట్టం ఉంటే, సాయంత్రానికి క్రమంగా తగ్గుతూ 16 అడుగులకు చేరింది. తగ్గుదల అయితే కేవలం 4 అంగుళాలే తగ్గినట్టయింది. హెచ్చుతగ్గులున్నా, భారీస్థాయిలో ఉండకపోవచ్చని, నిలకడగా వరద కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.



కొల్లూరు : వరద నీటిలో మునిగిపోయిన అరటి తోట



కొల్లూరు : వరద నీటిలో కూరగాయ పంటలు

9 నెలల గర్భిణి, మరో 11 మంది సురక్షిత ప్రాంతానికి తరలింపు

కొల్లిపర మండలం అన్నవరపు లంకలో చిక్కుకున్న వందిపాటి సౌజన్య 9వ నెల గర్భిణి కావటం, వరద ఉధృతి పెరుగుతుందన్న భయంతో అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన కొల్లిపర ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ గోపాలకృష్ణ ప్రత్యేకంగా పడవ ఏర్పాటుచేసి, ఆమెను అన్నవరపులంక నుంచి బొమ్మువానిపాలెం తరలించారు. ఆమెతోపాటే నరసరావుపేటకు చెందిన మరో 11 మంది కూడా అదే గ్రామంలో చిక్కుకున్నామని సమాచారం ఇవ్వటంత వారినికూడా పడవలో సురక్షిత ప్రాంతానికి తరలించారు. మరో పక్క బాపట్ల జిల్లా వెల్లటూరు దగ్గర చిన్నరేవు దాటే ప్రయత్నంలో తిప్పకలట్టకు చెందిన తండ్రి, కుమారుడు ప్రమాదవశాత్తు జారి నీటిలో పడిపోవటం, కొట్టుకుపోతున్న తరుణంలో స్థానికులు అప్రమత్తమయి కొందరు యువకులు నీటిలో దూకి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు అర్ధగంటసేపు ఉత్కంఠత మధ్య చివరకు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే... వరద ముందస్తు జాగ్రత్తల నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని, లోతట్టు ప్రాంతాల నుంచి ఏ సమయంలోనయినా జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెనాలి సబ్‌కలెక్టర్ సంజన సింహ చెప్పారు. నది మధ్య ఉన్న లంక గ్రామాల్లో ఉన్నవారికి అవసరమైన అత్యవసర సరకులు కూడా సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ఎవరైనా ఏ ఇబ్బంది ఉందని సమాచారం అందించినా వెంటనే వారికి సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగాఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.



రావిలనంతవరం సమీపంలో కృష్ణానదికి ఆనుకుని ఉన్న రొయ్యల చెరువుకు గండిపడటంతో ఉధృతంగా వస్తున్న వరదనీరు

వదంతులను నమ్మవద్దు

మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాతంలోని కృష్ణానదికి వరద పోటెత్తటంతో రేపల్లె,వేమూరునియోజకవర్గాల్లోని లంకగ్రామాల ప్రజలు కరకట్టవెంబడి ఉన్న గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగానిసత్యప్రసాద్ పేర్కొన్నారు. ప్రకాశంబ్యారేజీకి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్,కృష్ణారివర్‌అథారిటీ అధికారులుసమన్వయంతో పనిచేస్తూ కరకట్టకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీచేశారు. కృష్ణానది పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు,కాల్వలు, నదిని దాటే ప్రయత్నం చెయ్యవద్దని ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. సోషల్‌మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని ఎటువంటి విపత్తునైన ఎదుర్కొనేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు.

అండగా నిలుస్తాం : కలెక్టర్

కృష్ణా నదికి వరదపోటెత్తటంతో కరకట్టవెంబడిఉన్న భట్టిప్రోలుమండలం పల్లెపాలెం, రేపల్లెమండలం పల్లెపాలెం, మైనేనివారిపాలెం, లంకెవానిదిబ్బ గ్రామాల్లోని ప్రజలు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో ఉండాలని జిల్లాకలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం వరద ముంపు గ్రామాలను ఆయన పరిశీలించారు. పెనుమూడిలో పల్లెపాలెం పూర్తిగా నీటమునగటంతో పునరావసకేంద్రాల్లో ఉన్న బాధితులను పరామర్శించి ధైర్యంచెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆహార పానీయాలు, విద్యుత్, ఫ్యాన్‌లను ఏర్పాటు చెయ్యాలని రెవెన్యూఅధికారులకు సూచించారు. ప్రత్యేకంగా మెడికల్‌క్యాంప్ ఏర్పాటుచేసి బాధితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని అవసరమైనవారికి తగిన మందులు అందించాలని సూచించారు.

హోరాహోరీగా జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు



చెస్ ఆడుతున్న క్రీడాకారులు

గుంటూరు (విద్య), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. సోమవారం జరిగిన ఎనిమిదో రౌండ్‌లో నాలుగుసార్లు జాతీయ చాంపియన్ పీఎస్‌పీ బీకి చెందిన జీఎం కృష్ణన్ శశికిరణ్ తన జట్టుకే చెందిన సహచరుడు జీఎం.దీప్‌సేన్ గుప్తాపై గెలుపొందాడు. అదే జట్టుకు చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ అభిజిత్ గుప్తా యూపీకి చెందిన ఐఎం ఎలెక్స్ అజయ్ సంతోష్ పర్వత్‌రెడ్డిపై విజయం సాధించాడు. దీంతో శశికిరణ్, అభిజిత్ చెరో 7 పాయింట్లతో టాప్‌లో నిలిచారు. వీరికి సగం పాయింట్ల వెనుక ఆరుగురు ఆటగాళ్లు ఉన్నారు.

ఏపీ కాటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు కొర్రపాటి రామారావు

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాటన్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నికైంది. 2025-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా కొర్రపాటి రామారావు, గౌరవాధ్యక్షుడిగా పెరవలి రాఘవరావు, ఉపాధ్యక్షులుగా పి.వీరనారాయణ, డీఎల్ఎస్ ప్రసాదు, గౌరవ కార్యదర్శిగా ఎం.సురేంద్రబాబు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.రంగారావు, ఎన్.సుబ్బా రావు, గౌరవ కోశాధికారిగా ఎన్.సూర్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కాటన్ వ్యాపారస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామి ఇచ్చారు.

సరిహద్దులు లేని సంస్థ సంగం డెయిరీ

● రూ. 2,019 కోట్లకు చేరిన టర్నోవర్ ● డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులు లేని సంస్థగా సంగం డెయిరీని విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. వడ్లమూడి సంగం డెయిరీ అవరణలో సోమవారం సంగం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో సంగం డెయిరీతో పాటు డీవీసీ ఆసుపత్రి వార్షిక ప్రగతి నివేదికను ప్రవేశపెట్టి సభ్యుల ఆమోదంతో తీర్మానం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయంలో 45 వేల లీటర్ల పాల సేకరణ మాత్రమే జరిగేదని, కాని నేడు సమిష్టి కృషితో రోజుకు 10 లక్షల లీటర్లకుపైగా పాల సేకరణ చేపట్టేలా పాలకవర్గం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ ఏడాది సంగం డెయిరీ 2,019 కోట్ల టర్నోవర్ సాధించిందని. వచ్చే ఏడాది 2,300 కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. గడచిన ఏడాది రైతులకు బోనస్ పంచగా రూ. 12.79 కోట్ల నికర లాభం అర్జించినట్లు తెలిపారు. కంపెనీ విస్తరణలో భాగంగా నూతన పాల శీతలీకరణ కేంద్రాల ఏర్పాటు, నాయుడుపేటలో నూతన డెయిరీ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో రోజుకు లక్షన్నర లీటర్ల పాల సేకరణ చేపట్టి హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నూతన ఉత్పత్తులను రూపొందిస్తున్నామని, అందులో భాగంగా షుగర్ ఫ్రీ ఉత్పత్తులను రూపొందించి మార్కెట్లోకి ప్రవేశపెడుతున్నామని చెప్పారు. రైతులకు సౌలభ్యం కోసం ఫార్మర్ యాప్ అమలు చేయనున్నట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆవు నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కడం సంగం డెయిరీకి లభించిన అదృష్టమని నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా టెన్నిస్ క్రీడాకారిణి నలుగుదుటి అనూషకు రూ. 5 లక్షల ప్రోత్సాహక నగదును చైర్మన్ నరేంద్ర కుమార్ అందజేశారు. అనంతరం అత్యధిక పాలు పోసిన రాష్ట్రంలోని పలువురు రైతులను ఘనంగా సత్కరించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ ఎండీ పి. గోపాలకృష్ణ, డీవీసీ ఆసుపత్రి ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

కనక దుర్గమ్మకు 108 వీణలతో సంగీతార్చన



108 వీణలతో సంగీతార్చన చేస్తున్న మహిళలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెనాలి చెంచుపేటలో అమ్మవారికి 108 వీణలతో సంగీతార్చన చేశారు. చెంచుపేట పద్మావతి కళ్యాణ మండపంలో శ్రీ విద్యా పీఠం ఆధ్వర్యంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. సాలిగ్రామ మఠం, జయలక్ష్మి నాట్యమండలి ఆధ్వర్యంలో 108 మంది మహిళా భక్తులు ఒకే రమమైన దుస్తులు ధరించి బాలస్వామితో అమ్మవారిని స్తుతిస్తూ పలు కీర్తనలు ఆలపించారు. రెండు గంటల పాటు వీణపై ఆలపించిన భక్తి గీతాలు భక్తులకు వీనుల విందు చేశాయి. నంబూరు వెంకటకృష్ణమూర్తి, కొత్త సుబ్రహ్మణ్యం, రావూరి సుబ్బారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, మురళీ మనోహర్, రామకృష్ణ, రాజేశ్వరరావు, ముద్దా భక్తుని రమణయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వినుకొండ కీర్తిని ఇనుమడింపజేసిన జాషువా

- జ్ఞాపకార్థం డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు: చీఫ్‌విప్ జీవీ
- ఘనంగా విశ్వకవి 130వ జయంతి వేడుకలు



పెనుగొండ లక్ష్మీనారాయణ, నల్ల వెంకటేశ్వరరావుకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న చీఫ్‌విప్ జీవీ, మక్కెన

వినుకొండ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తన కవిత్వంతో.. సమాజంలోని అసమానతలను ఎత్తుచూపుతూ.. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో నిప్పు కణికలాగా గుర్రం జాషువా ఉద్భవించాడని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. వినుకొండలో పుట్టి జాషువా అంటరానితనం, పేదరికాన్ని తన గురువులుగా ఎంచుకొని.. గబ్బిలాన్ని కదా వస్తువుగా ఎంచుకొని కవిత్వంలో విజయవతం అయ్యారన్నారు. నరసరావుపేట రోడ్డులోని జాషువా కళా ప్రాంగణంలో జాషువా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు చిలకల జాన్ సుందరరావు అధ్యక్షతన గుర్రం జాషువా 130వ జయంతి ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ.. జాషువా దేశవిదేశాల్లో వినుకొండ కీర్తిని ఇనుమడింపజేశారన్నారు. ఆయన జ్ఞాపకంగా వినుకొండలో ఎస్ఎస్‌పీ కాలనీ ఆవరణలో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఖాసిం మాట్లాడుతూ.. వినుకొండలో.. 'ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారట నలుగురు కుమారులు. మరి పంచమ జాతి పుట్టుటకు మూలమేమిటి?' అని జాషువా ప్రశ్నిస్తే ఈ రోజుకి సమాధానం చెప్పిన వారు లేరన్నారు. జాషువా 130వ జయంతి వేడుకల సందర్భంగా కళా ప్రాంగణంలో ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన పద్య, కవిత్వం పోటీల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు బహుమతులు ప్రదానం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రముఖ రంగస్థలం కళాకారుడు నల్ల వెంకటేశ్వరరావుకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలా, సమైక్య కార్యదర్శి రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, న్యాయవాదులు సీహెచ్ మూర్తి, విజయ్, జి.కమలారం, భాగవతుల రవికుమార్, ప్రదీప్, పిడుగు విజయ్, దేవ, లగడపాటి వెంకట్రావు, హనుమంత రెడ్డి, బొంకూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా రచన నాటక ప్రదర్శనలు

జీవన్‌జ్యోతి స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో గుర్రం జాషువా రచించిన శ్మశాన వాటిక, గబ్బిలం, ముంతాజ్‌మహల్, పిరదౌసి ఘట్టాలను పద్యనాటకాల ద్వారా కళాకారులు బస్టాండ్ సెంటర్‌లో ప్రదర్శించారు. ఈ పద్య నాటకాలు పట్టణ వాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చీఫ్‌విప్ జీవీ, జీడీసీసీబీ చైర్మన్ పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి కళాకరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మందా వెంకట్రావు, బీజేపీ జిల్లా కార్యదర్శి కట్టాసుబ్బారావు, పి.వి.సురేష్, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



26 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు సోమవారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 585.30 అడుగులు ఉంది. ఇది 298.30 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9533 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5800 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,414 క్యూసెక్కులు, 24 క్రస్ట్‌గేట్లను 15 అడుగులు, 2 క్రస్ట్ గేట్లను 20 అడుగులు మేర ఎత్తి 5,41,516 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 5,91,463 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 5,91,463 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సత్రశాలలో 18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

రెంటచింతల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తోంది. దాంతో ప్రాజెక్టు 18 క్రస్ట్ గేట్లను ఎత్తి 5,88,988 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఎగువన ఉన్న సాగర్ నుంచి 5,74,240 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. రిజర్వాయర్‌లో 73.10 మీటర్ల మేర నీరుదని ఇది 5.543 టీఎంసీలకు సమానమని ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, గిరిబాబు తెలిపారు. వరద నీరు భారీగా వస్తుండడంతో ప్రాజెక్టులో విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపివేసినట్లు చెప్పారు. కాగా, సత్రశాల ఆలయం సమీపంలో వరద నీరు ఉగ్రరూపం దాల్చడంతో విద్యుత్ స్తంభాలు నీట మునిగాయి. దాంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 37.99 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 5,92,400 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోందని ఆయన చెప్పారు. ప్రాజెక్టు వద్ద 16 గేట్లను ఐదు మీటర్ల మేర ఎత్తి 5,68,511 క్యూసెక్కులు, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 5,68,911 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ రాజు తెలిపారు.

పశ్చిమడెల్టాకు 5,924 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారే జి నుంచి పశ్చిమడెల్టాకు సోమవారం 5,924 క్యూసెక్కుల నీటిని విడు దల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 16.2 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 6,61,960 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హై లెవెల్ చానల్‌కు 230 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1,513 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 502 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 190 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 335 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2,880 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

స్థానిక పసుపు మార్కె ట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 569 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,450, గరిష్ఠ ధర రూ.10,375, మోడల్ ధర రూ.10,300 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,450, గరిష్ఠ ధర రూ.10,300, మోడల్ ధర రూ.10,300 పలికాయి.

ప్రకాశం బ్యారేజీ వద్ద స్థిరంగా వరద ఉధృతి

● దిగువకు 6,46,821 క్యూసెక్కుల నీటి విడుదల ● కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 6,61,960 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదయినట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 16 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 6,46,821 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాలువకు 8,617 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6,522 క్యూసెక్కులు వదలగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదలను నిలిపేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని దిగువ నది తీర ప్రాంత వాసులు, లంక భూముల రైతులు మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



దిగువకు విడుదలవుతున్న వరద నీరు

దుర్గా నవరాత్రులు

నేటి అలంకారం

శ్రీ దుర్గాదేవి


ఆశ్వయుజ శుద్ధ అష్టమి (దుర్గాష్టమి) మంగళవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో నేడు శ్రీ దుర్గాదేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. ఈ అవతారంలో అమ్మ దుర్గముడనే రాక్షసుడిని ఈ అష్టమి తిథి రోజునే సంహరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ అష్టమిని 'దుర్గాష్టమి' అని వ్యవహరిస్తారు. 'దుర్గే దుర్గతినాశని'... ఈ రోజున అమ్మవారి దర్శనంతో దుర్గతుల నుంచి తప్పించుకోవచ్చనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. పంచ ప్రకృతి మహాస్వరూపాల్లో దుర్గా రూపం మొదటిది. భవబంధాలలో చిక్కుకున్న మానవుడిని ఈ మాత అనుగ్రహించి మోక్షాన్ని ప్రసాదిస్తుందనీ, కోటి సూర్యప్రభలతో వెలుగొందే అమ్మను అర్చిస్తే శత్రుబాధలు తొలుగుతాయనీ, సర్వత్రా విజయం ప్రాప్తిస్తుందనీ నమ్మిక. ఆయురారోగ్యాలను ప్రసాదించే దివ్యరూపిణి దుర్గమ్మ దర్శనం సకల శ్రేయోదాయకం.



నైవేద్యం:
గారెలు, చిత్రాన్నం
అలంకరించే చీర రంగు:
ఎరుపు
వేటితో అర్చించాలి:
గులాబీలు, ఎర్రటిపూలు, కుంకుమ, ఎర్రటి అక్షతలు
పారాయణ:
దుర్గా సూక్తం, దుర్గా సప్తశ్లోకి

హియరింగ్ లాస్



వినికిడి పరికరం వాడకాన్ని చిన్నతనంగా భావించి దాని జోలికి వెళ్లని వాళ్లుంటారు. వినికిడి లోపం ఉన్నా ఆ విషయాన్ని ఒప్పుకోడానికి తటపటాయించే వాళ్లుంటారు. 'వినికిడి పూర్తిగా పోయినప్పుడు ఆలోచిద్దాంలే!' అనుకుంటూ హియరింగ్ ఎయిడ్స్ వాడకానికి దూరంగా ఉండిపోయే వాళ్లుంటారు. కానీ వీటిని వాడకపోవడం వల్ల, దాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం క్రమేపీ తగ్గిపోయి, వినికిడిని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందంటున్నారు వైద్యులు



వినికిడి లోపిస్తే?

వినికిడి లోపం జీవితంలో ఎప్పుడైనా తలెత్తవచ్చు. పుట్టుకతోనే ఈ లోపం ఉండొచ్చు. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు, కొన్ని రకాల మందులు, పైబడే వయసు, పెద్ద శబ్దాలకు బహిర్గతమవడం వల్ల కూడా వినికిడి లోపం తలెత్త వచ్చు.

వృద్ధాప్యం: పైబడే వయసులో కంటిచూపు తగ్గినట్టే, 50 ఏళ్లు పైబడిన తర్వాత వినికిడి శక్తి కూడా తగ్గుముఖం పడుతుంది. ఈ సమస్య వంశపారంపర్యంగా కూడా సంక్రమిస్తుంది. అయితే, సాధారణంగా వినికిడి శక్తి తగ్గడం మొదలుపెట్టినప్పుడు పైబడే వయసులో ఇదంతా మామూలే అనుకుంటూ హియరింగ్ ఎయిడ్ వాడకాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ హియరింగ్ ఎయిడ్ వాడకంతో కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి తీసుకురాలేకపోయినప్పటికీ, వినికిడి పరికరాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం తగ్గకుండా ఉంటుంది. కాబట్టి సమస్యను గుర్తించిన వెంటనే హియరింగ్ ఎయిడ్‌ను వాడుకోవడం మొదలుపెట్టాలి. మరీ ముఖ్యంగా వినికిడి శక్తి లోపించడం వల్ల ఆత్మవిశ్వాసం దెబ్బతిని, నలుగురిలో కలవలేక, మానసిక కుంగుబాటుకు లోనై, ఒంటరిగా గదికే పరిమితమైపోతూ ఉంటారు. దాంతో జీవన నాణ్యత కూడా దెబ్బ తింటుంది. కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకూడదు.

పుట్టుకతోనే: పుట్టుకతోనే సంక్రమించే జన్యుపరమైన వ్యాధుల్లో వినికిడి లోపం కూడా ఒకటి. మేనరికం వివాహాల్లో పుట్టిన పిల్లల్లో ఈ సమస్య సహజం.

వ్యాధులు: మలేరియా, టైఫాయిడ్ లాంటి వైరల్ జ్వరాలు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వినికిడికి సంబంధించిన నాడిని దెబ్బతీస్తాయి.

అకస్మాత్తుగా వినికిడి కోల్పోతే...

కారణం ఏదైనా అకస్మాత్తుగా వినికిడి శక్తి కోల్పోతే, తిరిగి వచ్చేస్తుందిలే అని తాత్సారం చేయడం సరి కాదు. ఇలాంటి సందర్భాల్లో ఎంత త్వరగా చికిత్స అందించగలిగితే, వినికిడి శక్తి అంత త్వరగా తిరిగొస్తుంది. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రతించగలిగితే, చెవిలోకి ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి తెప్పించవచ్చు.



మందులు: జెంటామైసిన్, అమికాసిన్ లాంటి ఆటోటాక్సిక్ మందులు, కీమోథెరపీ మందులు, మలేరియా మందుల వాడకం వల్ల కూడా లోపలి చెవి దెబ్బతిని వినికిడి శక్తి తగ్గవచ్చు.

పిల్లల్లో వినికిడి లోపం

మేనరికం వివాహాల వల్ల లేదా ఇతరత్రా జన్యు సమస్యల వల్ల కొందరు పిల్లలు పుట్టుకతోనే వినికిడి సమస్యను వెంట తెచ్చుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో పసికందులు శబ్దాలకు స్పందించడం లేదని గ్రహించిన వెంటనే 'బేరా' (బ్రెయిన్ స్టెమ్ ఎవోక్డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ పరీక్ష చేయించాలి. ఈ పరీక్షతో పసికందుల వినికిడి లోపం ఏ మేరకు ఉందన్నది తెలుస్తుంది. అలాగే పది నెలలు దాటిన పిల్లలు చప్పట్లకు స్పందించకపోయినా, ఈ పిల్లలకు మాటలు రాకపోతున్నా వెంటనే అప్రమత్తం కావాలి. ఏడాది లోపున్న పసిపిల్లల్లో వినికిడి శక్తి లోపిస్తే, కోక్లియర్ ఇంప్లాంట్ అమర్చవలసి ఉంటుంది. దీంతో వినికిడి శక్తి పెరిగి పిల్లల ఎదుగుదల ఆరోగ్యకరంగా సాగుతుంది. ఈ ఇంప్లాంట్‌ను అమర్చడం కోసం వైద్యులు పుర్రె లోపల వినికిడి నాడికి ఎలక్ట్రోడ్స్‌ను అనుసంధానించి, కోక్లియాను అమరుస్తారు. చెవి దగ్గర బహిర్గతమయ్యే విడి భాగంలో అవసరాన్ని బట్టి బ్యాటరీలను మార్చుకుంటూ పిల్లలు జీవితకాలం పాటు ఈ వినికిడి పరికరాన్ని వాడుకోవచ్చు.

ఇది తాత్కాలికమే!

వానాకాలంలో సాధారణ జలుబులతో తాత్కాలిక వినికిడి లోపం తలెత్తవచ్చు. సాధారణంగా ఇది పిల్లల్లో కనిపిస్తూ ఉంటుంది. అలాగే అలర్జీల వల్ల, చలికి బహిర్గతమవడం వల్ల, జలాంతర క్రీడల వల్ల, విమానం నేల మీదకు దిగేటప్పుడు కర్ణభేరి మీద ఒత్తిడి పెరిగి, చెవిపోటు, తాత్కాలిక వినికిడి లోపం తలెత్తవచ్చు. విమానం కిందకు దిగే సమయంలో చెవి పోటు, దిబ్బెడ వేధించే సమస్య ఉన్నవాళ్లు ప్రయాణానికి ముందు ఆవిరి పట్టుకోవాలి. అలాగే విమానం దిగడానికి అరగంట ముందు యాంటీ హిస్టమిన్ మాత్ర వేసుకోవాలి. అలాగే అలర్జీలు, జలుబులకు చికిత్స తీసుకోవాలి. వీటితో తాత్కాలిక వినికిడి లోపం తగ్గిపోతుంది. పబ్‌లు, డిజెల్లోని బిగ్గర శబ్దాలకు బహిర్గతమైన తర్వాత చెవిలో గుయ్యిమనే శబ్దంతో పాటు వినికిడి తగ్గితే వెంటనే వైద్యులను కలిసి చెవి ఇంజక్షన్లు తీసుకోవాలి. లేదంటే కోల్పోయిన వినికిడి శక్తి తిరిగొచ్చే వీలుండదు. ఇలా జరగకుండా ఉండాలంటే, బిగ్గర శబ్దాలతో కూడిన ప్రదేశాలను సందర్శించేటప్పుడు, స్పీకర్లకు దూరంగా ఉంటూ, ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి. అలాగే దీపావళి నాడు టపాసులు కాల్చే సమయంలో కూడా ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి. అయితే అప్పటికే చెవి సమస్యలతో బాధపడుతున్న వాళ్లు టపాసుల శబ్దాలకు ఏమాత్రం బహిర్గతం కాకుండా, గదులకే పరిమితం కావాలి.

డాక్టర్ సుధీర్ రెడ్డి తల్లపురెడ్డి
కన్సల్టెంట్ ఇ.ఎన్.టి,
హెడ్ అండ్ నెక్ సర్జన్,
3 సెన్సెస్ ఇ.ఎన్.టి స్పెషాలిటీ క్లినిక్,
హబ్సిగూడ, హైదరాబాద్.



మీకు తెలుసా?

పబ్లిక్ టాయిలెట్స్ వాడితే?

కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు ప్రజా టాయ్‌లెట్స్‌ను వాడుకోక తప్పదు. అయితే టాయిలెట్ సీట్ మీద కూర్చోవలసివచ్చినప్పుడు, అలా కూర్చోడం సురక్షితమేనా? అనే అనుమానం ప్రతి ఒక్కరికీ కలుగుతుంది. నిజానికి ఆరోగ్యవంతులైన వ్యక్తులకు టాయ్‌లెట్ సీట్ మీద కూర్చున్నంత మాత్రాన ఇన్‌ఫెక్షన్లు



సోకవు. అలాగని అపరిశుభ్రమైన టాయ్‌లెట్ మీద నేరుగా కూర్చోకుండా, ఆల్కహాల్ వైప్‌తో సీట్ తుడిచి కూర్చోవాలి. నిజానికి టాయ్‌లెట్ సీట్‌ను మించిన ముప్పులు బాత్‌రూమ్‌లో పొంచి ఉంటాయి. డోర్ హ్యాండిల్స్ ఫాసెట్ నాబ్స్, టాయిలెట్ ఫ్లష్ లీవర్స్, అపరిశుభ్రమైన చేతుల్లోనే లెక్కలేనన్ని వ్యాధికారక సూక్ష్మక్రిములు తిష్ఠ వేసి ఉంటాయి. కాబట్టి వాటి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలి. వాటిని తాకిన ప్రతిసారీ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

పరిశోధన

ఎయిర్‌పాడ్స్‌తో అధిక రేడియేషన్

సాధారణ ఇయర్‌ఫోన్స్‌తో పోలిస్తే, ఎయిర్‌పాడ్స్ 150 రెట్లు ఎక్కువ రేడియేషన్‌ను వెలువరిస్తాయని తాజా పరిశోధనలో తేలింది. ఎయిర్‌పాడ్స్‌తో అధిక రేడియేషన్‌కు బహిర్గతమవడంతో పాటు ప్రతిరోజూ వాటిని వాడుతూ ఉండడం వల్ల దీర్ఘకాలంలో మెదడు ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం పడుతుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఎయిర్‌పాడ్స్‌కు బదులుగా సాధారణ ఇయర్‌ఫోన్స్‌ను ఎంచుకోవడం సురక్షితం. అలాగే రోజంతా ఎయిర్‌పాడ్స్‌ను ధరించకుండా తరచూ విరామం తీసుకుంటూ ఉండాలి. ఫోన్ కాల్స్‌ను తక్కువ సమయాలకే పరిమితం చేయాలి. వీలైనంతవరకూ స్పీకర్ ఫోన్ ద్వారా సంభాషించే ప్రయత్నం చేయాలి.



హెపటైటిస్

హెపటైటిస్ బి, హెపటైటిస్ సి వైరస్‌లు కాలేయాన్ని దీర్ఘకాలం పాటు ఇబ్బంది పెడతాయి. వీటికి అడ్డుకట్ట వేసే టీకాలు, నివారణ చర్యల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

వీటితో కాలేయానికి కీడు

ప్రధానంగా శరీర ద్రవాలు, రక్త మార్పిడిల ద్వారా హెపటైటిస్ బి, సి వైరస్‌లు సంక్రమిస్తాయి. ఇవి శరీరంలోకి ప్రవేశించిన తర్వాత, కాలేయంలోనే తిష్ఠ వేసుకుని, నెమ్మది నెమ్మదిగా కాలేయాన్ని దెబ్బ తీయడం మొదలుపెడతాయి. కొంత మందిలో ఈ వైరస్‌లు సమస్యను తీవ్రతరం చేసి, కామెర్లు, కాలేయ వైఫల్యానికి దారి తీస్తాయి. అయితే హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్లలో తీవ్రమైన లక్షణాలేవీ కనిపించవు. కాబట్టి ఈ వైరస్‌లు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఈ వైరస్‌లు సోకే కొన్ని ఇతరత్రా మార్గాలను మనందరం నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. అవేంటంటే..

హెపటైటిస్ సి వైరస్‌ను అడ్డుకునే సమర్థమైన మందులు, హెపటైటిస్ బిని నివారించే వ్యాక్సిన్ ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు హెపటైటిస్ బి వ్యాక్సిన్‌ను యూనివర్సల్ ఇమ్యునైజేషన్‌లో చేర్చడం జరిగింది. పుట్టిన ప్రతి బిడ్డకూ మిగతా టీకాలతో పాటు హెపటైటిస్ బి మూడు డోసుల టీకాను తప్పక ఇప్పించాలి. పెద్దలు కూడా హెపటైటిస్ బి వ్యాక్సిన్ తీసుకోవచ్చు. అయితే ముందుగా రక్త పరీక్ష చేయించి, వైరస్ లేదని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే ఈ టీకా తీసుకోవాలి.



దంత చికిత్సల ద్వారా...

రక్తం అన్నివేళలా, అన్నిచోట్లా కళ్లకు కనిపించకపోవచ్చు. సూక్ష్మదర్శినిలో మాత్రమే కనిపించే వీలుండే మోతాదుల్లోని రక్తం పూర్తిగా స్టెరిలైజ్ చేయని సిరంజీలు, పరికరాలకు అంటుకుని ఉండొచ్చు. సెలూన్లలో మ్యానిక్యూర్, పెడిక్యూర్, షేవింగ్ లాంటి సేవల ద్వారా వైరస్ కలిగిన రక్తం మన శరీరాల్లోకి చొరబడే వీలుంటుంది కాబట్టి పూర్తిగా స్టెరిలైజ్ చేసిన పనిముట్లనే ఆయా సేవల కోసం ఉపయోగించేలా చూసుకోవాలి. సింగిల్ యూజ్ షేవర్స్‌నే ఎంచుకోవాలి. పాతకాలపు పద్ధతిలో లోహపు బ్లేడ్స్ ఉపయోగాన్ని మానేయాలి. అలాగే దంత చికిత్సల విషయంలో కూడా జాగ్రత్త వహించాలి. ఆయా చికిత్సల్లో పూర్తిగా స్టెరిలైజ్ చేసిన పరికరాలే ఉపయోగించేలా చూసుకోవాలి.

టాటూల ద్వారా...

టాటూల ద్వారా హెపటైటిస్ వైరస్‌లు శరీరంలోకి చొరబడే ప్రమాదం ఉంది. ఈ ముప్పు నుంచి తప్పించుకోవడం కోసం, టాటూ వేయించుకునే స్టూడియోలో కఠినమైన పరిశుభ్రతా చర్యలు పాటిస్తున్నట్టు నిర్ధారించుకోవాలి. నియంత్రణ లేని అనేక చిన్న పాటి పార్లర్లు, స్టెరిలైజ్ చేయని నీడిల్స్ పరికరాలను, కలుషిత ఇంకులను టాటూల కోసం ఉపయోగిస్తూ ఉంటాయి. కాబట్టి టాటూ వేయించుకునే ముందు ఆ ప్రదేశంలో పాటించే సురక్షిత ప్రమాణాల గురించి తెలుసుకోవాలి. ఉపయోగిస్తున్న సింగిల్ యూజ్ నీడిల్స్ ఇంక్స్ గురించి ఆరా తీయాలి.

డాక్టర్ ఆర్.వి. రాఘవేంద్ర రావు
డైరెక్టర్ అండ్ సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్,
రెనోవా - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ అండ్ లివర్ డిసీజెస్,
న్యూ ఎమ్ఎల్ఎ కాలనీ, రోడ్ నంబరు 12,
బంజారాహిల్స్ హైదరాబాద్



సోరియాసిస్‌కు సమర్థమైన వైద్యం

హోమియో



తిరగబెడుతూ వేధించే చర్మ వ్యాధుల్లో సోరియాసిస్ ఒకటి. అయితే శరీర తత్వం, ప్రేరేపించే అంశాలు, మందుల ప్రభావాల ఆధారంగా చికిత్సను ఎంచుకోగలిగితే, ఈ మొండి సమస్యను కూడా పరిష్కరించుకోవచ్చు. ఎలాగో తెలుసుకుందాం!

సోరియాసిస్‌కు ఫలానా కారణమని కచ్చితంగా చెప్పడానికి వీల్లేదు. శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల, రక్షణ వ్యవస్థ శరీరం మీదే దాడి చేసే ఆటో ఇమ్యూన్ డిజార్డర్ ఫలితంగా సోరియాసిస్ తలెత్తవచ్చు. వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు. అయితే ప్రధానంగా మానసిక ఆందోళన, ఒత్తిడితో కూడిన జీవితం, కొన్ని రకాల ఆహార పదార్థాల వల్ల సోరియాసిస్ తలెత్తవచ్చని కొన్ని తాజా అధ్యయనాల్లో తేలింది. కొన్ని సందర్భాల్లో చర్మ గాయాలు మానిన తర్వాత, ఆ ప్రదేశంలో సోరియాసిస్ తలెత్తుతూ ఉంటుంది. దీన్ని 'కోబ్నర్ ఫెనామినా' అంటారు. అలాగే కొన్ని రకాల మందులు, స్టిరాయిడ్స్ కూడా సోరియాసిస్‌ను ప్రేరేపిస్తాయి.

ప్రధాన లక్షణాలు ఇవే!

- దురద
- చర్మంపై పగుళ్లు, పొట్టు ఏర్పడడం
- పొట్టులా ఏర్పడిన ప్రదేశం చుట్టూరా మంట
- గోకినప్పుడు పొట్టు రాలడం

రకాలున్నాయి

సోరియాసిస్‌లో ఐదు రకాలున్నాయి. అవేంటంటే...

ప్లేక్ సోరియాసిస్: 80% సోరియాసిస్‌లు ఈ కోవకు చెందినవే! ఈ సమస్య పెద్దల్లో ఎక్కువ.

గుట్టేట్ సోరియాసిస్: పిల్లలు, యుక్తవయస్కుల్లో తలెత్తుతుంది.

ఇన్వర్స్ సోరియాసిస్: స్థూలకాయుల్లో, చర్మపు ముడతల్లో వస్తుంది.

పస్ట్యులార్ సోరియాసిస్: అరుదుగా పెద్దల్లో వస్తుంది.

ఎరిత్రోడెర్మిక్ సోరియాసిస్: 90% చర్మం సోరియాసిస్‌కు గురైనప్పుడు ఎరిత్రోడెర్మిక్ సోరియాసిస్‌గా పరిగణించాలి.


శాశ్వత చికిత్స లేదు

సోరియాసిస్ చికిత్సతో అదుపులోకొచ్చి, పూర్తిగా నయమైపోయిన భ్రమను కలిగిస్తుంది. కొన్ని నెలలు, సంవత్సరాల పాటు కనుమరుగైపోయే ఈ సమస్య అకస్మాత్తుగా తిరగబెడుతూ ఉంటుంది. కాబట్టి సోరియాసిస్‌కు శాశ్వత చికిత్స లేదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. అయితే ఈ వ్యాధిని అదుపులో పెట్టగలిగే సమర్థమైన చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. లక్షణాలు, శరీరంలో సోరియాసిస్ తలెత్తిన ప్రదేశం, మందులకు స్పందించే శరీర తత్వం, సమస్యను ప్రేరేపించే కారకాల ఆధారంగా చికిత్సను ఎంచుకోగలిగితే, ఈ చర్మ సమస్యకు వీలైనంతవరకూ అడ్డుకట్ట వేయవచ్చు. మరీ ముఖ్యంగా హోమియోపతిలో సోరియాసిస్‌కు రెండు రకాల చికిత్సలను అనుసరిస్తారు. చర్మపు దురద ఏ ఏ సందర్భాల్లో తలెత్తుతోంది, ఎప్పుడు పెరుగుతోంది? అనే అంశాల ఆధారంగా అందించే చికిత్స ఒకటైతే, సోరియాసిస్ ప్యాచెస్‌తో పాటు శరీర ఉష్ణోగ్రత, ఆహారపుటలవాట్లు, శరీరం మీద వాతావరణ ప్రభావాలు, మానసిక లక్షణాల ఆధారంగా అందించే చికిత్స రెండవది.

నివారణ ఇలా...

పొట్ట, ఛాతీ, తల, గోళ్లు, వేళ్ల మధ్య, పిరుదుల మధ్య, తొడల మధ్య మొట్టమొదటిగా సోరియాసిస్ తలెత్తుతుంది. వీటిలో ఏ ఒక్క శరీర భాగంలో సోరియాసిస్ తలెత్తినా, తలలో కూడా తప్పనిసరిగా కనిపిస్తుంది. అయితే ఈ వ్యాధిని నివారించుకునే సమర్థమైన మార్గాలు కొన్ని ఉన్నాయి. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి. అలర్జీ కారక ఆహార పదార్థాలకు దూరంగా ఉండడం, సమతులాహారం తీసుకోవడం, శుద్ధి చేసిన పదార్థాలు, పాలు, పాల ఉత్పత్తులు, శీతల పానీయాలకు దూరంగా ఉండడం అవసరం. అలాగే తేలికగా అరిగే ఆహారం తీసుకుంటూ, కంటి నిండా నిద్రపోవాలి. క్రమం తప్పక వ్యాయామం చేయాలి. ఈ నియమాలు పాటించగలిగితే ఉన్న సోరియాసిస్ అదుపులో ఉండడంతో పాటు కొత్తగా సోరియాసిస్ తలెత్తకుండా ఉంటుంది.

డాక్టర్ దుర్గాప్రసాద్ రావు గన్నం రాజు
నిత్య హోమియోపతి,
కుత్బీగూడ (కాచిగూడ), హైదరాబాద్.



అధ్యయనం

నోటి బ్యాక్టీరియాతో గుండెపోటు

నోట్లో నివసించే బ్యాక్టీరియా దంతాలను దెబ్బతీయడమే కాకుండా గుండెపోటు ముప్పును కూడా పెంచుతుందని ఒక అధ్యయనంలో వెల్లడైంది. వివరాల్లోకి వెళ్తే...

ఫిన్‌ల్యాండ్‌లోని ట్యాంపిర్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు, గుండెజబ్బులతో బాధపడే రోగులతో పాటు అకస్మాత్తుగా గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయిన రోగుల గుండె రక్తనాళాల్లోని పూడికలను సేకరించి పరీక్షించినప్పుడు, 40% పూడికల్లో నోటి బ్యాక్టీరియాకు చెందిన జన్యు ఆనవాళ్లు కనిపించాయి. ఇవన్నీ స్ట్రెప్టోకోకై సమూహానికి చెందిన బ్యాక్టీరియాలనీ, వ్యాధినిరోధకశక్తిలోకి చొరబడలేని కొన్ని సూక్ష్మజీవులు గుండె రక్తనాళాల్లోని పూడికల్లో పేరుకుపోయి, పూడికలను చెదరగొట్టి గుండెపోట్లకు కారణమవుతూ ఉంటాయని పరిశోధకులు అంటున్నారు. నోటి పరిశుభ్రత, గుండె ఆరోగ్యానికీ మధ్య ఉన్న దీర్ఘకాలపు అనుబంధానికి సంబంధించిన ఆధారాలకు ఈ అధ్యయనం బలం చేకూరుస్తోంది. ఇతర ఇన్‌ఫెక్షన్లు, పోషకాహారలోపాలు, ఒత్తిడల వల్ల ప్రేరేపితమయ్యే నిద్రాణ స్థితిలోని బ్యాక్టీరియా కాలనీలు రక్తనాళాల్లోని పూడికలను ఛిద్రం చేసి, రక్తప్రవాహానికి అడ్డుపడేలా దోహదపడుతూ ఉంటాయి. అయితే బ్యాక్టీరియా నోటి నుంచి గుండె రక్తనాళాల్లోకి ఎలా చేరుకోగలుగుతోందనే దానికి సంబంధించి మరింత పరిశోధన చేపట్టవలసిన అవసరం ఉంది. అయితే అప్పటివరకూ గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుకోవడం కోసం నోటి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలనీ, రోజుకు రెండుసార్లు దంతాలను శుభ్రపరుచుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.





అలా కీర్తిస్తుంటే గర్వంగా ఉంది



తిలక్ వర్మ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా టీ20 కప్ ఫైనల్లో అజేయ అర్ధ శతకం (69)తో పాకిస్థాన్‌పై విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మకు సొంతగడ్డపై ఘన స్వాగతం లభించింది. సోమవారం రాత్రి దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న తిలక్‌కు శాట్ చైర్మన్ కె.శివసేనా రెడ్డి, వీసీ-ఎండీ సోనీ బాలదేవి స్వాగతం పలికి, సత్కరించారు. ఎయిర్‌పోర్టు బయట తిలక్ సోదరుడు తరుణ్, కోచ్ సలాం బయాష్ అభిమానులతో కలిసి స్వాగతం పలికారు.

అలా అంటుంటే..: దేశమంతా తన ఇన్నింగ్స్‌ను ఆకాశానికెత్తేస్తుంటే ఎంతో గర్వంగా ఉన్నదని తిలక్‌వర్మ అన్నాడు. 'ఆపరేషన్ తిలక్' అంటూ తన ఆటను కీర్తిస్తుంటే చెప్పలేనంత ఆనందంగా ఉందన్నాడు. ఇక ఫైనల్లో సాధించిన హాఫ్ సెంచరీ (69) తన కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుందని, జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని ఇన్నింగ్స్ అని తిలక్ అన్నాడు. 'ఫైనల్లో తీవ్రమైన ఒత్తిడి ఉంది. నేను బ్యాటింగ్ చేసే ముందు గట్టిగా ఊపిరి తీసుకొని, ప్రశాంతంగా ఆడేందుకు ప్రయత్నించా. పాక్ పేసర్లు మంచి వేగంతో బౌలింగ్ వేస్తున్నారు. బంతి.. బంతికి వైవిధ్యం చూపిస్తూ పరీక్షించారు. అవన్నీ తట్టుకొని సాధించిన ఈ అర్ధ శతకం చిరకాలం గుర్తుంటుంది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఏ స్థానంలోనైనా ఆడేందుకు జట్టంతా ముందే సన్నద్ధమై ఉంది. మధ్యలో వికెట్ నెమ్మదించినపుడు కోచ్ గౌతం గంభీర్‌తో మాట్లాడా. ఆయన సలహాలు బాగా ఉపకరించాయి. ఒత్తిడిని అధిగమించి సంజు శాంసన్, శివం దూబే ఆడిన తీరు అద్భుతం' అని తిలక్ అన్నాడు.

లోకేశ్ అన్నా.. నీకు ప్రత్యేక బహుమతి!



అమరావతి (ఆంధ్రజ్యోతి): ఆసియా కప్ ఆఖరిపోరులో పాకిస్తాన్‌పై విజయంలో కీలక పాత్ర పోషించిన తెలుగు క్రికెటర్ తిలక్ వర్మ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ఫైనల్లో ఆడిన తన క్యాప్‌ను బహూకరిస్తున్నట్టు పేర్కొంటూ ఓ వీడియో విడుదల చేశాడు. ఈ వీడియో కింద.. 'లోకేశ్ అన్నా.. నీ కోసం ప్రత్యేక బహుమతి' అని పేర్కొన్నాడు. తిలక్ వర్మ బహుమతిపై లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. 'తమ్ముడూ తిలక్ వర్మ.. నీ బహుమతి నాకెంతో ప్రత్యేకమైనది' అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు. స్వదేశానికి తిరిగొచ్చాక తిలక్ వర్మ చేతుల మీదుగానే క్యాప్‌ను స్వయంగా తీసుకుంటానని పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబు ప్రశంసలు

తిలక్ వర్మ ఆసియా కప్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడారని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. తెలుగు యువతలో ఇలాంటి ఫైర్ స్వతహాగా ఉంటుందని సీఎం ట్వీట్ చేశారు.



అమ్మాయిలూ ఇక మీవంతు

నేటి నుంచే వన్డే వరల్డ్‌కప్

- 47 ఏళ్లుగా భారత్ నిరీక్షణ
- స్వదేశీ అనుకూలతలపై ఆశాభావం
- శ్రీలంకతో ఆరంభ పోరు

మధ్యాహ్నం 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

గువాహటి: ఆసియాకప్ విజయ సంబరాల్లో మునిగి తేలుతున్న భారత క్రీడాభిమానులను అలరించేందుకు మరో అంతర్జాతీయ టోర్నీ సిద్ధమైంది. నేటి నుంచి 13వ మహిళల వన్డే వరల్డ్‌కప్‌కు తెర లేవనుంది. ఈ మెగా టోర్నీకి 12 ఏళ్ల తర్వాత భారత్ ఆతిథ్యమిస్తుండడం విశేషం. మంగళవారం గువాహటిలో జరిగే ప్రారంభ మ్యాచ్‌లో శ్రీలంకతో హర్మన్‌ప్రీత్ బృందం తలపడనుంది. అయితే భారత మహిళల క్రికెట్ జట్టును మాత్రం ఈ విశ్వకప్ 47 ఏళ్లుగా ఊరిస్తూనే ఉంది. 1978లో మొదటి వరల్డ్ కప్ జరిగింది. భారత జట్టు 2005, 2017 టోర్నీల్లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 2022లో జరిగిన చివరి వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా ఇప్పటిదాకా జరిగిన టోర్నీల్లో ఆసీస్ (7), ఇంగ్లండ్ (4) జట్లదే ఆధిపత్యం. 2000లో మాత్రమే న్యూజిలాండ్ నెగ్గింది. ఈసారి కూడా ఆసీస్, ఇంగ్లండ్ జట్లు ఫేవరెట్స్‌గా బరిలోకి దిగబోతున్నాయి. మరోవైపు భారత్ ఆతిథ్యమిచ్చిన 1978, 1997, 2013 టోర్నీల్లో ఆస్ట్రేలియా జట్టే చాంపియన్‌గా నిలవడం విశేషం.

టోర్నీ జరిగేది ఇలా..

ఈ వరల్డ్‌కప్‌లో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ జట్లు పాల్గొంటున్నాయి. రౌండ్ రాబిన్ పద్ధతిన జరిగే 8 లీగ్ మ్యాచ్‌లకు భారత్‌లో గువాహటి, ఇండోర్, విశాఖపట్టణం, నవీ ముంబై వేదికలు కానున్నాయి. అలాగే దాయాది పాక్ ఆడే మ్యాచ్‌లతోపాటు శ్రీలంక (కొలంబో)లో 11 లీగ్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. అక్టోబరు 5న భారత్-పాక్ పోరుతో పాటు, ఒకవేళ ఫైనల్‌కు ఈ రెండు జట్లు వస్తే కొలంబోనే వేదికగా ఉంటుంది. గ్రూప్ దశలో టాప్-4లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌లో ప్రవేశిస్తాయి.

ఇటీవల వన్డే, టీ20ల్లో ఇంగ్లండ్‌పై గెలిచిన భారత మహిళల జట్టు ఆత్మవిశ్వాసంతో టోర్నీలో అడుగుపెట్టబోతోంది. ముఖ్యంగా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన భీకర ఫామ్‌లో ఉండడం జట్టుకు సానుకూలాంశం కానుంది. ఈ ఏడాది ఆడిన 14 వన్డేల్లో 928 పరుగులు సాధించింది. ఇక కెరీర్‌లో ఐదో వరల్డ్‌కప్ ఆడనున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఇంగ్లండ్‌పై శతకం, ఆసీస్‌పై హాఫ్ సెంచరీతో జోరు మీదుంది. గాయం నుంచి కోలుకున్న జెమీమా సైతం

ఆత్మవిశ్వాసంతో హర్మన్ సేన

ఇంగ్లండ్‌తో వామప్ మ్యాచ్‌లో అర్ధ సెంచరీ సాధించింది. అలాగే హర్లీన్, రిచా, దీప్తిలతో బ్యాటింగ్ ఆర్డర్ పటిష్ఠంగా కనిపిస్తోంది. అయితే పేస్ విభాగం కాస్త బలహీనంగానే ఉంది. ఎందుకంటే రేణుకా సింగ్ మినహాయిస్తే క్రాంతి, అరుంధతి, అమన్‌జోత్ కలిపి 25 వన్డేలు మాత్రమే ఆడారు. దీనికితోడు వామప్ గేమ్‌లో అరుంధతి గాయంతో వీల్‌చైర్‌లో మైదానం వీడింది. తను ఎన్ని మ్యాచ్‌లు ఆడగలదో సందేహమే. అయితే స్వదేశీ పిచ్‌లపై తెలుగమ్మాయి శ్రీచరణి, దీప్తి, రాధా యాదవ్, స్నేహ్ రాణాల స్పిన్ ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందిపెట్టే అవకాశం ఉంది. కానీ ఫ్లాట్ వికెట్ లభిస్తే వీరి ప్రభావం ఏమేరకు ఉండగలదో వేచిచూడాల్సిందే. ఏదిఏమైనా క్లిష్ట పరిస్థితుల్లో తడబాటు లేకుండా ముందుకుసాగితే భారత మహిళలు ఈసారి కప్ కొట్టడం కష్టం కాకపోవచ్చు. మరోవైపు టోర్నీ సహ ఆతిథ్య శ్రీలంక జట్టు చమరి ఆటపట్టు నేతృత్వంలో బరిలోకి దిగుతోంది. విశేషంగా రాణిస్తున్న 20 ఏళ్ల స్పిన్ ఆల్‌రౌండర్ దేవ్‌మి విహంగపై భారీ ఆశలే పెట్టుకుంది. సొంత గడ్డపైనే తమ ఐదు లీగ్ మ్యాచ్‌లను ఆడబోతుండడం వారికి అనుకూలించనుంది.

క్రిస్ వోక్స్ రిటైర్మెంట్

లండన్: ఇంగ్లండ్ పేసర్, 36 ఏళ్ల క్రిస్ వోక్స్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ పలుకుతున్నట్టు ప్రకటించాడు. నవంబరులో జరిగే యాషెస్ సిరీస్ కోసం ప్రకటించిన ఇంగ్లండ్ జట్టులో వోక్స్‌కు చోటు దక్కలేదు. అతడి రిటైర్మెంట్‌కు ఇదే కారణమని సమాచారం. 2011లో అరంగేట్రం చేసిన వోక్స్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్నాడు. 62 టెస్టుల్లో 2034 పరుగులు, 192 వికెట్లు.. 122 వన్డేల్లో 1524 రన్స్, 173 వికెట్లు.. 33 టీ20ల్లో 147 రన్స్, 31 వికెట్లు తీశాడు.

ముకేష్‌కు రజతం



జూ. వరల్డ్ కప్ షూటింగ్

గుంటూరు-క్రీడలు (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరుగుతున్న జూనియర్ వరల్డ్ కప్ షూటింగ్ పోటీలలో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ రజత పతకంతో మెరిశాడు. సోమవారం జరిగిన 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఫైనల్ ఏడవ రౌండ్‌లో ముఖేష్, అలెగ్జాండర్ కొవలేవ్ (తటస్థ అథ్లెట్)లిద్దరూ సమంగా నిలవడంతో మాటౌట్ నిర్వహించారు. ఈ మాటౌట్‌లో కోవలేవ్ స్వర్ణం గెలవగా, ముఖేష్‌కు రజతం దక్కింది. భారత్‌కే చెందిన సూరజ్‌శర్మకు కాంస్యం లభించింది.

రింకూకు స్వర్ణం

ప్రపంచ పారా అథ్లెటిక్స్

న్యూఢిల్లీ: వరల్డ్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పురుషుల జావెలిన్ త్రో ఎఫ్46 ఈవెంట్‌లో రింకూ హుడా స్వర్ణం కైవసం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన సుందర్ రజతం గెల్చుకున్నాడు. పురుషుల షాట్‌పుట్‌లో బరిలోకి దిగిన ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ రొంగలి రవి (10.10 మీటర్లు) ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ప్రస్తుతం భారత్ రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, ఒక కాంస్యంతో మొత్తం ఐదు పతకాలతో పట్టికలో ఆరో స్థానంలో ఉంది.

నక్వీపై ఫిర్యాదు చేస్తాం: బీసీసీఐ



దుబాయ్: ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్, పాకిస్తాన్ మంత్రి మొహిసిన్ నక్వీ ఆసియా కప్ ట్రోఫీని, ఇతర పతకాలను తన వెంట తీసుకొని వెళ్లడంపై ఐసీసీకి ఫిర్యాదు చేయాలని బీసీసీఐ నిర్ణయించింది. పాకిస్తాన్ మంత్రిగా భారత్‌పై యుద్ధం చేస్తున్న నక్వీ నుంచి టీమిండియా ట్రోఫీ అందుకోకపోవడం సమంజసమేనని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జీత్ సైకియా అన్నాడు. 'నక్వీ చిన్న పిల్లాడిలా ప్రవర్తించాడు. వచ్చేనెలలో దుబాయ్‌లో జరిగే ఐసీసీ సమావేశంలో అతనిపై ఫిర్యాదు చేస్తాం' అని సైకియా స్పష్టంజేశాడు. అంతేకాదు ట్రోఫీని, పతకాలను సాధ్యమైనంత త్వరగా తమకు పంపాలని దేవ్‌జీత్ డిమాండ్ చేశాడు. ఇక..ట్రోఫీ చేతిలో లేకున్నా..అది స్వీకరించాక ఎలా సెలబ్రేషన్స్ నిర్వహిస్తారో అలానే భారత జట్టు సంబరాలు జరుపుకొంది.



నక్వీతో సూర్య కరచాలనం

మ్యాచ్ ఫీజు పహల్గాం దాడి బాధితులకు: ఆసియా కప్ టోర్నమెంట్ ద్వారా తనకు లభించిన మ్యాచ్ ఫీజును దేశ సాయుధ బలగాలు, పహల్గాం ఉగ్ర దాడి బాధిత కుటుంబాలకు అందజేయనున్నట్టు సూర్య ప్రకటించాడు. ఒక్కో టీ20 వ న్యాచ్ కు భారత క్రికెటర్‌కు రూ. 4 లక్షలు లభిస్తాయి. ఈమేరకు టోర్నీ ద్వారా సూర్యకు రూ. 28 లక్షలు అందనున్నాయి.

బీసీసీఐ నజరానా రూ. 21 కోట్లు: ఆసియా కప్ విజేతగా నిలిచిన టీమిండియాకు, సిబ్బందికి బీసీసీఐ రూ. 21 కోట్ల నజరానా ప్రకటించింది. ఈ విషయాన్ని కార్యదర్శి సైకియా తెలిపారు.

ద్వంద్వ ప్రమాణాలు : ప్రతిపక్షాల దాడి
పీసీబీ చీఫ్ మొహిసిన్ నక్వీతో సూర్యకుమార్ కరచాలనం చేస్తున్న వీడియోను పోస్ట్ చేసిన శివసేన యూబీటీ ఎంపీ సంజయ్ రౌత్ భారత జట్టు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని ధ్వజమెత్తారు.

సూర్య నాకు షేక్‌హ్యాండిచ్చాడు : ఆఘా
ఆసియా కప్ ఆరంభానికి ముందు తనతో రెండుసార్లు కరచాలనం చేసిన సూర్యకుమార్ యాదవ్ ఆత్మవంచన చేసుకుంటున్నాడని పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా విమర్శించాడు.

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్ చంద్ర ముర్ము



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్ చంద్ర ముర్ము నియమితులయ్యారు. అక్టోబరు 8వ తేదీ పదవీ విరమణ చేస్తున్న ఎం.రాజేశ్వరరావు స్థానంలో ముర్మును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు సంవత్సరాల కాలానికి డిప్యూటీ గవర్నర్‌గా ఆయన నియామకానికి నియామక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసింది. ఆయన ప్రస్తుతం ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సూపర్‌విజన్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఆర్‌బీఐ చట్టం 1934 కింద ఆర్‌బీఐలో నలుగురు డిప్యూటీ గవర్నర్లుంటారు. వారిలో ఇద్దరిని అంతర్గతంగా ఆర్‌బీఐ నుంచి ఎంపిక చేస్తారు. ఒకరిని వాణిజ్య బ్యాంకింగ్ రంగం నుంచి ఎంపిక చేసి మరొక డిప్యూటీ గవర్నర్‌గా ఆర్థికవేత్తను నియమిస్తారు. ప్రస్తుతం టీ.రబిశంకర్, స్వామినాథన్.జే, పూనమ్ గుప్తా ఇతర డిప్యూటీ గవర్నర్లుగా ఉన్నారు. సూపర్‌విజన్ శాఖలో ఆయనకు గల విస్తృత అనుభవం ప్రస్తుత అంతర్జాతీయ అస్థిరతలు, దేశీయ సంస్కరణల నేపథ్యంలో దేశానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులంటున్నారు.

ఎంపీసీ సమావేశం షురూ: రాబోయే రెండు నెలల కాలానికి అనుసరించాల్సిన ద్రవ్యపరపతి విధానాన్ని నిర్ణయించేందుకు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నాయకత్వంలో ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం సోమవారం ప్రారంభమయింది. ఈ సమావేశంలో దేశంలో ప్రస్తుత ఆర్థిక స్థితిగతులు, ద్రవ్యోల్బణ కదలికలు, అంతర్గత/విదేశీ ఒత్తిడులపై సమీక్షించి ద్రవ్య విధానాన్ని రూపొందిస్తారు. 3 రోజుల సమావేశం అనంతరం బుధవారం మల్హోత్రా ఎంపీసీ నిర్ణయాలను ప్రకటిస్తారు.

ఆగస్టులో పారిశ్రామికం జోరు

న్యూఢిల్లీ : గత ఏడాది ఆగస్టుతో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టులో పారిశ్రామికోత్పత్తి సూచి (ఐఐపీ) నాలుగు శాతం పెరిగింది. గనుల రంగం ఆరు శాతం పెరగడం ఇందుకు బాగా కలిసొచ్చింది. అయితే జూలైలో నమోదైన 4.3% ఐఐపీతో పోలిస్తే ఇది 0.3 శాతం తక్కువ. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) సోమవారం ఈ వివరాలు విడుదల చేసింది. ఐఐపీలో నాలుగింట మూడు వంతుల వాటా ఉన్న తయారీ రంగం గత నెల 3.8 % వృద్ధి రేటు నమోదు చేసింది. గత ఏడాది ఆగస్టులో ఇది 1.2 శాతం మాత్రమే.

వెండి కిలో లక్షన్నర



రూ.1.20 లక్షల చేరువలో పసిడి

- వెండి ధర ఒకే రోజు రూ.7,000 పెరుగుదల
- వారంలో రూ.19,050 అప్

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్ ర్యాలీకి ఇప్పట్లో బ్రేక్ పడే సూచనలు కనిపించడం లేదు. సోమవారం దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు మరో జీవిత కాల గరిష్ఠ స్థాయిని తాకాయి. ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.1,500 పెరిగి రూ.1,19,500కు చేరింది. కిలో వెండి ధర ఒకే రోజు రూ.7,000 పెరిగి రూ.1.5 లక్షలను తాకింది. దీంతో గత వారం రోజుల్లోనే కిలో వెండి ధర రూ.19,051 పెరిగినట్టయింది.

బంపర్ లాభాలు

ఈ ఏడాది ఇప్పటి వరకు చూస్తే దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి మదుపరులకు బంపర్ లాభాలు పంచాయి. గత ఏడాది డిసెంబరు 31న రూ.78,950 పలికిన 10 గ్రాముల మేలిమి బంగారం ఇప్పటి వరకు రూ.40,550 (51.36%) పెరిగి రూ.1,19,500కు చేరింది. ఇదే సమయంలో కిలో వెండి ధర రూ.89,700 నుంచి రూ.60,300 (67.22%) పెరిగి రూ.1.5 లక్షల రికార్డు స్థాయికి చేరింది. సెన్సెక్స్, నిఫ్టీలు ఇదే కాలంలో ఎలాంటి ఎదుగూ బొదుగూ లేకుండా మదుపరులను నిరాశ పరిచాయి.

తెలుగు రాష్ట్రాల్లో

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పసిడి, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి. 10 గ్రాముల మేలిమి బంగారం సోమవారం హైదరాబాద్‌లో రూ.1,16,400 వద్ద, కిలో వెండి రూ.1.59 లక్షల వద్ద ట్రేడయ్యాయి. గత వారం 10 గ్రాముల మేలిమి బంగారం ధర తెలుగు రాష్ట్రాల్లోనూ (ప్రొద్దుటూరు) రికార్డు స్థాయిలో రూ.1.19 లక్షలకు చేరింది. విశాఖలో కిలో వెండి ధర గత వారం రికార్డు స్థాయిలో రూ.1.59 లక్షలు నమోదు చేసింది.

అంతర్జాతీయ మార్కెట్

అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు సరికొత్త రికార్డు స్థాయికి చేరాయి. డిసెంబరులో డెలివరీ ఇచ్చే బంగారం ఔన్స్ (31.10 గ్రాములు) ధర సోమవారం రెండు శాతానికి పైగా పెరిగి 3,860.45 డాలర్లను తాకింది. ఔన్స్ వెండి ధర 2 శాతం పైగా పెరిగి 47.39 డాలర్లను తాకింది.

ఫ్యూచర్స్ మార్కెట్

ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ సోమవారం బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి. అక్టోబరులో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల పసిడి ధర మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజిలో రూ.1,204 (1.06%) లాభంతో రూ.1,14,992కి, డిసెంబరు కాంట్రాక్టు ధర రూ.1,034 (0.9%) లాభంతో రూ.1,15,925కు చేరాయి. గత వారం రోజుల్లోనే ఫ్యూచర్స్ మార్కెట్‌లో పసిడి ధర రూ.4,188 (3.77%) పెరిగింది. డిసెంబరులో డెలివరీ ఇచ్చే కిలో వెండి ధర సోమవారం ఎంసీఎక్స్‌లో రూ.2,290 (1.61%) లాభంతో రూ.1,44,179కు చేరి రికార్డు సృష్టించింది. వచ్చే ఏడాది మార్చిలో డెలివరీ ఇచ్చే కిలో వెండి ధర ఎంసీఎక్స్‌లో రూ.2,559 లాభంతో రూ.1,45,817ను తాకింది.

మరింత ముందుకే!

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రధాన ఆర్థిక పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు కనిపించడం లేదు. దీంతో బంగారం, వెండి ధరలు రికార్డుల మీద రికార్డులు నమోదు చేస్తున్నాయి. ప్రస్తుతం 3,860.45 డాలర్లను బ్రేక్ చేసిన ఔన్స్ పసిడి ధర త్వరలోనే 4,000 డాలర్లకు చేరే అవకాశం ఉందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ సంస్థ ప్రెషియస్ మెటల్స్ సీనియర్ అనలిస్ట్ మానవ్ మోదీ అంచనా. అదే జరిగితే దేశీయ మార్కెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1.25 లక్షలకు, కిలో వెండి ధర రూ.1.75 లక్షలకు చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. అయితే ఈ వారాంతంలో బులియన్ మార్కెట్‌లో కొద్దిపాటి ప్రాఫిట్ బుకింగ్ అమ్మకాలు జరిగే అవకాశం కూడా ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

బిజినెస్

అక్టోబరు 6న టాటా క్యాపిటల్ ఐపీఓ

ఇష్యూ ధర రూ.310-326


ముంబై: టాటా సన్స్ అనుబంధ ఎన్‌బీఎఫ్‌సీ టాటా క్యాపిటల్ అక్టోబరు 6వ తేదీన తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) జారీ చేయనున్నట్టు ప్రకటించింది. రూ.15,512 కోట్ల సమీకరణ లక్ష్యంగా రంగంలోకి దిగుతున్న ఈ సంస్థ షేరు ధర శ్రేణిని రూ.310-326గా ప్రకటించింది. గరిష్ఠ ధరలో కంపెనీ విలువ రూ.1.38 లక్షల కోట్లవుతుంది. అక్టోబరు 8వ తేదీన ఇష్యూ ముగుస్తుంది. మొత్తం 47.58 కోట్ల షేర్లను విడుదల చేస్తుండగా అందులో 21 కోట్ల తాజా షేర్లున్నాయి. 26.58 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయిస్తారు.

ఆర్థిక రంగంలో అతి పెద్ద ఇష్యూ: ఈ ఏడాది లో ఇదే అతి పెద్ద ఇష్యూ అవుతుంది. దేశీయ ఆర్థిక రంగంలో అయితే ఇప్పటివరకు ఇదే అతి పెద్ద ఇష్యూ. ఇటీవల సంవత్సరాల్లో టాటా గ్రూప్ నుంచి విడుదలవుతున్న రెండో ఇష్యూ ఇది. ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తించిన 3 సంవత్సరాల్లోగా ఐపీఓ జారీ చేయాలన్న నిబంధనకు అనుగుణంగా ఈ ఇష్యూ జారీ చేస్తున్నారు.

రెండేళ్ల కనిష్ఠానికి టాటా మార్కెట్ క్యాప్


స్టాక్ మార్కెట్ ఆటుపోట్లు టాటా గ్రూప్‌లోని 16 కంపెనీల షేర్ల ధరలను గుంజేస్తున్నాయి. గత ఏడాది కాలంలో ఈ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ (మార్కెట్ క్యాప్) 7,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.6.65 లక్షల కోట్లు) మేర క్షీణించింది. గత అక్టోబరులో దాదాపు 40,000 కోట్ల డాలర్ల వరకు ఉన్న ఈ కంపెనీల మార్కెట్‌విలువ ప్రస్తుతం 32,500 కోట్ల డాలర్లకు (సుమారు రూ.28.84 లక్షల కోట్లు) పడిపోయింది. టాటా గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ గత రెండేళ్లలో ఇంత కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. హెచ్-1బీ వీసాల ఫీజును లక్ష డాలర్లకు పెంచుతున్నట్టు అమెరికా అధ్యక్షుడు ఈ నెల 19న ప్రకటించారు. అప్పటి నుంచి చూసినా ఈ కంపెనీల షేర్ల మార్కెట్ క్యాప్ 2,000 కోట్ల డాలర్లు పతనమయింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	530
చిత్తూరు	543	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ.	72

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,16,400 ▲	1,06,700 ▲	1,59,000 ▲
విజయవాడ	1,20,000 ▲	1,14,000 ▲	1,49,000 ▲
విశాఖపట్నం	1,18,950 ▲	1,06,700 ▲	1,60,000 ▲
రాజమండ్రి	1,16,400 ▲	1,06,700 ▲	1,47,000 ▼
ప్రొద్దుటూరు	1,20,300 ▲	1,10,680 ▲	1,49,000 ▲
ముంబై	1,15,454 ▲	1,05,760 ▲	1,44,100 ▲

ఆర్‌బీఐ పాలసీపై అప్రమత్తం

ఏడో రోజూ నష్టాల్లో మార్కెట్

ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం నేపథ్యంలో మార్కెట్లో అప్రమత్త వాతావరణం నెలకొంది, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు, విదేశీ నిధుల తరలింపు వరుసగా ఏడో రోజు కూడా మార్కెట్‌ను నష్టాల్లోకి నెట్టాయి. సోమవారం ప్రారంభం నుంచి చివరి వరకు సూచీలు భారీ ఊగిసలాట ధోరణిలో ట్రేడయ్యాయి. సెన్సెక్స్ 61.52 పాయింట్ల నష్టంతో 80,364.94 వద్ద ముగియగా నిఫ్టీ 19.80 పాయింట్ల నష్టంతో 24,634.90 వద్ద క్లోజయింది. ఏడు వరుస సెషన్లలో సెన్సెక్స్ 2,649.02 పాయింట్లు, నిఫ్టీ 788.7 పాయింట్లు నష్టపోయాయి. అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి 3 పైసలు నష్టపోయి 88.75 వద్ద ముగిసింది. విదేశీ ఇన్వెస్టర్లు శుక్రవారం రూ.5,687.58 కోట్ల విలువ గల ఈక్విటీలు విక్రయించారు.



'సంగం' టర్నోవర్ లక్ష్యం రూ.2,300 కోట్లు

త్వరలో మరిన్ని కొత్త ఉత్పత్తులు: ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్ (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,019 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. వచ్చే ఏడాది రూ.2,300 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ వెల్లడించారు. వడ్లమూడిలో సోమవారం వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) మాట్లాడుతూ ప్రస్తుతం సంగం డెయిరీ రోజుకు 8.20 లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించి దాని ద్వారా మరిన్ని నూతన ఉత్పత్తులను మార్కెట్లో ప్రవేశపెడతామన్నారు. గత ఐదేళ్లుగా తిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీకి అవసరమైన నెయ్యిని కూడా సరఫరా చేస్తున్నట్టు చైర్మన్ తెలిపారు. త్వరలో సంగం ఉత్పత్తులను తెలంగాణలోని వరంగల్ జిల్లాలోనూ విక్రయిస్తామన్నారు. నాయుడుపేట సెజ్‌లో కేటాయించిన భూమిలో త్వరలోనే కొత్త ప్లాంటు నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్టు చెప్పారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	117
వరంగల్	105	గుంటూరు	120
కరీంనగర్	105	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	100
కర్నూలు	105	నెల్లూరు	105
విశాఖపట్నం	122	అనంతపురం	105
గోదావరి	117		



ప్రయాణికులకు టీ అందిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, పక్కన ఎంపీ కేశినేని చిన్ని, తదితరులు

సామాన్యుల చేరువలోకి విమాన ప్రయాణం

- గన్నవరంలో త్వరలో కొత్త టెర్మినల్: రామ్మోహన్ నాయుడు

గన్నవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విమానయానాన్ని సాధారణ ప్రజల ప్రయాణ సాధనంగా మార్చడం కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విమాన ప్రయాణికులకు తక్కువ ధరకు అల్పాహారం, తాగునీరు అందించేందుకు ఉడాన్ యాత్రి కేఫ్‌ను విజయవాడ విమానాశ్రయంలో ఎంపీ, గన్నవరం ఎయిర్‌పోర్టు సలహామండలి వైస్ చైర్మన్ కేశినేని శివనాథ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ప్రయాణికులకు టీ, సమోస అందజేసి కొద్దిసేపు వారితో ముచ్చటించారు. విమానాశ్రయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. విజయవాడ విమానాశ్రయంలో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. కొత్త టెర్మినల్ నిర్మాణ పనులను వేగవంతం చేశామని, మరో రెండు, మూడు నెలల్లో ప్రారంభిస్తామని చెప్పారు. విమాన చార్జీలు తగ్గడంతో మధ్యతరగతి ప్రయాణికులు గణనీయంగా పెరిగారని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. త్వరలోనే అహ్మదాబాద్, వారాణసీ, కొచ్చి, పుణె నగరాలకు కొత్త విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఏఐ (హెచ్‌ఆర్) సభ్యుడు హెచ్.శ్రీనివాస్, ఏఏఐ (ఆపరేషనల్) సభ్యుడు శరద్‌కుమార్, విమానాశ్రయం డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

గుండె జబ్బుల వల్లే 20% మరణాలు

ప్రజల ఆరోగ్య సంరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- ఎన్టీఆర్ వైద్యసేవకు 15 నెలల్లోనే రూ.4,350 కోట్లు
- వచ్చే ఏడాది అనంతపురం, కాకినాడల్లో క్యాన్సర్ కేంద్రాలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో 20 శాతం మరణాలకు గుండె జబ్బులే కారణమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, సీఎం చంద్రబాబు నాయకత్వంలో 15 నెలల్లోనే ఎన్టీఆర్ వైద్యసేవకు రూ.4,350 కోట్లు ఖర్చుపెట్టడం దీనికి నిదర్శనమని చెప్పారు. 'వరల్డ్ హార్ట్ డే' సందర్భంగా అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కార్డియాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా అధిక మరణాలు గుండె జబ్బుల వల్లే సంభవిస్తున్నాయని, క్యాన్సర్ మరణాలు ఆ తర్వాతి స్థానంలో ఉన్నాయని చెప్పారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్డియాలజీ విభాగాలను అభివృద్ధి చేసి, క్యాథ్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒంగోలు, కడపలో ఇప్పటికే క్యాథ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన ఎన్టీఆర్ వైద్యసేవ ఖర్చు రూ.4,350 కోట్లలో... రూ.1,004 కోట్లు గుండె శస్త్ర చికిత్సలకే వెచ్చించిందని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న హృద్రోగులను కాపాడేందుకు 238 ఏరియా, జిల్లా స్థాయి ఆస్పత్రుల్లో రూ.45 వేల ఖరీదైన ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచామని, వీటి ద్వారా ఈ 15 నెలల్లో 3,450 మంది ప్రాణాలు కాపాడగలిగామని మంత్రి వివరించారు.



క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి

ఐసీఎంఆర్ నివేదికల ప్రకారం దేశవ్యాప్తంగా 15.60 లక్షల మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారని, అందుకే ప్రభుత్వాస్పత్రుల్లో క్యాన్సర్ చికిత్సల ప్రక్రియను బలోపేతం చేశామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. కర్నూలులో క్యాన్సర్ సెంటర్, విశాఖపట్నంలో ఖరీదైన రేడియాలజీ కేంద్రం, కడపలో క్యాన్సర్ కేంద్రం, గుంటూరులో ప్రథమ స్థాయి (లెవెల్-1) క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభించామని చెప్పారు. వచ్చే ఏడాది అనంతపురం, కాకినాడల్లోనూ క్యాన్సర్ సెంటర్లు నిర్మించబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో 4.16 కోట్ల మందికి ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అయితే గ్రామాల్లో అవగాహన లేని కారణంగా పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావడంలేదని అన్నారు. ప్రతి యువతి, మహిళ ముందుకొచ్చి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కియ పరిశ్రమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి అధునాతన సాంకేతిక గుండె శస్త్రచికిత్స యంత్రాలను అందించిందని తెలిపారు. వాటిని వినియోగించి, 100 ఐవీయూఎస్, 500 యాంజియోగ్రామ్ ప్లాస్టీ సర్జరీలు చేసి రోగుల ప్రాణాలు కాపాడిన కార్డియాలజిస్ట్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్, ఆయన బృందాన్ని అభినందిస్తున్నాని మంత్రి సత్యకుమార్ తెలిపారు.



విశాఖ కలెక్టరేట్ ఆవరణలో ఉన్న కారవాన్ వాహనం

విశాఖకు మరో పర్యాటక హంగు

- అరకు టూర్‌కు కారవాన్.. త్వరలో ప్యాకేజీ ఖరారు

విశాఖపట్నం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పర్యాటక రంగానికి అదనపు ఆకర్షణ తోడైంది. ఎప్పటి నుంచో చెబుతున్న 'కారవాన్' వాహనం ఎట్టకేలకు నగరానికి చేరింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు విజయవాడలో దీనిని ప్రారంభించగా, సోమవారం ఇక్కడికి వచ్చింది. కలెక్టర్ హరేంధిరప్రసాద్, జాయింట్ కలెక్టర్ అశోక్ ఈ వాహనాన్ని పరిశీలించారు. సోమవారమే విధుల్లో చేరిన పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ కల్యాణి కొత్త కారవాన్ విశేషాలను వారికి వివరించారు. విశాఖపట్నానికి చెందిన శివాజీ అనే వ్యాపారవేత్త రూ.1.4 కోట్లతో సమకూర్చుకున్న ఈ వాహనాన్ని.. ఏపీటీడీసీతో ఒప్పందం చేసుకున్న తర్వాత విశాఖ నుంచి అరకులోయ, పాడేరు, లంబసింగి తదితర పర్యాటక ప్రాంతాలకు నడుపుతారు. త్వరలో టూర్ ప్యాకేజీ వివరాలు ప్రకటిస్తారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బన్నీ చిత్రానికి జపనీస్ కొరియోగ్రాఫర్



అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రంపై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. సన్ పిక్చర్స్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఈ సినిమాకు విదేశీ సాంకేతిక నిపుణులు పని చేస్తున్న సంగతి విదితమే. తాజాగా మరో విదేశీ సాంకేతిక నిపుణుడు హోంకుటో కొనిషి అల్లు అర్జున్ చిత్రానికి పని చేస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. బన్నీతో దిగిన ఫొటోను ఆయన షేర్ చేశారు. నెల రోజుల నుంచి ఈ టీమ్‌తో కలసి వర్క్ చేస్తున్నాననీ, టీమ్ ఎంతో కష్టపడుతోందని, భారీ స్థాయిలో చిత్రం రానున్నదని, ఇంతకు మించి మాట్లాడనని 'హోకో'గా సుపరిచితుడైన ఈ జపనీస్.. బ్రిటీష్ కొరియోగ్రాఫర్ తెలిపారు. సాయి అభ్యంకర్ ఈ సినిమాకు స్వరాలు అందిస్తున్నారు. అల్లు అర్జున్ ఇమేజ్‌కు తగ్గట్లుగా హై ఎనర్జిటిక్ సాంగ్స్ చిత్రం కోసం ప్లాన్ చేస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ముంబై షెడ్యూల్ పూర్తయింది. తదుపరి షెడ్యూల్‌ను అబుదాబీలో చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అదరగొట్టిన రాజా సాబ్



ప్రభాస్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'రాజా సాబ్' ట్రైలర్ వచ్చేసింది. వారి నిరీక్షణకు తెరదించుతూ అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ అదరగొట్టింది. ప్రభాస్‌ను ఓ హిప్నాటిస్ట్ భారీ హవేలీలోకి తీసుకెళ్లడంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. అక్కడ అనూహ్య ఘటనలు చోటు చేసుకుంటాయి. 'అబీ దేఖ్ లీజియే...' అంటూ దుష్టశక్తిని ఎదుర్కొనేందుకు రాజా సాబ్‌గా హవేలీలోకి అడుగుపెడతాడు ప్రభాస్. రాజా సాబ్ లుక్‌లో ప్రభాస్ మేకోవర్, స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్ వన్స్ మోర్ అనేలా ఉంది. మొసలితో ప్రభాస్ ఫైట్, దుష్టశక్తులతో పోరాడే తీరు ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు అందమైన కథానాయికలతో ప్రభాస్ ప్రేమ సన్నివేశాలు మరో ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రాన్ని మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ కథానాయికలుగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. సినిమా వచ్చే ఏడాది జనవరి 9న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది.

గోదారి నేపథ్యంలో ప్రేమకథ



రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా నటించిన 'శశివదనే' చిత్రం అక్టోబర్ 10న విడుదల కానుంది. గౌరీ నాయుడు సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సాయిమోహన్ ఉబ్బన దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో 'లంకలోని సీత కోసం రాముడు సముద్రాలు దాటినట్లు నీ సైకిల్ పాప కోసం నువ్వు ఈ గోదారి దాటుతున్నావన్న మాట'.. అనే డైలాగ్ ఉంది. తన మనసుకి నచ్చిన యువతి కోసం హీరోగా గోదారి దాటి వెళ్లి అన్వేషిస్తాడన్న మాట. దానికి తగ్గట్లుగానే సన్నివేశాలు చూపించారు. చివరకు హీరోయిన్ కనిపించగానే హీరో భావోద్వేగాలను కూడా దర్శకుడు చక్కగా చిత్రీకరించారు. గోదావరి నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథ ఇదని నిర్మాతలు అహితేజ బెల్లంకొండ, అభిలాష్‌రెడ్డి చెప్పారు. సినిమాలోని సన్నివేశాలు, పాటలు ఆకట్టుకుంటాయని తెలిపారు. సినిమా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉందని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, నేపథ్య సంగీతం: అనుదీప్ దేవ్, ఫొటోగ్రఫీ: సాయికుమార్ ధారా, ఎడిటర్: గ్యారీ బీహెచ్.

'హై లెసో' ఆరంభం




బుల్లి తెర, వెండి తెర రెండింటిలోనూ తనదైన ముద్ర వేస్తున్న సుధీర్ ఆనంద్ కొత్త చిత్రం పూజా కార్యక్రమాలతో సోమవారం ప్రారంభమైంది. ప్రసన్న కుమార్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని వజ్ర వారాహి సినిమాస్ బేనర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'హైలెసో' అనే పేరును హీరో నిఖిల్ లాంచ్ చేశారు. నిర్మాత బన్నీ వాసు స్క్రిప్ట్‌ను అందజేశారు. దర్శకులు వశిష్ఠ, చందూ మొండేటి, మెహర్ రమేశ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, ముహూర్తపు షాట్‌కు వి.వి.వినాయక్ క్లాప్ కొట్టారు. చిత్ర దర్శకుడు ప్రసన్న కుమార్ యాక్షన్ చెప్పారు. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా, ప్రతినాయకుడి పాత్రలో శివాజీ నటిస్తున్నారు. కన్నడ నటి అక్షర గౌడ కీలక పాత్రలో కనిపించనున్నారు. సినిమాను తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

'కాంతార 1'కు ఆటంకాలు కల్పించవద్దు

-పవన్‌కల్యాణ్

రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'కాంతార 1' చిత్రం టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలుగు సినిమాలకు కర్నాటకలో ఆటంకాలు కల్పిస్తున్నారనీ, మన చిత్రాలకు టికెట్ ధరల పెంపు విషయంలో అక్కడి ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించడం లేదనీ, తెలుగు సినిమా పోస్టర్లు, బేనర్లు కొందరు తొలగిస్తున్నారనీ, ఇటువంటి తరుణంలో 'కాంతార 1' చిత్రంతో పాటు ఇతర కన్నడ చిత్రాలకు టికెట్ ధరల పెంపుపై పునరాలోచన చేయాలని ప్రభుత్వం ముందుకు అభ్యంతరాలు వచ్చాయి. అయితే 'కళ అనేది మనసుల్ని కలపాలి. విడదీయకూడదు. మన సినిమాకు వ్యాపారపరంగా ఎదురవుతున్న ఇబ్బందుల్ని రెండు భాషల ఫిల్మ్ ఛాంబర్స్ కూర్చుని మాట్లాడుకోవాలి. ప్రభుత్వపరంగా మనమూ మాట్లాడదాం. కర్నాటకలో ఎదురైన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని 'కాంతార 1'కు ఇక్కడ ఆటంకాలు కల్పించవద్దు' అని కోరారు పవన్‌కల్యాణ్.

కథకు ప్రాధాన్యమున్న చిత్రం



- రష్మిక మందన్న

ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్న జంటగా ఆదిత్య సర్పోత్దార్ తెరకెక్కించిన సినిమా 'థామా'. మడాక్ ఫిల్మ్స్ సమర్పణలో దినేశ్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించారు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'కథకు చాలా ప్రాధాన్యమున్న చిత్రమిది. కచ్చితంగా ప్రేక్షకులను మైమరపిస్తుంది. ప్రతి సినిమాకీ ఓ కొత్త క్యారెక్టర్ చేయాలని ప్రయత్నిస్తుంటాను. ఈ సినిమాలో కూడా కొత్త క్యారెక్టర్‌తో ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాను' అని అన్నారు. ఆయుష్మాన్ ఖురానా మాట్లాడుతూ 'ఇది పూర్తిగా పాన్ ఇండియా చిత్రం. ఇందులో నేను చేసిన క్యారెక్టర్ కొత్తగా అనిపించింది. రష్మికతో కలసి నటించడం ఆనందంగా ఉంది' అని చెప్పారు.


దర్శకుడు గార సత్యం కన్నుమూత



పలు తెలుగు చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో-డైరెక్టర్‌గా పనిచేసిన గార సత్యం(91) సోమవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. దాదాపు వంద సినిమాలకు దర్శకత్వ శాఖలో పనిచేయడంతో పాటు ఓ సినిమాకు దర్శకత్వం వహించారు. సూపర్ స్టార్ కృష్ణ, విజయనిర్మల సినిమాలకు అత్యధికంగా పనిచేశారు. గార సత్యం భార్య నాలుగేళ్ల క్రితం మరణించారు. వీరికి పిల్లలు లేరు. పంజాగుట్ట స్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

'ఓజీ' టికెట్ ధరలు తగ్గించాలి

పెంచిన 'ఓజీ' సినిమా టికెట్ రేట్లను వెంటనే తగ్గించి అమ్మాలని ఎగ్జిబిటర్లను తెలంగాణ పోలీస్ శాఖ ఆదేశించింది. ఈ మేరకు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మెమో జారీ చేశారు.



బీమా కంపెనీ ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న డీజీపీ గుప్తా

పోలీసు సిబ్బందికి ప్రమాద బీమా

- హోంగార్డుకు 10 లక్షలు.. కానిస్టేబుల్‌కు పాతిక లక్షలు
- ఎస్‌ఐ నుంచి ఏఎస్పీ వరకూ 35 లక్షలు: డీజీపీ గుప్తా

అమరావతి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల కుటుంబాలకు పోలీసుశాఖ అండగా ఉంటుందని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అన్నారు. రోడ్డు, ఇతర ప్రమాదాలకు సంబంధించి పోలీసు సిబ్బంది, అధికారులు, హోంగార్డులకు గత ప్రభుత్వంలో ఆపేసిన గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీ(జీపీఏఐ) సౌకర్యాన్ని పోలీసు శాఖ పునరుద్ధరించింది. సోమవారం మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో న్యూఇండియా అస్యూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు రూ.7.68 కోట్ల చెక్కును డీజీపీ గుప్తా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హోంగార్డుకు రూ.10లక్షలు, కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకూ రూ.25లక్షలు, సబ్ ఇన్‌స్పెక్టర్ నుంచి అడిషనల్ ఎస్పీ వరకూ రూ.35 లక్షలు, ఆపై డీజీపీ హోదా వరకూ రూ.45లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. ఈ పాలసీని ఏడాదిపాటు పునరుద్ధరించామన్నారు.



రియాధ్‌లో జరిగిన తెలుగు దినోత్సవంలో పీ-4పై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నేత షేక్ జానీ బాషా, వేదికపై గల్ఫ్ టీడీపీ నేతలు

ప్రభుత్వ పరిశీలనలో ప్రవాసీ సంక్షేమ కమిటీలు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి
- సౌదీ తెలుగు దినోత్సవంలో వీడియోకాల్ ప్రసంగం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దేశంలో కేరళతో సహా ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సమగ్ర ప్రవాసీ సంక్షేమ విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. ఏపీలోని ప్రతి జిల్లా కేంద్రంలో ఒక మండల రెవెన్యూ అధికారి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి.. ప్రత్యేక అధికారిక బృందాల ఆధ్వర్యంలో ప్రవాసీ విభాగాలను నెలకోల్పే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆయన వెల్లడించారు. సౌదీలోని ప్రఖ్యాత తెలుగు ప్రవాసీ సంఘం.. సాటా సెంట్రల్ శుక్రవారం రాత్రి రియాద్ నగరంలో నిర్వహించిన తెలుగు దినోత్సవంలో తెలుగుదేశం పార్టీ సౌదీ అరేబియా ప్రతినిధులు పీ-4 అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి వీడియో కాల్ ద్వారా సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రవాసీయుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి నుంచీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని వెల్లడించారు. సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న ప్రవాసాంధ్రులు పీ-4 పథకంలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. పీ-4 కమిటీ ఉపాధ్యక్షులు కుటుంబరావు చెరుకూరి, ఏపీ ఎన్నార్టీఎస్ సీఈవో డాక్టర్ పి.కృష్ణమోహన్ పీ-4 పథకంతో పాటు, ప్రవాసీయుల సంక్షేమ విధానాల గురించి వివరించారు. 300కు పైగా మంది ప్రవాసాంధ్రులు పీ-4 పథకంలో మార్గదర్శకులుగా చేరడానికి సంసిద్ధత వ్యక్తం చేసినట్లు కార్యక్రమ నిర్వాహకుల్లో ఒకరైన టీడీపీ నేత, పల్నాడు జిల్లాకు చెందిన షేక్ జానీ బాషా వెల్లడించారు. టీడీపీ నాయకులు రావి రాధాకృష్ణ, ఖలీద్ సైఫుల్లా, రాజశేఖర్ చెన్నుపాటి, సతీశ్‌బాబు చొల్లంగి, అనంత్ శ్రీనివాస్ దాడి, అక్షిత చెన్నుపాటి, శిల్ప గడ్డం నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అర్బన్ అథారిటీల ఛైర్మన్ల పదవీ కాలం పొడిగింపు

అమరావతి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఛైర్మన్ల పదవీ కాలాన్ని ఏడాది నుంచి ప్రభుత్వం రెండేళ్లకు పొడిగించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ మెట్రో పాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ చట్టంలో సవరణ చేస్తూ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఆయా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు 2024 నవంబరులో, ఈ ఏడాది మే, ఆగస్టు నెలల్లో నియమితులైన ఛైర్మన్ల పదవీ కాలాన్ని వారి నియామక తేదీ నుంచి రెండేళ్లకు పొడిగిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది.

ఏపీభవన్ ఆర్సీగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్(ఆర్సీ)గా సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. 2006 బ్యాచ్‌కు చెందిన ఆయన సోమవారం ఏపీభవన్‌లో మాజీ ఆర్సీ సౌరభ్‌గౌర్ నుంచి చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌ను సౌరభ్‌గౌర్‌తోపాటు స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్, డిప్యూటీ కమిషనర్ ఎస్వీ రామారావు, కదిరి మోహన ప్రభాకర్ అభినందించారు.

బార్లపై తగ్గనున్న అదనపు ఏఆర్ఈటీ భారం

- మంత్రివర్గ ఉపసంఘం భేటీలో చర్చ

అమరావతి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బార్లపై అదనంగా విధిస్తున్న ఏఆర్ఈటీ పన్ను అంశంపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యింది. మంగళగిరిలోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఈ సమావేశం జరిగింది. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇందులో పాల్గొనగా... మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అదనపు ఏఆర్ఈటీతోపాటు మైక్రో బ్రూవరీ, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం, ప్రీమియం లిక్కర్ స్టోర్ల అంశాలపై చర్చించారు. ఉపసంఘం సిఫారసులను త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తుది నిర్ణయం తీసుకుంటారు. బార్‌లకు విధిస్తున్న 15శాతం అదనపు ఏఆర్ఈటీని తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. తగ్గించిన పన్నును మద్యం షాపులకు సర్దుబాటు చేసే అవకాశం ఉంది. దీనివల్ల మద్యం ధరలు స్వల్పంగా పెరగొచ్చు.

ఐఏఎస్‌లు-ప్రభుత్వ పెద్దలకు మధ్య 'క్విడ్ ప్రోకో'?

- వైసీపీ సర్కారు విధానాలే అనుసరిస్తున్న కూటమి
- ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆరోపణ

విజయవాడ(గాంధీనగర్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల మధ్య క్విడ్ ప్రోకో జరుగుతోందేమోనని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కె. రాజేశ్వరరావు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాలనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా జారీ చేసిన మెమో 57ను.. అప్పటి సర్కారు పెద్దలకు అత్యంత సన్నిహితంగా ఉండే ముగ్గురు ఐఏఎస్ అధికారులకు అమలు చేశారని తెలిపారు. అదే జీవో పరిధిలోకి వచ్చి, పాత పెన్షన్‌కు అర్హులైన 11 వేల మంది రాష్ట్ర ఉద్యోగులను విస్మరించారని ఆరోపించారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం జీవో 1793 జారీ చేసి, రాష్ట్రంలో విధులు నిర్వర్తిస్తున్న అఖిల భారత సర్వీసెస్ ఉద్యోగులకు మాత్రమే నెలవారీ మ్యాచింగ్ గ్రాంట్‌ను 10 నుంచి 14 శాతానికి పెంచిందని విమర్శించారు. సీపీఎస్ రద్దుపై అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నా స్పందించని గత, ప్రస్తుత ప్రభుత్వాలు కేవలం అఖిల భారత సర్వీసెస్ అధికారులకుపై ప్రేమ చూపేందుకు క్విడ్ ప్రోకోనే కారణమనే అభిప్రాయం ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతోందని తెలిపారు.

దుర్గమ్మ దర్శనానికి ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. మూల నక్షత్రం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై సరస్వతీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మకు సీఎం చంద్రబాబు దంపతులు సోమవారం ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ, దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్‌పాటు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాజగోపురం మెట్ల వద్ద పరివట్టం చుట్టారు. ప్రభుత్వం తరఫున సీఎం దంపతులు పట్టువస్త్రాలు సమర్పించాక అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు వేదాశీర్వచనమిచ్చి తీర్థ ప్రసాదాలు, మంత్రి ఆనం అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. ఆ తర్వాత మీడియా పాయింట్‌లో చంద్రబాబు మాట్లాడారు. ఇంద్రకీలాద్రిని అభివృద్ధిచేసి భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. 'నవరాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై భక్తులకు ఇబ్బందులు రాకుండా ఎక్కువమందికి దర్శనభాగ్యం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. వీఐపీ దర్శనాలను క్రమబద్ధీకరించాం. ఎక్కువ సమయం సాధారణ భక్తులకే కేటాయించాం. ప్రసాదంలో నాణ్యత పెంచాం. ఒకేసారి 1,500 మందికి సరిపోయేలా రూ.26 కోట్లతో నిర్మిస్తున్న అన్నప్రసాద భవనాన్ని ఆరునెలల్లో అందుబాటులోకి తెస్తాం. రూ.27కోట్లతో కొత్త ప్రసాదం తయారీ కేంద్రాన్ని 3 నెలల్లో పూర్తి చేస్తాం. రూ.14 కోట్లతో ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ ఐదు నెలల్లో పూర్తి చేస్తాం' అని వెల్లడించారు. తిరుమలలో ఉన్నంత స్థలం ఇంద్రకీలాద్రిపై లేదని, విజయవాడలోనే వసతి ఏర్పాటు చేసుకోవాలన్నారు.


దుర్గమ్మ ఆలయంలో సీఎం చంద్రబాబుతో వాయిద్యకారులు

క్యూలను ఆపకుండా

చంద్రబాబు దంపతులు అంతరాలయంలో ఉండగానే సాధారణ భక్తులకు అమ్మవారి దర్శనాలు కొనసాగించడం గమనార్హం. గతంలో పట్టువస్త్రాలు సమర్పించేటప్పుడు, ముఖ్యులు వచ్చినప్పుడు క్యూ లైన్లను ఆపేసేవారు. భక్తులు ఇబ్బందులు పడేవారు. దీనికి భిన్నంగా ఈసారి ముఖద్వారం నుంచి వెళ్లే క్యూను తప్ప.. మిగిలిన అన్ని వరుసల నుంచీ భక్తులను దర్శనానికి అనుమతించారు.

జీఎస్టీ ఫలాలు ఇంటింటికీ చేరాలి!

నేటినుంచి 19వరకు రాష్ట్రమంతా విస్తృత ప్రచారం

అమరావతి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణల ఫలాలు రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ చేరాలని, దీనిపై విస్తృత ప్రచారం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను కోరారు. 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' పేరుతో జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలందరికీ తెలిసేలా రాష్ట్రప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. అందులోభాగంగా ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీతో సీఎం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలను ప్రజలు, వినియోగదారుల్లోకి తీసుకెళ్లేలా విస్తృతప్రచారం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 65 వేల సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. వచ్చే నెల 19వరకు వేర్వేరు థీమ్‌లతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు క్యాబినెట్ సబ్ కమిటీకి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

ఇదీ షెడ్యూల్..

మంగళవారం నుంచి అక్టోబరు 19 వరకు జీఎస్టీ సంస్కరణలపై అవగాహన, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని సీఎం ఆదేశించారు. వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, చేనేత ఉత్పత్తులు, ఆక్వా, విద్యా రంగం, బీమా, ఎలక్ట్రానిక్స్, ఈ కామర్స్, భవన నిర్మాణరంగం, టూరిజం, ఆతిథ్యరంగం, రవాణా, లాజిస్టిక్స్, క్రీడా పరికరాలు, పునరుత్పాదక విద్యుత్తు, ఆటోమొబైల్స్ తదితర అంశాలపై రంగాలవారీగా ఆయా శాఖలు ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆప్కో, లేపాక్షి, ఒక జిల్లా-ఒక ఉత్పత్తి పేరిట మేళాలు, ఎంఎస్ఎంఈ ఉత్పత్తులు, దానికి సంబంధించిన పన్నుల తగ్గింపుపై ప్రచారం నిర్వహించేలా చూడాలన్నారు. సెలూన్లు, యోగా సెంటర్లు, జిమ్‌లలో జీఎస్టీ తగ్గింపు వల్ల ధరల్లో ఎంత వ్యత్యాసం వచ్చిందో అవగాహన కల్పించాలని చంద్రబాబు ఆదేశించారు. జీఎస్టీ తగ్గింపుతో స్టేషనరీ ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గిన అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. వీటిపై అవగాహన కల్పించేలా విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని సీఎం సూచించారు. జీవిత బీమా, ఆరోగ్య బీమాకు సంబంధించి జీరో జీఎస్టీ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు సంబంధించిన ధరలపై అవగాహన కల్పించేందుకు ఉత్పత్తిదారులు, డీలర్లతో జిల్లా, నియోజకవర్గ, మండలాల వారీగా 850కిపైగా కార్యక్రమాలు చేపట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. అక్టోబరు 18న క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని ముగించి, 19న జిల్లా కేంద్రాల్లో షాపింగ్ ఫెస్టివల్, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని, అదే రోజున జిల్లా కేంద్రాల్లో దీపావళి సంబరాలు జరపాలని సీఎం ఆదేశించారు. అక్టోబరు 19వరకు ప్రసార, ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా హోర్డింగులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్, అధికారులు పాల్గొన్నారు.


జీఎస్టీపై మంత్రివర్గ ఉపసంఘం సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, అధికారులు

జీఎస్టీ 2.0తో పశువుల మందులు చౌక..

జీఎస్టీ 2.0తో పశువుల మందుల ధరలు తగ్గాయని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టీ దామోదర్‌నాయుడు సోమవారం తెలిపారు. పశువైద్యానికి వాడే అన్ని డయాగ్నోస్టిక్ కిట్లతో సహా 10 రకాల వెటర్నరీ మెడికల్ ప్రొడక్ట్స్‌పై జీఎస్టీ 5శాతం నుంచి జీరోకు వచ్చినట్లు చెప్పారు. అన్ని రకాల యాంటీబయోటిక్స్, డీవార్మింగ్ మందులపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గిందన్నారు. పశుసంవర్ధక రంగానికి సంబంధించిన ఉత్పత్తులు, వస్తువులు, పరికరాలపై జీఎస్టీ తగ్గుదలపై... రైతులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. పాలు, వెన్న, నెయ్యి, పాలతో తయారుచేసిన జ్యూస్‌లు, నూనెలు, చీజ్ తదితర ఉత్పత్తులపై జీఎస్టీ 5 శాతానికి తగ్గిందని చెప్పారు. పన్నీర్, ప్యాకేజ్డ్, అల్ట్రా-హై టెంపరేచర్ (యూహెచ్‌టీ) పాలుపై 5 శాతం ఉన్న జీఎస్టీని జీరో చేసినట్లు చెప్పారు.

ప్రతి చెరువూ నిండాలి

రాష్ట్రం కరువు రహితం కావాలి

- కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఆదేశం
- ఈ ఏడాది జలాశయాలన్నీ కళకళ
- చెరువులన్నిటినీ అనుసంధానించాలి: సీఎం

అమరావతి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి చెరువూ నిండాలని.. ఏపీ కరువు రహితం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిలషించారు. వరదలపై సోమవారం ఉండవల్లి నివాసం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు మరో ఆరు నెలలు మాత్రమే కురుస్తాయని కలెక్టర్లకు వివరించారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం రిజర్వాయర్లన్నీ జలకళ సంతరించుకున్నాయని చెప్పారు. వర్షాలు కురుస్తున్నప్పుడే చెరువులు, రిజర్వాయర్లను గరిష్ఠస్థాయిలో నింపాలని జల వనరుల శాఖను, కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల్లోని చెరువులన్నింటినీ అనుసంధానం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రమంతా భూగర్భజలాల మట్టాలు పెరగాలని.. కరువనేదే లేకుండా చేయాలని తెలిపారు. రాయలసీమ చెరువుల్లో ఇంకా 9 టీఎంసీల నీటిని నింపాల్సి ఉందన్నారు. రోజూ కృష్ణా, గోదావరి జలాలు లక్షల క్యూసెక్కుల్లో సముద్రంలో కలసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా కేవలం 200 టీఎంసీల కోసం పోరాడాల్సి వస్తోందంటూ పరోక్షంగా పోలవరం-బనకచర్ల పథకానికి తెలంగాణ అడ్డు చెప్పడాన్ని ప్రస్తావించారు. నీటి భద్రత పెంచడానికి గతంలో అన్నా హజారే, రాజేంద్రసింగ్ వంటి వారితో కలసి భూగర్భజలాలు పెంచేందుకు చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. గత ఏడాది ఇదే సమయానికి 907 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. రాయలసీమలో ఇంకా 17 శాతం మేర మేజర్ రిజర్వాయర్లు, 22 శాతం మీడియం రిజర్వాయర్లను నింపాల్సి ఉందన్నారు. సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

4 జిల్లాల్లో మిగులు.. 4 చోట్ల లోటు

- నైరుతిలో సాధారణ వర్షపాతమే
- మొదటి రెండు నెలలు అనావృష్టి
- ఆదుకున్న చివరి రెండు నెలలు
- నేటితో ముగియనున్న సీజన్
- రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్ మంగళవారంతో ముగియనుంది. నాలుగు నెలల సీజన్‌లో తొలి రెండు నెలలు(జూన్, జూలై) తీవ్ర దుర్భిక్షం నెలకొనగా, చివరి రెండు నెలలు(ఆగస్టు, సెప్టెంబరు) అనేకచోట్ల భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్రంలో 570.6 మిల్లీమీటర్లకుగాను జూన్ నుంచి సోమవారం వరకు 553.1 మిల్లీమీటర్ల (3.1 శాతం తక్కువగా) వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లాలో 43.4 శాతం ఎక్కువ, కర్నూలు జిల్లాలో 37.9 శాతం ఎక్కువ, చిత్తూరులో 22.5 శాతం ఎక్కువ, అన్నమయ్య జిల్లాలో 19.6 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. అంటే నాలుగు జిల్లాల్లో మిగులు వర్షాలు కురిశాయి. మరో నాలుగు జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. కోనసీమ జిల్లాలో 30.4%, నెల్లూరులో 20.6%, తూర్పుగోదావరిలో 22.2%, పశ్చిమ గోదావరిలో 23.9% తక్కువగా వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని మిగిలిన 16 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో మొత్తం 670 మండలాలు ఉండగా 29 మండలాల్లో సాధారణం కంటే చాలా ఎక్కువ, 166 మండలాల్లో ఎక్కువ, 351 మండలాల్లో సాధారణ, 157 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాల్లోని ఎక్కువ మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. కోస్తాతో పోల్చితే రాయలసీమలో ఎక్కువ మండలాల్లో మిగులు వర్షం కురిసింది. ఈ ఏడాది మే 29 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయి. అయితే జూన్, జూలై నెలల్లో వర్షాలు ముఖం చాటేయడంతో వేసవి తీవ్రత కొనసాగింది. ఖరీఫ్ పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. ఆ రెండు నెలల్లో సాధారణం కంటే 25 శాతం వరకు లోటు వర్షపాతం నమోదవడంతో రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల్లోనూ వర్షాభావం నెలకొంది. నెల్లూరు జిల్లాలో చాలావరకు పొడి వాతావరణంతో రైతులు సతమతమయ్యారు. అయితే ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు పెరగడంతో ఖరీఫ్ సాగు జోరందుకుంది. అనేక ప్రాంతాల్లో మంచి వర్షాలు కురశాయి. కర్నూలు, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో వరదలు సంభవించాయి. కృష్ణా, గోదావరి బేసిన్‌లో కురిసిన వర్షాలతో డ్యామ్‌లు నిండాయి. వాతావరణ శాఖ లెక్కల మేరకు సెప్టెంబరు 30తో నైరుతి రుతుపవనాల సీజన్ ముగుస్తుండగా, ఆ తర్వాత కూడా వర్షాలు కురిసే వాతావరణం నెలకొంది.

ఉపరితల ఆవర్తనంతో వర్షాలు

ఉత్తర కోస్తా పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం నుంచి ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్, విదర్భ, గుజరాత్ వరకూ ఉపరితలద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో సోమవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రామభద్రపురంలో 7.45, సాలూరులో 6.75, మక్కువలో 6.15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే, ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఆవరించనుంది. దీని ప్రభావంతో బుధవారం ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ తెలిపింది.

హైందవ ధర్మంపై వైఎస్ కుటుంబం నిత్యం దాడి

- జగన్ పాలనలో టీటీడీలో అక్రమాలు: మాధవ్
- టీటీడీ నిధులతో దేవాలయాలు నిర్మిస్తే షర్మిలకేంటి ఇబ్బంది అని నిలదీత



న్యూఢిల్లీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మంపై మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబం నిరంతరం దాడి చేస్తూనే ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. వైఎస్ కుటుంబం మొత్తం హిందూ మతానికి, భారతీయుల ఆకాంక్షలకు వ్యతిరేకమని విమర్శించారు. టీటీడీ నిధులతో 5వేల దేవాలయాలు నిర్మాణం చేపడతామని సీఎం చంద్రబాబు ప్రకటిస్తే ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తప్పుపట్టడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఏపీభవన్‌లో సోమవారం మాధవ్ మీడియాతో మాట్లాడారు. టీటీడీ నిధులతో దేవాలయాలు నిర్మాణం చేస్తే మీకేంటి ఇబ్బంది? అని షర్మిలను మాధవ్ నిలదీశారు. షర్మిల వ్యాఖ్యలపై సోనియా, రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. షర్మిల వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26 ప్రకారం ప్రతి మతపరమైన సంస్థ తన నిధులను ఆ మత ప్రయోజనాలకే వినియోగించుకోవడానికి పూర్తి హక్కు ఉందని తెలిపారు. అందువల్ల, టీటీడీ నిధులతో ఆలయ నిర్మాణాలు చేపట్టడం రాజ్యాంగబద్ధం, చట్టబద్ధమని మాధవ్ అన్నారు. హిందూ సమాజ విశ్వాసానికి కేంద్రబిందువైన తిరుమల తిరుపతి దేవస్థానాన్ని వైఎస్ కుటుంబం పదే పదే అవమానపరచడం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. వైఎస్ జగన్ పాలనలో పరకామణి హుండీ నిధులను దోచుకుని 100 కోట్ల వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో పెట్టారని, దీనికి సాక్ష్యాలు కూడా ఉన్నాయని ఆరోపించారు. జగన్ అవినీతి పాలనపై విచారణ జరుగుతుందని మాధవ్ చెప్పారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తామంటూ పోలీసులను, కాంట్రాక్టర్లను బెదిరించడం సరికాదన్నారు. జగన్ వైఖరిని అన్ని వర్గాల ప్రజలూ ఖండించాలని మాధవ్ పిలుపునిచ్చారు. జగన్ పాలనలో పవిత్రమైన లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు వాడడం, క్రైస్తవుడిని ఛైర్మన్‌గా నియమించడం, బియ్యం, పంచదార, నెయ్యి, జీడిపప్పు వంటి వస్తువుల కొనుగోళ్లలో అవినీతి, శ్రీవాణి నిధులను దుర్వినియోగం, ఇంజనీరింగ్ పనులపేరిట నిధులను దుర్వినియోగం, విదేశీ కరెన్సీని దారిమళ్లింపు, అక్రమ నియామకాలు, అక్రమంగా లక్ష బ్రేక్ దర్శనాల కేటాయింపు వంటి వాటితో టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చారని మాధవ్ ఆరోపించారు.

గుడులు కట్టాలని ఎవరడిగారు?

- బాబు ఆర్ఎస్ఎస్‌వాదిలా మారిపోయారు: షర్మిల



అమరావతి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందంటే చంద్రబాబు మద్దతుతోనేనని, అయితే.. మిత్రధర్మం ముసుగులో చంద్రబాబు ఆర్ఎస్ఎస్‌వాదిగా మారిపోయారని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. దళితవాడల్లో టీటీడీ నిధులతో గుడులు కట్టమని ఎవరడిగారని సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. టీటీడీ చాలా పవిత్రమైన గుడి కాదని ఎవరన్నారని, టీటీడీ దగ్గర డబ్బులెక్కువ ఉంటే.. దళితవాడల్లో గుడులకు బదులు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ హాస్టళ్లలో 200 మంది విద్యార్థులకు ఒకే బాత్రూమ్ ఉన్న పరిస్థితులు ఉన్నాయని, అలాంటిచోట్ల టీటీడీ డబ్బులతో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. దళితవాడల్లో ఐదువేల గుడులు కడితే పూజారులుగా ఎస్సీలను నియమిస్తారా అని ప్రశ్నించారు. దళితవాడల్లో గుడులు కట్టాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.15,780 కోట్ల భారం మోపి.. 923 కోట్లే తగ్గిస్తారా?

గోరంత చేసి కొండంతలుగా చెప్పుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటేనని షర్మిల విమర్శించారు. కూటమి అధికారంలోనికి వచ్చిన తర్వాత 15 నెలల్లో ప్రజలపై రూ.15,780 కోట్ల ట్రూఅప్ భారాన్ని మోపారని ఆరోపించారు. ఇప్పుడు ట్రూడౌన్‌తో తగ్గిన భారం రూ.923 కోట్లు మాత్రమేనని అన్నారు. 2024-25లో సర్దుబాటు పేరిట అదనంగా దోచిన రూ.923 కోట్లను ఈఆర్‌సీ మందలించడంతో తిరిగి చెల్లించారని షర్మిల తెలిపారు. అయితే, అది కూటమి ప్రభుత్వం వచ్చాక తగ్గించిన మొత్తంగా చంద్రబాబు డబ్బాకొట్టుకోవడం, సమర్థత, అనుభవం వంటి మాటలు చెప్పుకోవడం సిగ్గు చేటని విమర్శించారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

- విపత్తు నిర్వహణ సంస్థ సూచనలు

అమరావతి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి నదులకు వరదల నేపథ్యంలో పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. వరద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'వరద నీటిలో ప్రవేశించవద్దు. వరద నీటిలో నడవొద్దు. వరద ప్రాంతాల్లో మురుగు నీటి కాలువలు, కల్వర్టులకు దూరంగా ఉండాలి. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలకు దూరంగా ఉండాలి. ఓపెన్ డ్రెయిన్లు, మ్యాన్‌హోల్స్ వద్ద ఎర్ర జెండాలు, బ్యారికేట్లు ఏర్పాటు చేయాలి. తాజాగా వండిన పొడి ఆహారాన్ని తినాలి. ఆహారాన్ని కవర్, ప్లేట్లతో మూసి ఉంచాలి. వేడి చేసిన, క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలి. వరద ప్రాంతాలను ఖాళీ చేయాల్సి వస్తే.. మంచం, టేబుళ్లు, ఫర్నిచర్‌పై గృహోపకరణాలు ఉంచాలి. ఎత్తైన, సురక్షిత ఆశ్రయాలకు వెళ్లాలి. అత్యవసర వస్తు సామాగ్రి, ప్రథమ చికిత్స పెట్టె, విలువైన వస్తువులు, ముఖ్యమైన పత్రాలను సురక్షిత భవనాల్లోకి తీసుకెళ్లాలి. నీటి మడుగులు, గుంతలు, కాలువల్లోకి దిగకూడదు. అధికారులు చెప్పినప్పుడే తిరిగి సొంతిళ్లకు చేరుకోవాలి. విరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు తాకకూడదు. దోమ తెరలు వాడాలి. పాముల సంచారంతో జాగ్రత్తగా ఉండాలి. దెబ్బతిన్న వాటర్ పైపు, మురుగునీటి పైపుల నుంచి వచ్చే నీటిని వాడకూడదు' అని పేర్కొంది.


ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లు

మళ్లీ కృష్ణా, గోదావరి ఉగ్రరూపం

- ప్రకాశం బ్యారేజీకి నేడు 7లక్షల క్యూసెక్కుల వరద?
- భద్రాచలంలో మొదటి హెచ్చరిక దాటి ప్రవాహం

రాజమహేంద్రవరం/పోలవరం, విజయవాడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతి పెరిగింది. కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చుతోంది. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి 6,39,737 క్యూసెక్కుల వరద వస్తోంది. 69 గేట్లను పూర్తిస్థాయిలోకి ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు. మంగళవారం ఉదయానికి ప్రవాహం 7లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేశారు. కాగా, భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మొదటి హెచ్చరిక దాటి 45 అడుగులకు చేరింది. 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. తూర్పుగోదావరి జిల్లాలోని ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 11.70 అడుగులకు చేరింది. 11.75 అడుగులకు చేరితే మొదటి హెచ్చరిక జారీ అవుతుంది. ఈసారి రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉంది. బ్యారేజీ గేట్లన్నీ ఎత్తి 9,77,625 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని లంకల్లోకి నీరు బాగా పెరుగుతోంది.



పింఛన్ల పంపిణీకి 2,745 కోట్లు విడుదల

- రేపు విజయనగరం జిల్లాలో పాల్గొననున్న సీఎం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలకు రూ.2,745.05 కోట్లు విడుదల చేసిందని గ్రామీణ పేదరిక నిర్మూలన (సెర్ప్) శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ మొత్తాన్ని అక్టోబరు 1న రాష్ట్ర వ్యాప్తంగా 63,50,765 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీటితోపాటు రాష్ట్రంలో కొత్తగా మంజూరైన 10,578 మంది స్పౌజ్ పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం అదనంగా రూ.4.23 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కూటమి వచ్చిన తర్వాత పింఛన్ల కింద లబ్ధిదారులకు రూ.45 వేల కోట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి పింఛన్ల పంపిణీ కోసం రూ.32,143 కోట్ల బడ్జెట్ కేటాయించగా.. అక్టోబరు వరకు పింఛన్ల పంపిణీకి రూ.19,111.85 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

400 కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాం

పండుగ వేళ కానుక: కొల్లు

అమరావతి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పండుగ వేళ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు గొప్ప కానుక ప్రకటించిందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జగన్ వదిలిపోయిన బకాయిల్లో తాజాగా చెల్లించిన రూ.400 కోట్లతో కలిపి మొత్తం రూ.1,788 కోట్లను తీర్చామని చెప్పారు. ఆర్థిక సమస్యల వలన ఏ విద్యార్థి చదువు ఆగిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం అమలు చేసి తల్లిదండ్రులపై భారాన్ని తగ్గించడమే కాకుండా.. విద్యార్థులకు అండగా నిలిచిన ఘనత సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు దక్కుతుందన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు రాక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని కూటమి ప్రభుత్వం గుర్తించి చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఇప్పటికే 10 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు విడుదల అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

జగన్ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,832 కోట్లు, వసతి దీవెన కింద రూ.989 కోట్లు, పీజీ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద మరో రూ.450 బకాయిలు పెట్టారని, వాటన్నింటినీ దశలవారీగా చెల్లించుకుంటూ వస్తున్నామని తెలిపారు.

నేడు ఢిల్లీకి చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్తున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి బయల్దేరి.. అక్కడ భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) సదస్సులో పాల్గొంటారు. విశాఖలో నవంబరు 14, 15 తేదీల్లో సీఐఐతో కలిసి నిర్వహించనున్న పెట్టుబడుల సదస్సుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తారు. ఈ సదస్సుకు దేశవిదేశాల్లోని పెట్టుబడిదారులను ఆహ్వానించేందుకు ప్రభుత్వం రోడ్‌షోలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఢిల్లీలో మంగళవారం సాయంత్రం 4.45 గంటలకు జరిగే సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమిట్ కర్టెన్‌రైజర్ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారు. తన పర్యటనలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ ఆయన సమావేశమవుతారు. రాత్రికి అక్కడే బస చేసి బుధవారం(అక్టోబరు 1న) నేరుగా విశాఖపట్నం చేరుకుంటారు. అదే రోజు విజయనగరం జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొంటారు.

ఇంధన రంగాన్ని గాడిన పెట్టాం

- అధిక ధరకు కొనుగోళ్లకు పవర్ స్వాపింగ్‌తో చెక్
- విద్యుత్ భారం తగ్గిస్తున్నాం
- నవంబరు నుంచి యూనిట్‌కు 13 పైసలు తగ్గింపు: సీఎం

అమరావతి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు మేలు దిశగా కీలక అడుగు పడిందని, దేశ చరిత్రలో తొలిసారి ట్రూడౌన్‌తో విద్యుత్ చార్జీలు తగ్గిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 15 నెలల్లో విద్యుత్ వ్యవస్థల సమర్థ నిర్వహణతో వచ్చిన సత్ఫలితాల కారణంగానే ఈ ఘనత సాధించామని సోమవారం 'ఎక్స్'లో తెలిపారు. పీక్ డిమాండ్ ఉన్న సమయాల్లో అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లకు.. ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ విధానం ద్వారా చెక్ పెట్టామన్నారు. స్వల్పకాలిక కొనుగోళ్లలో ఎక్కువ రేటుకు కరెంటు కొనే అవసరం లేకుండా పవర్ స్వాపింగ్ ఉపయోగపడిందని చెప్పారు. 'సమర్థ నిర్వహణతో విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టి, ట్రూడౌన్ పేరుతో చార్జీలు తగ్గిస్తున్నాం. నవంబరు నుంచి యూనిట్‌కు 13 పైసలు తగ్గుతుంది. ప్రజలకు రూ.923 కోట్ల మేర భారం తగ్గిస్తున్నాం. రానున్న రోజుల్లో క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పెద్ద ఎత్తున విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు నెలకొల్పి ప్రజలకు మరింత చౌకగా విద్యుత్ సరఫరా చేస్తాం' అని వెల్లడించారు.

విద్యుత్తు సంస్థలపైనా భారం

వైసీపీ ప్రభుత్వం విద్యుత్తు సంస్థలనూ అప్పుల్లో ముంచేసింది. చేసిన అప్పులను సమర్థవంతంగా వినియోగించకుండా అడ్డగోలుగా ఖర్చు చేసి విద్యుత్తు వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ఏపీ విద్యుత్తు సంస్థల రుణం 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.62,826 కోట్లు ఉండగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,12,422 కోట్లకు పెరిగింది. అంటే వైసీపీ హయాంలో రూ.49,596 కోట్ల మేర అప్పులు చేశారు. వాటిని సక్రమంగా వినియోగించి ఉంటే విద్యుత్తు ఉత్పత్తి మెరుగుపడి వినియోగదారులపై భారం తగ్గేది. కానీ అదీ జరగలేదు. విద్యుత్తు సంస్థలకు రావాల్సిన బకాయిల్లోనూ గణనీయమైన పెరుగుదల నమోదైంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.12,945 కోట్లుగా ఉన్న బకాయిలు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.52,091 కోట్లకు పెరిగాయి. అసమర్థ నిర్వహణకు ఈ పెరుగుదల నిదర్శనమని విద్యుత్తు రంగ నిపుణులు చెబుతున్నారు.

షాక్‌లకు చెక్!



(మొదటి పేజీ తరువాయి)

సమర్థవంతంగా నడపగలిగితే ఏదైనా సాధ్యమేనన్నది పై ప్రశ్నలకు సమాధానం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్తు చార్జీలను పెంచబోమని, వీలైతే తగ్గిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టారు. వైసీపీ హయాంలో కుదేలైన విద్యుత్తు వ్యవస్థలను చక్కదిద్దడంపై దృష్టి సారించారు. 2019కి ముందు రెన్యువబుల్ ఎనర్జీలో ఏపీ అగ్రస్థానంలో ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది.

నాడు బాదుడే బాదుడు..

వైసీపీ ఐదేళ్ల కాలంలో విద్యుత్తు రంగాన్ని అవినీతికి కేంద్రంగా మార్చేసింది. ప్రజల ప్రయోజనాల కన్నా నేతలు, కాంట్రాక్టర్ల ప్రయోజనాలకే పెద్దపీట వేశారు. ఫలితంగా 9 సార్లు విద్యుత్తు చార్జీలు పెంచారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం, 2019-20 నుంచి 2023-24 వరకు రూ.16,699 కోట్ల మేర విద్యుత్తు చార్జీలను పెంచి, ప్రజలపై భారం మోపారు. ఇంధన సర్దుబాటు చార్జీల (ఎఫ్‌పీపీసీఏ) పేరుతో 2023-24 వరకు మరో రూ.5,886 కోట్లు బాదారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా ట్రూఅప్ చార్జీల పేరుతో బాదుడు మొదలుపెట్టారు. దీని ద్వారా విద్యుత్తు వినియోగదారులపై రూ.3,977 కోట్ల విద్యుత్తు భారం మోపారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో విద్యుత్తు చార్జీలను పెంచి మరో రూ.5,604 కోట్లు వసూలు చేశారు.మొత్తం మీద 2019 నుంచి 2024 వరకు వైసీపీ హయాంలో విద్యుత్తు వినియోగదారులపై మోపిన భారం రూ.32,166 కోట్లు. వైసీపీ తీసుకొచ్చిన ట్రూఅప్ పాపం కూటమి ప్రభుత్వాన్ని వెంటాడుతూ వచ్చింది. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు వసూలు చేసుకోవాల్సిన ట్రూఅప్ చార్జీల ప్రతిపాదనలను వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే విద్యుత్తు నియంత్రణ మండలికి సమర్పించడం, ప్రొవిజనల్ ఆర్డర్ పేరుతో దానికి మండలి ఆమోదం తెలపడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ట్రూఅప్ పేరుతో బాదుడు కొనసాగుతూనే ఉంది. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో తొలిసారి ట్రూడౌన్ పేరుతో ఊరట కలిగించే చర్యలు చేపట్టారు. నిజానికి, జగన్ హయాంలోను ట్రూడౌన్ వెసులుబాటు కలిగింది. అయితే, ఆ ఫలాలను ప్రజలకు అందించలేదు. డిస్కమ్‌లే తమలో తాము పంచేసుకున్నాయి. కానీ, కూటమి ప్రభుత్వం మాత్రం ట్రూడౌన్ ప్రయోజనాలను ప్రజలకు ఇవ్వాలని నిర్ణయించింది. తమకు కలిగిన లబ్ధిని డిస్కమ్‌లు తిరిగి ప్రజలకు ఇచ్చేయడం 1999లో విద్యుత్తు నియంత్రణ మండలి ఏర్పడిన తర్వాత ఇదే తొలిసారి!

నాడు నిలువెత్తు నిర్లక్ష్యం

- వీటీపీఎస్ స్టేజ్-5 యూనిట్ -8(800 మెగావాట్లు) ప్రారంభించడంలో ఆలస్యం వల్ల రూ.2,029 కోట్ల అదనపు వడ్డీ ఖర్చు(ఇంటరెస్ట్ డ్యూరింగ్ కన్‌స్ట్రక్షన్ ఇన్ ప్రాజెక్ట్ ఫైనాన్స్ - ఐడీసీ) భరించాల్సి వచ్చింది. ఉత్పత్తి లేకపోవడం వల్ల స్వల్పకాలిక కొనుగోళ్లు చేయడం వల్ల 4,895 కోట్ల అదనపు భారం పడింది.
- ఎస్‌డీఎస్‌టీపీఎస్(కృష్ణపట్నం) స్టేజ్-2 యూనిట్-3 (800 మెగావాట్లు) ప్రారంభంలో ఆలస్యం వల్ల రూ.2,035 కోట్ల అదనపు వడ్డీ ఖర్చు (ఐడీసీ) భరించాల్సి రావడంతోపాటు స్వల్పకాలిక కొనుగోళ్ల వల్ల రూ.3,860 కోట్ల అదనపు భారం పడింది.
- పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు ప్రారంభంలో ఆలస్యం వల్ల, ఆర్బిట్రేషన్ కారణంగా రూ.1,500 కోట్ల వరకు నష్ట పోవాల్సి వచ్చింది. సివిల్ పనుల జాప్యంతో ధరల వత్యాసం కారణంగా సుమారు రూ.350 కోట్లు అదనపు భారం పడింది. జూన్ 2024 వరకు స్వల్పకాలిక కొనుగోళ్ల వల్ల రూ.1,155 కోట్ల అదనపు భారాన్ని విద్యుత్తు సంస్థలు మోయాల్సి వచ్చింది. స్వల్పకాలిక విద్యుత్తు కొనుగోళ్లు 2019-20 ఆర్థిక సంవత్సరంలో 3,373 మిలియన్ యూనిట్లు ఉండగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 11,655 మిలియన్ యూనిట్లకు పెరిగిపోయాయి. ఫలితంగా రూ.12,250 కోట్ల అదనపు భారం పడింది. గత ఐదేళ్లలో విద్యుత్తు సంస్థలు సుమారు రూ.1.25 లక్షల కోట్లు నష్టపోయాయని విద్యుత్ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

నేడు దిద్దుబాటు చర్యలు...

- వ్యవసాయానికి ఉదయం పూట ఉచిత విద్యుత్తును అందించేందుకు పీఎం కుసుమ్ పథకాన్ని చంద్రబాబు ప్రభుత్వం సద్వినియోగం చేసుకుంది.
- పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు రూఫ్‌టాప్ సోలార్ ఉచితంగా ఏర్పాటుతో విద్యుత్తు భారాన్ని తగ్గించుకునే చర్యలు చేపడుతున్నారు.
- 1500 మెగావాట్లు, 3వేల మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి సిస్టమ్(బీఈఎస్ఎస్)ను ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.
- వైసీపీ హయాంలో 17 శాతంపైగా ఉన్న షార్ట్ టర్మ్ విద్యుత్తు కొనుగోళ్లను 6.8 శాతానికి తగ్గించింది.
- విద్యుత్తు స్వాపింగ్ విధానం తెచ్చింది. మన వద్ద ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి జరిగినప్పుడు దాన్ని ఇతర రాష్ట్రాల అవసరాలను బట్టి వారికి అందించి, మనకు అవసరం ఉన్నప్పుడు తిరిగి ఎలాంటి ఖర్చు లేకుండా పొందే విధానం ఇది. ఈ విధానంలో రాజస్థాన్, హరియాణాకు విద్యుత్తును ఇచ్చి మనకు అవసరం ఉన్నప్పుడు వారి నుంచి మనం విద్యుత్తును తీసుకుంటున్నాం. దీంతో కొనుగోళ్లపై పెట్టే అనవసర ఖర్చులు చాలా వరకు తగ్గిపోయాయి.
- బొగ్గు కొనుగోలు విధానాన్ని ప్రభుత్వం మెరుగుపర్చింది. రెన్యువబుల్ ఎనర్జీని ప్రోత్సహించడం, విద్యుత్తు పంపిణీ నష్టాలను నివారించడం ద్వారా విద్యుత్తు చార్జీలు తగ్గించేందుకు కృషి చేస్తోంది. వీటన్నింటి ఫలితమే ట్రూడౌన్ అనే పదాన్ని తొలిసారిగా రాష్ట్ర ప్రజలు వినగలుగుతున్నారు.

ఏపీలో పెట్టుబడులు పెట్టండి

- సియోల్‌లో ఎల్జీ సహా పలు ప్రతిష్ఠాత్మక సంస్థలకు మంత్రులు నారాయణ, జనార్దన్‌రెడ్డి ఆహ్వానం



సియోల్‌లోని హూ ఆల్స్ కంపెనీలో తయారు చేస్తున్న బూట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ తదితరులు

అమరావతి,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో పలుప్రముఖ బహుళజాతిసంస్థల ప్రతినిధులతో రాష్ట్రమంత్రులు పి.నారాయణ, బీసీజనార్దన్ రెడ్డి బృందం సోమవారం సమావేశమైంది. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానించింది. ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ ఎల్జీ సంస్థ హెడ్‌క్వార్టర్స్‌లో ఆ సంస్థ ప్రతినిధులను కలుసుకుంది. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని తెలిపింది. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఐఐ ఆధ్వర్యంలో విశాఖ సదస్సు తలపెట్టామని మంత్రులు పేర్కొన్నారు.

ఎల్ఎస్ గ్రూప్ ప్రతినిధులతో మంత్రుల భేటీ

సియోల్‌లో ప్రముఖ కంపెనీ ఎల్ఎస్ గ్రూప్ ప్రతినిధులతో మంత్రులు నారాయణ, జనార్దన్‌రెడ్డి బృందం సమావేశమైంది. ఎలక్ట్రిక్స్, ఎలక్ట్రిసిటీ, మెటీరియల్స్, ఎనర్జీ తదితర రంగాల్లో ఎల్ఎస్ గ్రూప్‌నకు విశేష అనుభవం ఉంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటూ ఎల్ఎస్ ప్రతినిధులను మంత్రులు ఆహ్వానించారు. ఈ సమావేశం అనంతరం హూఆల్స్ కంపెనీ ఛైర్మన్ సెవోంగ్ లీతోనూ వారు సమావేశమయ్యారు.



విజయవాడ ఉత్సవ్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు జ్ఞాపిక అందిస్తున్న బుద్దా వెంకన్న, ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు

'విజయవాడ ఉత్సవ్'కు జాతీయ గుర్తింపు

- బాబు పాలనలో కళల పరిరక్షణకు ప్రాధాన్యం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి
- 3 వేల మందితో 2న మెగా కార్నివాల్: ఎంపీ కేశినేని చిన్ని



సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సాంస్కృతిక ప్రదర్శన

విజయవాడ సిటీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'విజయవాడ ఉత్సవ్' జాతీయస్థాయిలో గుర్తింపు పొందిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్'ను సోమవారం ఆయన ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. పండుగలు ప్రజలను ఐక్యం చేసి సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షిస్తాయన్నారు. 'విజయవాడ ఉత్సవ్' ద్వారా అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేశారని నిర్వాహకులను కొనియాడారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి కళాకారులను తీసుకు వచ్చి కళా వైభవానికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పాలనలో సీఎం చంద్రబాబు కళల పరిరక్షణకు సైతం ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలు జరగాలని ఆకాంక్షించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. ఈ వేడుకల ద్వారా పర్యాటకానికి ఊతమిస్తున్నామన్నారు. మొత్తం 3 వేల మంది కళాకారులతో అక్టోబరు 2న బందరు రోడ్డులో 'మెగా కార్నివాల్' నిర్వహించి రికార్డు నెలకొల్పుతామన్నారు.

పచ్చదనంతో వాతావరణ మార్పులకు చెక్..!

- గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ

విజయవాడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో సంభవిస్తున్న అనూహ్య మార్పులను సరిచేయాలంటే పచ్చదనం పెంపొందించాల్సిన అవసరం ఉందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ నూతన డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సుగుణమ్మ మాట్లాడుతూ.. వాతావరణంలో సంభవిస్తున్న అనూహ్య మార్పుల కారణంగా క్లౌడ్ బరస్ట్ వంటి విపత్తులు సంభవిస్తున్నాయని, ఈ మార్పులకు చెక్ పెట్టాలంటే రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్.. రెండూ రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నాయని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను వదిలేసి వెళ్లిందని, ఒకవైపు ఆ చెత్తను తొలగిస్తూనే.. మరోవైపు రోజువారీ వచ్చే చెత్తను తొలగించాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై పడిందని చెప్పారు.

మిథున్‌రెడ్డికి బెయిల్

పలు షరతులతో మంజూరు చేసిన కోర్టు

- రాజమండ్రి జైలు నుంచి విడుదల.. ర్యాలీగా ఎయిర్‌పోర్టుకు

విజయవాడ/రాజమహేంద్రవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ఏ4 నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. దీనికి సంబంధించిన తీర్పును న్యాయాధికారి పి.భాస్కరరావు వెలువరించారు. రూ. 2 లక్షల పూచీకత్తును సమర్పించాలని, సోమవారం, శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు సిట్ ఎదుట హాజరుకావాలని, అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, కేసు గురించి బయట మాట్లాడొద్దని, ల్యాండ్‌లైన్, ఆధార్‌కార్డు, మొబైల్ నంబరు కోర్టులో ఇవ్వాలని షరతులు విధించింది. కాగా, ఇప్పటికే ఆయన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. జూలై 19న సిట్ అధికారులు మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 71 రోజుల పాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బెయిల్‌పై కోర్టు తీర్పు అనంతరం సోమవారం సాయంత్రం 5.55 గంటల సమయంలో జైలు నుంచి మిథున్‌రెడ్డి విడుదలయ్యారు.

జైలు వద్ద వైసీపీ శ్రేణుల హల్‌చల్

మిథున్‌రెడ్డి విడుదల సందర్భంగా జైలు బయట గుమిగూడిన వైసీపీ నాయకులు హల్‌చల్ చేశారు. వారిని నిలువరించడం పోలీసులకు తలకుమించిన భారమైంది. ఒక దశలో వైసీపీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. జైలు నుంచి బయటకు వచ్చాక, అక్కడ ఉన్న శ్రేణులకు మిథున్‌రెడ్డి అభివాదం చేసుకుంటూ కారెక్కారు. అక్కడి నుంచి జైలు ఎదురుగా ఉన్న ఓ స్టార్ హోటల్‌కి వెళ్లి కాసేపటి తర్వాత ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే సీటీఆర్‌ఐ రోడ్డులో వైసీపీ శ్రేణులు పెద్దఎత్తున గుమిగూడారు. సుమారు 50 కార్లు, 200పైగా బైక్‌లతో ర్యాలీ చేశారు. దీంతో ట్రాఫిక్ జామ్ అవడంతో ప్రభుత్వాస్పత్రికి వెళుతున్న అంబులెన్స్‌లు ఇబ్బంది పడ్డాయి. అయితే ఆ ర్యాలీని పోలీసులు నియంత్రించకపోవడాన్ని స్థానికులు తప్పుబడుతున్నారు. వైసీపీ హయాంలో ఓ కేసులో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ప్రస్తుత రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు బెయిల్‌పై విడుదల అయినప్పుడు పోలీసులు టీడీపీ శ్రేణులను తీవ్రంగా నియంత్రించారు. ర్యాలీకి అనుమతి లేదంటూ అప్పారావు, వాసులకు అప్పటి డీఎస్పీ నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు మిథున్‌రెడ్డి ర్యాలీకి అనుమతి ఉందా? అని జనం ప్రశ్నిస్తున్నారు.



జైలు నుంచి బయటకు వచ్చిన మిథున్‌రెడ్డితో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసీపీ నాయకులు

మద్యం స్కాంలో సత్యప్రసాద్‌పై చర్యలు!

(మొదటి పేజీ తరువాయి)

వివరాలు సమర్పించింది. ఆయనపై చట్టపరమైన చర్యలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో తదనంతర చర్యలకు సిట్ ఉపక్రమించింది. విజయవాడ ఏసీబీ కోర్టులో మెమో దాఖలుచేసింది. ఆయన్ను అరెస్టు చేసే అవకాశం ఉందని అంటున్నారు. వాస్తవానికి ఇప్పటికే సత్యప్రసాద్‌పై బీఎన్ఎస్ సెక్షన్లు 7, 7ఏ, 8, 9, 12, 13(1)(బీ).. అవినీతి నిరోధక చట్టం 13(2) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ స్కాంలో కింగ్ పిన్ అయిన రాజ్ కసిరెడ్డి (ఏ-1) కనుసన్నల్లో ఎక్సైజ్ శాఖ నడిచేలా చేయడంలో ఈయన కీలక పాత్ర పోషించారని పేర్కొంది. అప్పట్లో రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న సత్యప్రసాద్.. 2019-24 మధ్య రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్‌లో మార్కెటింగ్ ప్రత్యేక అధికారిగా చక్రం తిప్పారన్నది ప్రధాన అభియోగం. కన్ఫర్డ్ ఐఏఎస్‌గా తనకు అవకాశం కల్పించాలని వైసీపీ ముఖ్యనేతల కోరిక బయటపెట్టారని.. ఇందుకు ప్రతిఫలంగా మొత్తం కుంభకోణానికి రూపకల్పన చేశారని సిట్ ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది. ప్రభుత్వమే మద్యం షాపులు పెట్టి నేరుగా లిక్కర్ విక్రయించడం నుంచి డిస్టిలరీల స్వాధీనం, నాసిరకం బ్రాండ్లు మార్కెట్లో దించడం, ధరలు పెంచడం, ఆ తర్వాత కమీషన్ల రూపంలో భారీగా ముడుపులు వసూలు చేయడం వరకూ ప్లాన్ మొత్తం సత్యప్రసాద్ తయారుచేశారని.. వైసీపీ ఎంపీలు మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి(మాజీ)తో పాటు జగన్ మాజీ ఐటీ సలహాదారు రాజ్ కసిరెడ్డి, కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్రానికి వచ్చిన డి.వాసుదేవరెడ్డి తదితరులతో తరచూ సమావేశమై 2019 అక్టోబరు నాటికి పకడ్బందీగా సిద్ధం చేశారని సిట్ వర్గాలు తెలిపాయి. లిక్కర్ ఆర్డర్లు, డిపోల్లో సరఫరా, ప్రభుత్వ రిటైల్ అవుట్‌లెట్లలో మద్యం విక్రయాలన్నీ ఈయనే నియంత్రించారనేందుకు ఆధారాలు లభ్యమయ్యాయని వెల్లడించాయి.

'సినిమా' దొంగలు దొరికారు!

- అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఐదుగురి అరెస్ట్
- ఐదేళ్ల కాలంలో 500 సినిమాల పైరసీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): డిజిటల్ మీడియాను హ్యాక్ చేసి.. థియేటర్లలో రికార్డ్ చేసి.. పైరేటెడ్ సినిమాలను వివిధ వెబ్‌సైట్ల ద్వారా పంపిణీ చేసి చిత్రపరిశ్రమకు రూ.వేల కోట్ల నష్టాన్ని కలిగిస్తున్న అతిపెద్ద అంతర్రాష్ట్ర ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠాలోని.. బిహార్, తమిళనాడు, ఏపీ రాష్ట్రాలకు చెందిన ఐదుగురు ప్రధాన నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి సీపీయూ, ట్యాబ్స్, హార్డ్ డిస్కులు, స్మార్ట్‌ఫోన్లు, వెబ్‌కామ్, మెమొరీ కార్డులు, మొబైల్స్ ల్యాప్‌టాప్‌లు, డాంగిల్స్ పెన్‌డ్రైవ్‌లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం ఈ కేసు వివరాలను వెల్లడించారు. బిహార్‌కు చెందిన అశ్వనికుమార్, అర్సలాన్ అహ్మద్, తమిళనాడుకు చెందిన సిరిల్ ఇన్ఫంట్‌రాజ్, సుధాకరణ్, ఏపీలోని అమలాపురానికి చెందిన కిరణ్‌కుమార్ ముఠాగా ఏర్పడ్డారు. కిరణ్‌కుమార్ తెలుగు సినిమాలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి పంపేవాడని.. హిట్, సింగిల్, కుబేర, హరిహర వీరమల్లు వంటి సినిమాలను వీరు పైరసీ చేశారని సీపీ తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే 100 సినిమాల దాకా రికార్డ్ చేసినట్టు చెప్పారు. అత్తాపూర్‌లోని మంత్ర మాల్, సినీపోలీస్ థియేటర్లలో ఎక్కువగా పైరసీ చేసేవారని తెలిపారు. 2020 నుంచి వీరు దేశవ్యాప్తంగా వివిధ భాషలకు చెందిన సుమారు 500 చిత్రాలను పైరసీ చేసి, లక్ష డాలర్ల వరకు (రూ.90లక్షలు) సంపాదించారని పేర్కొన్నారు. వీరి వల్ల దేశంలోని వివిధ చిత్రపరిశ్రమలకు రూ.22,400 కోట్లు.. ఒక్క టాలీవుడ్‌కే 2024లో రూ.3,700 కోట్లు నష్టం వాటిల్లినట్లు తేలిందన్నారు.

చెప్పినట్టే విద్యుత్తు చార్జీలు తగ్గించాం

- వైసీపీ సభ్యుల గోలతో మండలిలో చెప్పలేకపోయాం: డోలా



అమరావతి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా విద్యుత్తు చార్జీలను తగ్గించామని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. విద్యుత్తు చార్జీల తగ్గింపు ప్రకటనను కౌన్సిల్ సమావేశంలోనే చేయాలనుకున్నామని, కానీ ప్రతిపక్షం కాఫీ, టీ కోసం గోల చేయడంతో చేయలేకపోయామన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. "విద్యుత్తు చార్జీల తగ్గింపుతో తాడేపల్లికి షాక్ తగిలింది. గత వైసీపీ పాలకులు విద్యుత్తు వ్యవస్థను పూర్తిగా దెబ్బతీశారు. పీపీఏలను రద్దుచేసి కమిషన్ల కోసం అనేక అక్రమాలు చేశారు. హిందూజా వంటి సంస్థలకు ప్రయోజనం కలిగించేలా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు, ఇతర పరికరాలపై అధిక ధరలు విధించడంతో విద్యుత్తు రంగం తీవ్ర సంక్షోభానికి గురైంది. సీఎం చంద్రబాబు నాయకత్వంలో విద్యుత్తు రంగాన్ని తిరిగి పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇచ్చిన హామీ ప్రకారం యూనిట్‌కు 13 పైసలు మేర తగ్గించిన విద్యుత్తు చార్జీలను నవంబరు 1 నుంచి అమలు చేస్తాం. వైసీపీ పాలనలో ప్రజలు కేవలం ట్రూఅప్ అనే పదాన్ని మాత్రమే విన్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా ట్రూడౌన్ అనే పదాన్ని పరిచయం చేస్తోంది. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, నాసిరకం బొగ్గు సరఫరా, అధిక ధరలతో విద్యుత్తు కొనుగోలు చేయడం వంటి చర్యల వల్ల రాష్ట్ర విద్యుత్తు వ్యవస్థ భారీగా ఆర్థిక నష్టాలను చవిచూసింది. కూటమి ప్రభుత్వం చార్జీల తగ్గింపుతో పాటు బార్బర్ సెలూన్లు, చేనేత వర్కింగ్ షెడ్లు, ఆక్వా రైతులకు సబ్సిడీతో విద్యుత్తు అందిస్తోంది" అని అన్నారు.

బీసీల ప్రగతిని వైసీపీ ఓర్వలేకపోతోంది

- అధికారం పోయినా మార్పు రాలేదు: పిల్లి మాణిక్యరావు



అమరావతి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బీసీల ప్రగతి చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు విమర్శించారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... వైసీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు బడుగు, బలహీన వర్గాలపై దాడులు, హత్యలు చేసి వారి జీవనాధారాన్ని ధ్వంసం చేశారని, ఇప్పటికీ వారిలో మార్పు రాలేదన్నారు. టీడీపీ కార్యకర్త చంద్రయ్యను పట్టపగలు వైసీపీ నరహంతకులు కిరాతకంగా హత్య చేశారని, అలాంటి చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటే మండలిలో బొత్స సత్యనారాయణ అడ్డుకోవడం మానవత్వం లేని చర్య అని మండిపడ్డారు.

'లెవెంత్ రెడ్డి'కి బుర్ర పోయింది!

- ప్రతిపక్ష హోదా ప్రజలివ్వాలి: సంధ్యారాణి



సాలూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, పులివెందుల ఎమ్మెల్యే లెవెంత్ రెడ్డికి బుర్రపోయినట్టుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఆ నాయకుడిని ఛీకొట్టి 11 స్థానాలకే పరిమితం చేసినా ఏమాత్రం మార్పు రాలేదన్నారు. మన్యం జిల్లా సాలూరులో సోమవారం ఆమె మాట్లాడారు. వైసీపీ శాసనసభ్యులకు ప్రజా సమస్యలు పట్టడంలేదని, ఆ నాయకుడి భజనే వారికి ముఖ్యమైపోయిందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా, వాళ్ల నాయకుడు చెప్పినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ప్రతిపక్ష హోదా అనేది ఎవరూ ఇవ్వరని, ప్రజలే ఇవ్వాలని, ఆ మాత్రం జ్ఞానం లేకుండా పదేపదే హోదా కావాలని కోరడాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. 11 సీట్లకు పరిమితమైనా జగన్‌రెడ్డి తీరులో మార్పు రాకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.